ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 4 సంచిక - 6 మార్చి 2023 పేజీలు 68 వెల రూ. 20



# ఉత్తేజకరంగా రెడ్ బుక్ డే

ఫిబ్రవరి 21న రెడ్ బుక్ డే సందర్భాన్ని పురస్కరించుకొని పలుచోట్ల శ్రీశ్రీ 'మహాప్రస్థానం' గీతాలను పఠించారు. పిల్లలు మొదలుకొని, పెద్దల దాకా ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆర్థిక మాంద్యం, మతోన్మాద పోకడలు, సంపద కేంద్రీకరణ పెచ్చుపెరుగుతున్న నేపథ్యంలో 'మహాప్రస్థానం' చూపిన మార్గాన్ని అనుసరించాల్సి ఉందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. 'మహాప్రస్థానం' గీతాల ప్రాధాన్యాన్ని సమకాలీనతను వివరించారు.



ఖమ్మంలో...



విశాఖలో...



వనస్థలిలో...



గుంటూరులో...

సాహిత్య ప్రస్థానం

మార్చి 2023
సంపుటి : 4 సంచిక : 6

# మదర్ ఇండియా మాట !

**ఆ**ర్ఆర్ఆర్ సినిమాలో అ నేక అంతర్జాతీయ పురస్కారాలు పొందడం, నాటు నాటు పాట అత్యున్నతమైన ఆస్కార్ ఎంపికల జాబితాలో చోటు సంపాదించడం అసాధారణ విషయమే! దాంతో తెలుగు సినిమా ప్రపంచ స్థాయికి చేరిందనే ఉత్సాహం పరవళ్లు తొక్కుతున్నది. చంద్రబోస్ రాసిన ఆ పాట జానపద శైలిలో వుండటం బ్రిటిష్ దురహంకారాన్ని ప్రశ్నించడం వల్లనే ఒరిజినల్ క్యాటగిరీలో విజయం సాధించింది. ఆస్కార్ కొలబద్దలు, అనుభవాలు అనేకం వున్నా ఇందులోని సందేశం స్పష్టమే! ప్రశ్నించడం, ప్రతిఘటించడం సారాంశంగా మన్నన పొందింది. ఈ విస్తృత కోణాలను విస్మరించి కేవలం గ్లామర్, డాన్స్ పరిమితుల్లోనే పరిశీలిస్తే సరైన అవగాహనకు రాలేము. ఆ చిత్రం అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్ పాత్రల ఛాయల్లో రూపొందినా ... కథనం ఊహాజనితమైందే. సీతారామరాజును రామావతారంలా చూపించడంపైనా విమర్శలు వచ్చాయి. తెలుగులోనూ ప్రతిభావంతులైన దర్శకులు, సామాజిక న్యాయం కోరేవారు కూడా ఈ ఆకర్షణతో అటు నడుస్తున్న సంకేతాలున్నాయి. వేల కోట్ల లెక్కల్లోకి చేరుతున్న సినిమా ఖర్చులు కార్పొరేట్ శక్తుల చేతుల్లో దాన్ని బందీని చేస్తున్నాయి. ఆర్ఆర్ఆర్ సృష్టికర్తల నుంచే ఇప్పుడు ఆరెస్సెస్ కథను ముందుకు తేవడం యాదృచ్ఛికం కాదు. ఆ సినీ రచయిత ఈలోగా రాజ్యసభ పదవి పొందడం వెనక ఈ కారణాలు లేకుండానూ పోవు. మొదటి నుంచి ప్రగతిశీలతకూ, మానవీయ విలువలకూ మత సామరస్యానికి పట్టం కట్టిన తెలుగు సినిమా మత విభజన వైపు నడిస్తే అంతకన్నా విచారకరమైంది వుండదు.

కాశ్మీర్ ఫైల్స్‌తో సహా హిందీ తదితర భాషల్లో మతతత్వ రాజకీయ ప్రచారం పెరిగిపోవడంపై పరిశీలకులు ఆందోళన చెందుతున్న సందర్భంలోనే, షారుఖ్‌ఖాన్ నటించిన పఠాన్ సినిమా అఖండ విజయం ఒకింత ఉపశమనం కలిగించక మానదు. కథలూ నటీనటులను బట్టి ఇటీవలి కాలంలో బాయకాట్‌లూ, బహిష్కరణలూ, విద్వేష ప్రచారాలూ బాలివుడ్‌ను కలుషితం చేశాయి. అలాటి బహిష్కరణ పిలుపులనే బహిష్కరించి పఠాన్‌ను ప్రజలు ఆదరించారు. అది కూడా ఫార్ములా చిత్రమే అయినా, ప్రస్తుత కలుషిత విద్వేష వాతావరణంలో ఇది ఉపశమనమే. అది కూడా సామాన్య ప్రేక్షక మహాశయులు ఇచ్చిన సందేశం. మదర్ ఇండియా లేదా భారత మాతకు కుల మత జాతి భేదాలు లేవని మనమంతా ఒక్కటేనని చెప్పే సందేశం. విభేదాల ఆధారంగా విషబీజాలు నాటాలని వినాశకర పథకాలు పన్నే విద్వేష శక్తుల పథకాలకు విరుగుడు ఇదే. లాభాల కోసమో, పెత్తనాలకు భయపడో ప్రజల మధ్య గోడలు కట్టడం కళాకారులు చేయవలసిన పని ఎంత మాత్రం కాదు. చెట్టపట్టాల్ పట్టుకుని దేశస్తులందరు నడవవలెనోయ్ అన్న గురజాడ మాటే మన బాట కావాలి. ■

ప్రధాన సంపాదకుడు
**తెలకపల్లి రవి**
వర్కింగ్ ఎడిటర్
**సత్యాజీ**

సంపాదకవర్గం
**కె.సత్యరంజన్** • **కెంగార మోహన్** • **వొరప్రసాద్**
• **చీకటి దివాకర్** • **గనారా** • **కుమార స్వామి**
మేనేజర్ : **కె.లక్ష్మయ్య**

బొమ్మలు
**తుంబలి శివాజి**
**చిదంబరం**

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

ఈ సంచికలో ... **సాహిత్య ప్రస్థానం** మార్చి 2023

## కథలు


బ్యాంకాకులు : వి.రెడ్డెప్ప రెడ్డి .............. 5
అంచనాలు : పి.శ్రీనివాస్ గౌడ్ ..........18
జీవ వైవిధ్యం : పిఎల్ఎన్ మంగారత్నం .. 31
ఇద్దరూ ఒక్కరే! : కుడుపూడి శ్రీను .......... 53


## కవితలు


ఊపిరి శబ్దం నాన్న : పుట్టి గిరిధర్ ................ 7
ఎర్ర కవల గులాబీలు : కవి కొమ్మవరపు ........... 9
రాజమండ్రి పద్యం : మెట్టా నాగేశ్వరరావు ........ 13
పాలకోవా బిళ్ళ : వంజారి రోహిణి .......... 14
ఎదురీది చూడు : శ్రీదేవి సురేష్ కుసుమంచి .. 17
నది ప్రశ్నిస్తోంది : నూతలపాటి సాంబయ్య ...... 17
ఆమెకు ప్రేమతో ... : గంగవరపు సునీత .......... 20
శ్వాస చినుకులు .. గుప్పెడు! : కంచరాన భుజంగరావు ..... 21
స్వేచ్ఛ కోసం ... : నెల్లుట్ల సునీత ................ 24
అంతిమ సంస్కారం2030 : రత్నాల బాలకృష్ణ .......... 24
ఆమె రాక : సత్య భాస్కర్ .............. 27
నువ్వుంటే... : డాక్టర్ డివిజి శంకరరావు 27
ఇరానీ చాయ్ : ఎస్.హనుమంతరావు ... 30
మంజూషమా .. జోహారు : చిన్ని నారాయణ రావు .... 30
బతుకు అంటే .... : గవిడి శ్రీనివాస్ ............. 34
ఆత్మవిశ్వాసమే ఈ యుగ సూత్రం : డా. కత్తి పద్మారావు ........ 35
విముక్త గీతం : టీనా ......................... 42
కూలిన నగరంపైన డేగ : ఈతకోట సుబ్బారావు ...... 43
అమ్మా...! : అను : డా. వెన్నా వల్లభరావు 43
వంద్రంగి : కిల్లాడ సత్యనారాయణ ...... 46
ముల్లు : వైష్ణవి శ్రీ .................... 52
నీల కురింజ సముద్రం : ప్రగతి ....................... 57


## వ్యాసాలు


భూత భవిష్యత్తు వర్తమానాల 'పుస్తకాలం'
– ఎమ్వీ రామిరెడ్డి .................... 10
కవితాలోకంలోకి కొత్త గాలి
– రావెల సాంబశివరావు ............ 15
మనసును తడిమే కలుంకూరి గుట్ట కథలు
– నరహరిరావు బాపురం ............ 22
మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా గళమెత్తాలి!
– అరసం రాష్ట్ర మహాసభలు ...... 25
సానుకూల దృక్పథంతో జీవితాన్ని దర్శించే కథలు
– సత్యాజీ ............................. 28
సముద్ర జలాల మీద పోరాట యోధుడి సంతకం
– డాక్టర్ కె.జి.వేణు ................. 36
ముఖాముఖి : స్త్రీవాద అవగాహనను సరిచేసుకుంటూ ఉండాలి
– ఆచార్య కాత్యాయనీ విద్మహే ... 39
విపరిణామాలపై విశ్లేషణాత్మక వ్యాసాలు
– కేశవ్ ..............................44
వర్తమానం: క్రోనీ విధానాలు; జాతీయ ప్రయోజనాలు అనే భ్రాంతి!
– సంజయ్ రాయ్ .................. 47
భాషాదోషాల నివారణకు జాగ్రత్తల సూచి
– దొండపాటి కృష్ణ................ 50
పర్యటన : కన్నడ సంస్కృతికి దర్పణం ... మైసూరు
– డా. నాగసూరి వేణుగోపాల్ .... 58
శ్రీశ్రీ జయభేరి ఆరో ముద్రణ ఒక చరిత్ర ................ 61
ఉత్తేజకరంగా రెడ్ బుక్ డే – అంకె శ్రీనివాస్ ........... 62
పుస్తకాలు .................................................. 64



ISSN No: 2581 - 7477


**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**


:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::
సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com
1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585,
IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.



# బ్యాంకాకులు

- వి. రెడ్డెప్ప రెడ్డి
94400 44922

ఢిల్లీ ఎయిమ్స్ ఆసుపత్రి, గుండెజబ్బుల విభాగం, దేవళంపాడు చలమేశ్వరకు కృత్రిమశ్వాసకై వారంపాటు అమర్చిన వెంటిలేటరును తప్పించి 2022, జనవరి, పదిహేనవ తేదీన మరణ ప్రకటన వెలువడింది. ఉత్తమ దినాల్లో చావు, శ్రాద్ధకర్మ జరిగితే మోక్షప్రాప్తి లభిస్తుందని నమ్మి వారంపాటు వెంటిలేటరుపై ఉంచారు. చలమేశ్వర కొడుకు పరమేశ్వరను పరామర్శించడానికి వచ్చినవారు "మీ తండ్రి ఉత్తరాయణ ప్రవేశ పుణ్యకాలంలో స్వర్గస్థులయ్యారు. పుణ్యలోకాలకు వెళతారు" అన్నారు. పదమూడవ రోజు "ఉత్తరాయణం, గురువారం, దశమి పుణ్యతిథినాడు శ్రాద్ధకర్మ నిర్వహిస్తుండడంతో మీ తండ్రికి స్వర్గప్రాప్తి లభిస్తుంది" అంటూ కర్మ నిర్వహించిన స్వాములూ చెప్పారు.

చలమేశ్వర దైవభక్తి అందరికీ తెలిసిందే. అంతకుముందు ఏ మేర పాటించేవారో తెలీదుకానీ, ఎంపీ అయ్యాక అతడికి దేవుడిపై భక్తి పెరిగిందని తెలిసినవాళ్లంటారు. ఎంతగా అంటే, పూజాసమయానికి బయలుదేరవలసి వచ్చినా, లేదా పూజాసమయానికి దిగలేనేమోననిపించినా విమానం కూడా ఎక్కేవాడు కాదు. పూజావేళలు తప్పించే పార్లమెంటుకు కూడా హాజరయ్యేవాడు.

భక్తి విషయంలో తండ్రిని మించిన తనయుడు కొడుకు పరమేశ్వర. భక్తిభావంతో జరిపిన పూజలే తమను ఆర్థికంగా, రాజకీయంగా ఎదగడానికి సాయపడ్డాయని నమ్ముతాడు. అలాంటి భక్తిలో భాగంగానే తండ్రికి పెట్టిన శ్రాద్ధపు కూడు తినడానికి కాకులు రావేమోనని ఫారెస్ట్ డిపార్టుమెంటు సాయంతో కాకులను తన ఇంటిమీద వాలే ఏర్పాట్లు చేయించాడు. ప్లేట్లలోను, పాకెట్లలోనూ మిగిలిపోయిన జంకు తిండికి అలవాటుపడ్డ పట్టణకాకులు రుచిపచీ లేని శ్రాద్ధపు కూటిని సాయంత్రపు చీకటి సమయమైనా ముట్టుకోలేదు. "బ్యాంకులను దిగమింగి పాపాల్జేసి పోయాడు. వీడి పాపాలకు నలుగురు బాంకు ఉద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారు. వీడి శ్రాద్ధపుకూటిని కాకులేల ముట్టుకుంటాయి?" అని విషయం తెలిసిన ఓ బ్యాంకు మేనేజెర్ లోపల అనుకున్నట్లే బయటికే అనేసాడు.

■■■

కేంద్ర పాలక పార్టీ దశమ ఆవిర్భావ దినోత్సవం ఆడంబరంగా జరపడానికి పార్టీ నిర్ణయించింది. అట్లాంటి ఉత్సవం ఏ రాష్ట్రంలో జరిగితే అక్కడికి దేశస్థాయి నాయకులు వస్తారని, అప్పుడు జరిగే చర్చలతో, నిర్ణయాలతో రాష్ట్రంలో పార్టీ కొత్త జవసత్వాలు పొందుతుందని నాయకుల నమ్మకం.

తమ రాష్ట్రంలో అంటే, తమ రాష్ట్రంలో జరపాలని నాయకులు పోటీలు పడ్డారు. "మా రాష్ట్రంలో జరిపితే ఖర్చు మొత్తం నేనే భరిస్తా"నన్నాడు చలమేశ్వర. ఆ ఆవిర్భావ దినోత్సవ నిర్వహణకు ఐదొందల కోట్లు ఖర్చయింది.

రెండేళ్ళ తర్వాత వచ్చిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో తమ పార్టీ తరుపున నిలబడిన ఇరవై మంది ఎంపీ అభ్యర్థులు ఎన్నికల ఖర్చు రెండువందల కోట్లు తనే భరించాడు. ఇంత

ఖర్చుపెట్టి గెలిపించిన ఎంపీలు తన గ్రూపుగా ఉంటారని, గ్రూపుబలంతో ఖచ్చితంగా కేంద్రంలో కేబినెట్ మంత్రి అవుతానని అతడి నమ్మకం. అయితే తన అదృష్టదేవత నిద్ర లేవలేదు, పార్టీ ఓడిపోయింది. కొడుకు పెళ్ళి ఘనంగా జరిపాడు. తన నియోజకవర్గంలోని అన్ని కుటుంబాలకు వివాహా ఆహ్వానాలు పంపాడు. వారంరోజులు మందు విందులకు లోటు లేకుండా ఏర్పాట్లు చేశాడు. కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గం నుంచి అందరూ పెళ్ళికి వచ్చేటట్లు చూసుకున్నాడు. పెళ్ళికి వంద రకాల వంటలు ఏర్పాటు చేయించాడు. వచ్చిన వారందరికీ వారి వారి స్థాయిని బట్టి బహుమతులు పంచాడు. 500 కోట్ల ఖర్చు తేలింది.

కూతురి పెళ్లి దుబాయిలో చేశాడు. అతిధులను ప్రత్యేక విమానాల్లో తరలించాడు. తన నియోజకవర్గంలో పాస్ పోర్టు కలిగిన ప్రతి ఒక్కరిని పెళ్ళికి పిలిపించాడు. మరో 500 కోట్ల ఖర్చు తేలింది.

తెలిసినవారు "ఎందుకిలాంటి దుబారా"లన్నారు. "ఈ ఖర్చులు, ఈ పరిచయాలు తన రాజకీయ ఎదుగుదలకు పెట్టుబడి" లాంటివని చలమేశ్వర జవాబిచ్చాడు.

▪▪▪

చలమేశ్వర మరణం కొడుకు పరమేశ్వరకు ఒకవైపు శుభపరిణామంగానూ, మరోవైపు అశుభంగానూ పరిణమించింది. తండ్రి మరణంతో ఖాళీ అయిన ఎంపీ సీటు తనకే ఇవ్వనున్నట్లు పార్టీ ప్రకటించింది. తండ్రి మరణంతో ఏర్పడ్డ ఖాళీ స్థానంలో కొడుక్కు సీటు ఇచ్చారు గనక ప్రతిపక్షం పోటీ పెట్టలేదు. కానీ ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్ వేయడంతో ఎన్నికలు తప్పలేదు. జరుగుతున్నవి సానుభూతి ఎన్నికలయినప్పటికీ పరమేశ్వర మాత్రం గెలవడం మహాయజ్ఞంలా భావించి యాభై కోట్లు ఖర్చుపెట్టాడు.

"ఎలాగూ గెలుస్తామని తెలిసీ యాభైకోట్లు ఖర్చు పెట్టడమెందుకూ?" ప్రశ్నించాడు పరమేశ్వర తమ్ముడు యజ్ఞేశ్వర.

"ఎన్నికల్లో మనం పెట్టే ఖర్చులకు భయపడి ఇంకెవరూ ఈ నియోజకవర్గంలో నిలబడే సాహసం చేయకూడదు. ఇప్పుడు మనం ఖర్చుపెట్టక మన మెజారిటీ తగ్గితే, రాబోయే ఎన్నికలప్పుడు ఇతరులు ఈ సీటు అడగవచ్చు. ఇప్పుడే అధిక మెజారిటీ సాధిస్తే రాబోయే ఎన్నికలప్పుడు సీటు ఇతరులకిచ్చే సాహసం పార్టీ చేయదు." జవాబిచ్చాడు పరమేశ్వర.

▪▪▪

పరమేశ్వరను ఎన్నికల్లో ఎదిరించని ప్రతిపక్ష పార్టీ, అతడు గెలిచాక అసలు యుద్ధం ప్రారంభించింది. అతడి తండ్రి చలమేశ్వర బ్యాంకుల్లో చేసిన అప్పు వివరాలు, అప్పులు తిరిగి కట్టని వైనం తరచూ పార్లమెంటులో ప్రస్తావించడం మొదలెట్టింది. ప్రతిపక్ష నాయకుడు దేవేంద్ర పార్లమెంటులో ప్రస్తావిస్తూ, "చలమేశ్వర బ్యాంకుల్లో ఎనిమిది వేల కోట్ల రూపాయలు అప్పుచేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ కట్టేందుకని ఇండియన్ మర్కంటైల్ బ్యాంకులో 2011లో ఐదువందల కోట్ల అప్పుచేశారు. సిమెంటు ఖనిజం కోసం ప్రభుత్వమిచ్చిన భూమిని హామీగా చూపెట్టి అప్పు తీసుకున్నారు. ఫ్యాక్టరీ కట్టలేదు. ప్రభుత్వమిచ్చిన భూమిలోని ఖనిజాన్ని అమ్ముకున్నారు."

"2014లో హైడ్రో-ఎలక్ట్రిక్ పవర్ ప్లాంటు నిర్మాణం కోసమంటూ ముంబై రేవంసీ బ్యాంకులో రెండువేల కోట్ల అప్పు మంజూరు చేయించుకున్నారు. కట్టని సిమెంటు ఫ్యాక్టరీని, ఖనిజం కోసం ప్రభుత్వం ఇచ్చిన భూమిని హామీగా చూపారు. మొదటి విడతగా వెయ్యి కోట్లు బ్యాంకు నుంచి డబ్బు తీసుకున్నారు. ప్లాంటుకు కావలిసిన నీళ్ళు కర్ణాటక ప్రభుత్వం ఇవ్వడం లేదని సాకు చూపి, తమిళనాడు ప్రభుత్వం నీళ్ళు ఇవ్వడానికి సిద్ధమని, పవర్ ప్రాజెక్టును ఆ రాష్ట్రానికి మార్చనున్నామని బ్యాంకుకు లెటర్ ఇచ్చారు. మిగతా వెయ్యికోట్ల అప్పు తీసుకున్నారు. ప్రాజెక్టు మాత్రం కట్టలేదు"

"గంగా-కావేరి లింకు ప్రాజెక్టు ప్రాధమిక రిపోర్టు తయారు చేసే కాంట్రాక్టు తమ కంపెనీకి వచ్చిందని 2019లో గుజరాత్ స్టేట్ కమర్షియల్ బ్యాంకునుంచి ఐదువేల కోట్ల రూపాయలు అప్పు మంజూరు చేయించుకున్నారు. ఆ ప్రాజెక్టుకు సంబంధించి ఎటువంటి ప్రకటన వెలువడక పోయినా తమ కంపెనీకి కాంట్రాక్టు వచ్చినట్లుగా తప్పుడు పత్రాలు బ్యాంకుకు సమర్పించారు. లోను మంజూరయింది. సగం డబ్బు బ్యాంకు నుంచి తీసేసుకున్నారు."

"గోదావరి నదిపై సోలార్ పవర్, హైడ్రో పవర్ కలిపి ఉత్పత్తి చేసే ప్రాజెక్టు నిర్మించడానికంటూ స్టేట్ బ్యాంకు అఫ్ చెన్నైనుంచి ఐదువేలకోట్లు అప్పుమంజూరు చేయించుకున్నారు. నదిపై ఏర్పాటు చేసే సోలార్ పానెల్లను బ్రెజిల్ దేశంనుంచి దిగుమతి చేసుకున్నామని, డబ్బుచెల్లించి వానిని విడిపించవలసి ఉందని చెప్పి బ్యాంకునుంచి మూడువేల కోట్లు తీసుకున్నారు."

"మొత్తంగా ఎనిమిది వేల కోట్లు అప్పు వివిధ బ్యాంకులకు చెల్లించాల్సి ఉంది. ఇన్ని అప్పులు చేసినా ఏ ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. మొదటి అప్పు తీర్చడానికి రెండవ అప్పు, రెండవ అప్పు తీర్చడానికి మూడో అప్పు, అలా ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేశారు. అప్పు మొత్తంసొమ్ము ఏంచేశారు? అప్పు మంజూరయిన ప్రాజెక్టులపై కాకుండా వేరెక్కడయినా పెట్టుబడి పెట్టారా? లేక ఇతర దేశాలకు తరలించారా? అనేది తేలవలసి ఉంది. దీనిపై సి బి ఐ విచారణకు ఆదేశించాలని

కోరుతున్నాను" అంటూ తన ప్రసంగాన్ని ముగించాడు.

■■■

ఎన్నికలు ఆరునెలల్లో వొస్తాయనగా 'ఆర్థిక దోపిడీ' అంటూ రోజుకొక పాలకపక్ష నాయకుడి పేరు చెప్పి ప్రతిపక్షం రచ్చచేయడం, పాలక పార్టీ నాయకులందరూ దోపిడీదారులని ప్రజలను నమ్మించాలని చూడడం, ప్రతిపక్షంలో మాత్రం అందరూ 'ఆర్థిక ధర్మరాజులే' అన్నట్లు ప్రచారం చేయడం దేశంలో ప్రతి ఎన్నికలప్పుడూ జరిగేదే. ఎన్నికల తరువాత ఏ పక్షంవారూ ఆ విషయాలపై ప్రస్తావించక పోవడం, ప్రస్తావించినా ఎంక్వయిరీ కమిటీలకు పరిమితం కావడం దేశ ప్రజల అనుభవం.

రోజుకొక నాయుకుడి ఆర్థిక దోపిడీపై జవాబు చెప్పాల్సిన ఆర్థిక మంత్రి, పార్లమెంటులో జవాబులు చెప్పడంలో తలమునకలై ఉన్నాడు. పరమేశ్వరను ఎలా కాపాడాలో ఆలోచించే సమయంలేని మంత్రి జవాబిస్తూ, విచారణకు పార్లమెంటరీ సంఘాన్ని వేస్తాం" అంటూ సమాధానం చెప్పడంతో రచ్చ సద్దు మణిగింది.

■■■

పార్లమెంటులో నిత్యం జరిగిన చర్చ వల్లనేమో రాజకీయ నాయకులు చేసే అప్పులగురించి, పాత అప్పులు తీర్చకనే కొత్త అప్పులు తీసుకునే విధానం గురించి ప్రజల్లో కూడా నిత్యం చర్చ జరుగుతూనే ఉంది. చేసిన అప్పులు, కట్టని అప్పులు చర్చకు రావడం వల్లనేమో, తాము పదివేలు అప్పు తీర్చకుంటేనే లాయర్ నోటీసులిచ్చి, కోర్టుకు ఈడ్చే బ్యాంకులు పరమేశ్వరకు వేలకోట్ల అప్పు, అప్పు మీద అప్పు ఎలా ఇచ్చారు? ప్రజల్లో చెలరేగిన ఈర్ష్యతో ఈసారి ఎన్నికల్లో యాభై కోట్లు ఖర్చు పెట్టినా ఎంపీగా పరమేశ్వర ఓడిపోయాడు. పరమేశ్వరపై ఎంక్వయిరీ కమిటీ వేశారు.

అప్పు కంతులు కట్టమని బ్యాంకుల నుంచి, పిలిచినపుడు రావాలని పార్లమెంటరీ కమిటీ నుంచి, ప్రజా ప్రయోజనం పేరుతో కేసు వేయడంతో కోర్టు నుంచి, కేసును విచారించమని కోర్టు ఇచ్చిన తాఖీదుతో సమన్లు పంపిన సిబిఐ నుంచి, బ్యాంకుల్లో తీసుకున్న డబ్బు ఏం చేశారో వివరించమని ఈడి నుంచి వస్తున్న ఒత్తిళ్ళను తట్టుకోవడం కష్టమని, ఇలాంటి ఒత్తిడులు ఇంకా పెరుగుతాయని పరమేశ్వర గ్రహించాడు.

ఈ ఆలోచన వచ్చాకా నాలుగురోజులు నిద్రపోలేక పోయాడు. నాలుగో రోజు కోడి కునుకు పట్టగానే, ఓ విచిత్రమైన కలవచ్చింది. కోర్టులో కేసు విచారిస్తున్న జడ్జీగారు "ఎనిమిదివేల కోట్లంటే ఎంతో తెలుసా? అంత డబ్బు పెట్టి ఏ నీటిప్రాజెక్టో కట్టిఉంటే, ఆ ప్రాజెక్టు కింద వేలకుటుంబాలు బతికిపోయేవి.



## ఊపిరి శబ్దం నాన్న

**గా**లికి కొట్టుకుపోయే
మేఘం వంటివాడు నాన్న
అయితేనేం..
ఎండ ప్రతాపాన్ని ఆపగలడు
చల్లని వానను కురిపించగలడు!

గాలికి ఎగిసిపడే
దుమ్ములాంటివాడు నాన్న
అయితే ఏం..
మట్టిలా ఆధారమవగలడు
బతుకుపంటకు ఊతమవ్వగలడు!

గాలికి ఆరిపోయే
దీపంలాంటి వాడు నాన్న
అయితే ఏం..
వెలుగుదారిని చూపగలడు
ఎదురైన కష్టాలను కాల్చగలడు!

తేలికగా కనబడే నాన్న
అందరి బరువును తేలిగ్గా మోస్తాడు
అందంగా తయారవని నాన్న
అందరిలో తనను చూసుకుంటాడు!

గుండెచప్పుడు మాత్రమే వినిపించే
నిలువెత్తు నిశ్శబ్దం నాన్న
ఊపిరిశబ్దం మాత్రమే వినిపించే
ఇంటిశ్వాస నాన్న!

తన కలలను మన కళ్ళతో చూస్తూ
అవి నిజమయ్యేలోపు
కలలా కనుమరుగైపోతాడు
తన అడుగులను
మనకు మెట్లుగా పేర్చి
అవి ఎక్కేలోపు
అందనంత ఎత్తుకు సాగిపోతాడు!

**- పుట్టి గిరిధర్**
**94949 62080**

లేదా ప్రతికుటుంబానికి ఐదేసి లక్షలు ఖర్చుపెట్టి ఇండ్లు కట్టించి ఉంటే లక్షా అరవై వేల కుటుంబాలకు నీడ దొరికేది. 33 లక్షల మంది పిల్లలకు సంవత్సరం పాటు పాలు దొరికేవి. ఇన్ని జీవితాల అవసరాలను మట్టిలో కలపడమంటే వేలమందిని హతమార్చడంతో సమానం. ఇలాంటివాళ్ళు జీవించడం భూమికి భారం, మరణశిక్ష అమలు చేయండి," అంటూ తీర్పు చెప్పారు. కలలో వచ్చిన తీర్పు నిజమైతే ... భయం పట్టుకుంది పరమేశ్వరకు.

ఈ కమిటీలు, కోర్టుకేసులు, తీర్పులు తప్పించుకోవాలంటే ఒకటేమార్గం. ఎంపీ కావడమే మార్గం. రాజ్యసభ పదవీకాలం ముగిసిన ఎంపీల స్థానంలో తను ఎంపిక కావడమే ఇందుకు సులభమైన మార్గమనుకున్నాడు. ముప్పైమంది ఎమ్మెల్యేలను కొని రాజ్యసభకు ఎన్నికయ్యాడు.

నెలకోసారి బ్యాంకులనుంచి కట్టాల్సిన కంతుల గురించి నోటీసులు ఆగడం లేదు. కంతులు కట్టడానికి తన బ్యాంకు అకౌంటులో డబ్బు లేదు. మిగిలిన మార్గమొక్కటే. తిరిగి బ్యాంకులో అప్పు చేయడం. కొత్తగా అప్పులు చేసి పాత అప్పులు తీర్చడం తన తండ్రి చేశాడు. తను ఇన్నాళ్ళూ అదే చేశాడు. ఏదో ఒక బ్యాంకులోను ఇప్పించమని ప్రార్థిస్తూ పరమేశ్వర తిరగని గుడి లేదు, మొక్కని దేవుడు లేదు.

■■■

బ్యాంకులు అప్పుల వసూలు విషయంలో కొత్తబాటలు వేశాయి. బ్యాంకు ఆఫీసర్లు వసూళ్ళపై దృష్టి పెడుతుండడం, వసూలుకు సంబంధించిన కోర్టుకేసులు చూడడం, అప్పు చేసిన వ్యక్తి ఎక్కడున్నాడో తెలుసుకోవడం, అక్కడికెళ్లి అప్పు తీర్చమని అడిగేలోపు అతడు ఉడాయించడం, ట్రాన్సఫర్లవల్ల అప్పు ఇచ్చిన ఆఫీసర్ ఒకరు కావడం, అప్పు వసూలు చేయవలసింది మరొకరు కావడం, ఎప్పటికి తీరనవిగా పెద్ద అప్పులు మిగిలిపోవడం, అధికార్లకు ప్రాణాపాయ బెదిరింపులు రావడంలాంటి టెన్షన్లతో బ్యాంకులకు సంబంధించిన మిగతా వ్యవహారాలు కుంటుబడుతున్నాయని బ్యాంకులు గుర్తించాయి. ఈ సమస్య పరిష్కారానికి 'అప్పు వసూలు ఏజెన్సీ'లను నియమించుకోవడం మంచిదని, వసూలు చేసినందుకు ఏజెన్సీలకు రెండు శాతం కమీషన్ ఇవ్వడానికి నిర్ణయించాయి.

■■■

అప్పుల వసూలుకు నెలకొల్పిన ఏజెన్సీల రిజిస్ట్రేషన్ విషయంలో అన్ని కార్యకలాపాలు ముగించుకుని, అన్నిటికంటే ముందు 'జ్ఞానేశ్వర ఏజెన్సీస్' బ్యాంకులకు అప్లికేషన్ సమర్పించింది.

సులభంగా అప్పు వసూలుకు వీలుపడే జీవులేవో జ్ఞానేశ్వర ఏజెన్సీ గుర్తించింది. మరెవరు రైతులే, లేదంటే సన్న వ్యాపారులే!

"కొత్తగా అప్పు వసూలు కోసం నియమింపబడ్డ సంస్థలు ఇంతో అంతో టైం ఇస్తార్లే" అంటూ అప్పు తీసుకున్న రైతులు, సన్న వ్యాపారులు చర్చించుకున్నారు. వాళ్లకు తెలీదు, పూలమొక్కలేని ఎడారిలో సైతం తేనెతుట్టెలు వెతికి తేనె తీయగలవారు వసూలు ఏజెంట్లు. మంచి అనే మాటే తెలియని చోట మంచితనం వెతకడం లాంటిదే వాళ్ళ ఆశ.

'పల్లేరు ముల్లు ఊడబెరుక్కోలేనోడు పరిక్కంప ఊడ బెరుక్కునేనా?' జీతం కోసం పనిజేసే ఉద్యోగులతో వేగలేని రైతులు, సన్న వ్యాపారులు పర్సెంటేజి కోసమే పనిజేసే వసూలు ఏజంట్లను తట్టుకోగలరా? భూములు, ఇళ్ళు, బంగారు, అంగళ్లు 'యాడికొస్తే ఆడికి' వీళ్ళు అమ్ముకున్నారు. బ్యాంకు అసలు, వడ్డీ కట్టేశారు. అప్పువసూలుకు నియమించబడ్డ జ్ఞానేశ్వర ఏజెన్సీ దుర్మార్గాలకు యాభైమంది రైతులు, సన్న వ్యాపారస్తులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

'బిక్షకోసం గుడ్డోడు పాడితే కళ్ళున్నోడు బిక్ష స్వీకరించినట్లు,' రైతులు, సన్న వ్యాపారుల నుంచి జ్ఞానేశ్వర ఏజెన్సీస్ వసూలు చేసిన మొత్తం పరమేశ్వర వాడుకుంటున్నాడు. వసూలు చేసిన అప్పులు బ్యాంకులో జమచేయడానికి పక్షం రోజుల సమయముంటుంది. అలా వసూలు చేసిన డబ్బు చేతిలో మెదులుతుండటంతో బ్యాంకులో అప్పుకోసం అడుక్కోవలసిన పనిలేదు. అవసరాలు తీరిపోతున్నాయి. పరమేశ్వర నాలుగు బ్యాంకులకు శ్రాద్ధం పెట్టాడు. శ్రాద్ధపు కూటి ముద్దను పొడిచి పొడిచి తినే కాకిలా బ్యాంకులను దోచుక తింటూనే ఉన్నాడు, దేవుళ్ళకు మొక్కుతూనే ఉన్నాడు. ■



## డా.రాధేయకు

## అమృతలత జీవన సాఫల్య పురస్కారం

ప్రముఖ కవి, విమర్శకులు, ప్రతిష్ఠాత్మక ఉమ్మడి శెట్టి అవార్డు వ్యవస్థాపకులైన డా.రాధేయకు నిజామాబాద్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి అమృతలత జీవన సాఫల్య పురస్కారం -2023 ప్రకటించారు. మార్చి 5వ తేదీన నిజామాబాద్‌లో ఈ పురస్కార ప్రదానం జరుగుతుంది. గత యాభై ఏళ్లుగా కవిత్వం రాస్తూ, ముప్పై అయిదేళ్లుగా ఉత్తమ కవిత్వానికి ఉమ్మడిశెట్టి అవార్డులను ప్రదానం చేస్తున్నందుకు గానూ రాధేయని ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు సంస్థ ప్రకటించింది.

## ఎర్ర కవల గులాబీలు

- కవి కొమ్మవరపు
89854 35514



దీన్సిగ తరగ
ఈ ముదనష్టపు కాలానికి
ఏమైందో ఏమోగానీ
దాహం తీర్చే మంచినీళ్ళు కూడా
ఇంకా కులపు కంపుకొడుతూనే ఉన్నాయి
పల్లెల్లోనే అనుకుంటే పట్నాలకూ పాకి
జిలుగు మెరుపుల ముఖాల్లోనూ
తిష్ట వేసుక్కూచుందీ కులం

తల్లిని కోల్పోయి
గుక్కపట్టి ఏడుస్తూ
ఆకలితో అలమటించే బిడ్డకు
తల్లిలా పాలిచ్చి ప్రాణం పోసే
తల్లి కులమేమిటో
వెతికే సమాజంలో శ్వాసిస్తున్నాం!

వల్లకాట్లో కూడా కులం చెప్పందే
శవ దహనం చేయని వీరబాహుడికీ
భూమ్మీద నూకలు చెల్లక
కులం సర్టిఫికెట్ చూపించందే
ఖననం చేయని దుస్థితి రాజ్యమేలుతుంటే
కళ్ళు, చెవులు మూసుకుని
ముక్కుకు మాత్రమే పని చెబుతున్నాం!

కడుపు నింపే అన్నం మెతుకులను
తెల్లగా ఎవరు పండించారో,
వాళ్ళ కులమేమిటో అడగని లోకంలో–
పత్తిపువ్వుకూ, మిరపపువ్వుకూ
కులపు రంగు పులిమి
మార్కెట్ మాయజాలంతో
వాటికీ మతం రంగు పూసి
నడిరోడ్లపై నాట్యం చేస్తున్న
అపర మైకేల్ జాక్సన్‌లు పుట్టుకొచ్చిన నేలపై
మతమొక క్రూర కసిగాయాల సలపరింత!

డబ్బున్నోడే అయినా ..
తక్కువ కులపోడు అంటరానివాడిగానే
పరిగణింపబడుతున్న చోట–
అక్షరమ్ముక్క రానోడు కూడా అగ్రవర్ణం పేరుతో
మహా నాయకుడుగా కీర్తించబడుతున్న చోట
నాకు కులం లేదని చెబితే
నన్ను పిచ్చోడిలా చూస్తున్న
ఈ కులపిచ్చి క్రూర మానవ మృగాలకు
కొరుకుడు పడని ప్రశ్నలా నేనిప్పుడు
అనేక రహదారుల కూడలిలో ...

నాగరికతకు చిరునామా నా దేశమని
దేవాలయాల్లో అంగ ప్రదక్షిణలు చేస్తున్న
నా దేశ వాసులారా!
ఆకలికి కులం లేనప్పుడు
నిద్రకు కులం లేనప్పుడు
జబ్బులకు కులంతో సంబంధం లేనప్పుడు
మీకెందుకురా తండ్రీ ఈ కులం జబ్బు ...

మరిప్పుడైనా..
కులం కార్డుని హరిశ్చంద్రుడి
సమాధి పక్కన బొంద పెడదామా
కులరహిత ఎర్రటి కవల గులాబీలను కనే తల్లులకు
స్వాగతం చెబుదామా..!
ఎదగని మెదళ్లలో
నాలుగు బోధి వృక్షాలను నాటుదామా..!






# భూత భవిష్యత్ వర్తమానాల 'పుస్తకాలం'

- ఎమ్వీ రామిరెడ్డి
98667 77870

**చిరిగిన చొక్కానైనా తొడుక్కోచి ఒక మంచి పుస్తకం కొనుక్కో**
**– కందుకూరి వీరేశలింగం**

మనసులేని మనిషి, పుస్తకం లేని ఇల్లు నిరర్థకం. ఆస్తులూ అంతస్తులూ సమస్త బాంధవ్యాలూ కోల్పోయినా, పుస్తకం ఒక్కటీ తోడుగా ఉంటే చాలు. అది మనల్ని పునర్నిర్మిస్తుంది. రక్తమాంసాలు ఎక్కిస్తుంది. జవజీవాలు ప్రసాదిస్తుంది. ఇంత సాహిత్యాన్ని ప్రసాదంగా పెడుతుంది. సాహిత్యం జీవితాన్ని ఉన్నతీకరిస్తుంది. సమాజాన్ని సమున్నతం చేస్తుంది. పుస్తకాలు ప్రసాదించిన వెలుగులోనే ఉచ్ఛ్వాస నిశ్వాసలు తీసుకున్న, తీసుకుంటున్న మహానుభావులు ఎందరో ఉన్నారు.

కానీ, ప్రస్తుతం పుస్తకం బిక్కమొహం వేసి దీనంగా చూస్తోంది. తనను తాకే చేతుల సంఖ్య తగ్గిపోయిందన్న దిగులుతో కుంగిపోతోంది. డిజిటల్ యుగంలో తన ప్రాధాన్యాన్ని విస్మరిస్తున్న మనిషి వంక జాలిగా చూస్తోంది. పుస్తకం విలువ తెలియని మనిషి కళాహీనంగా, చైతన్యరహితంగా నిస్సారమైన జీవితాన్ని అనుభవిస్తాడన్న జాలి అది. పుస్తక ప్రాభవం గుర్తించని వ్యక్తులు ఈ సమాజంలో వెలుగుధారలు నింపలేరన్న జాలి అది.

చదివేవారి సంఖ్య తగ్గిపోతోందనీ, పుస్తకం బూజు పట్టిపోతోందనీ తెగ బాధపడే బదులు... అధ్యయనపు ఆవశ్యకతను వివరించే మేలు ఒకటి తలపెడితే పోలా... అనుకున్నారు పరిశోధకుడు, సాహితీవేత్త జి.ఎస్.చలం. అనుకున్నదే తడవు, పని ప్రారంభించారు. పుస్తక ప్రాధాన్యం తెలియజెప్పటానికి తానేమీ పుంఖానుపుంఖాలుగా రాయలేదు. ఇప్పటికే ఆ పనిచేసిన వారిని దుర్భిణీ వేసి వెతికి పట్టుకున్నారు. 'పుస్తకం'పై ప్రముఖులు వెలిబుచ్చిన అమూల్యమైన అభిప్రాయాలూ, విశ్లేషణాత్మక వ్యాసాలూ, కనువిప్పు కల్గించే కవితలూ వార్తా కథనాలూ, ఆణిముత్యాల్లాంటి సూక్తులూ గుదిగుచ్చారు. అన్నిటినీ ఒకచోట చేర్చి అక్షరాభిషేకం చేశారు. ఆ సంకలనాన్ని 'కాలం' ఒడిలో నిలబెట్టాలనుకున్నారు. అందుకే 'పుస్తకాలం' అని నామకరణం చేశారు.

◆◆◆

'ఈ ప్రపంచంలో మన కళ్లెదుట కనిపించే దేవతలే పుస్తకాలు' అంటారు అబ్రహాం లింకన్.

"ఒక సంస్కృతిని నాశనం చేయటానికి పుస్తకాలను కాల్చే పనిలేదు. జనం వాటిని చదవకుండా చూస్తే చాలు" అంటారు అమెరికన్ రచయిత రే బ్రాడ్బరీ.

"పుస్తకాన్ని కాల్చడానికి మించిన పెద్ద నేరాలున్నాయి. అందులో ఒకటి వాటిని చదవకపోవటం" అంటారు రష్యన్ కవి జోసెఫ్ బ్రాడ్స్కీ.

మౌఖిక రూపం నుంచి రాళ్ల మీదికీ, రాగి రేకుల మీదికీ; చర్మ, తాటాకులు, చేతి కాగితం మీదికీ లిపి వ్యాపించింది. లిపి, ముద్రణ అనే అంశాలు తలచుకునేటప్పుడు అశోకుడు, షుల్జీ, విలియం కేరీ వంటి మహానుభావులను స్మరించుకోవాలి. అచ్చుయంత్రాన్ని తయారు చేయటానికి జొహాన్ గుటెన్ బర్గ్ పడిన కష్టాలు, భారతీయ భాషల్లో ముద్రణ యజ్ఞానికి శ్రీకారం చుట్టిన విలియం కేరీ వెతల గురించి తెలుసుకోకపోతే, అసలు పుస్తకం విలువే తెలియదు.

'ముద్రిత గ్రంథాల చరిత్ర మహోన్నతం' శీర్షికన బెజవాడ శరభయ్య రాసిన వ్యాసంలో గ్రంథాల పుట్టుపూర్వోత్తరాలు,

అవి మనిషిని సానబెట్టిన వైనంతోపాటు గాంధీ, నెహ్రూ, వీరేశలింగంలపై పుస్తకాల ప్రభావం వంటి అంశాలను ఆసక్తికరంగా వివరించారు. ముఖ్యంగా ప్లేటో రచన రిపబ్లిక్, అరిస్టాటిల్ ఎథిక్స్, పాలిటిక్స్, పోయిటిక్స్ మాకియవెల్లి, ద ప్రిన్స్, సర్ థామస్ మోర్, యుటోపియా, జాన్ లాక్, సివిల్ గవర్నమెంట్, రూసో; సోషల్ కాంట్రాక్ట్, థామస్ పేస్; ఏజ్ ఆఫ్ రీజన్, జాన్ స్టూవర్టు మిల్; ఆన్ లిబర్టీ, రిప్రజెంటేటివ్ గవర్నమెంట్– గ్రాంట్ అల్లెన్; ఇవల్యూషన్ ఆఫ్ ద ఐడియా ఆఫ్ ద గాడ్ వంటి గ్రంథాలు ప్రపంచగతి మార్చిన తీరును గొప్పగా విశ్లేషించారు. 'పుస్తకాలు లేని గది ఆత్మలేని శరీరం వంటి'దని ఓ విదేశీయుడు చెప్పిన విషయాన్ని సందర్భాను సారంగా ప్రస్తావించారు శరభయ్య.

బాల్యం నుంచే గోర్కీ జీవితాన్ని పుస్తకాలు ఎలా మలుపు తిప్పగలిగాయో 'వెలుతురు దారి'లో తెలుసుకోవచ్చు. పుష్కిన్, గొగోల్, టర్జెనోవ్, లెర్మంటవ్, చెహూవ్ తదితర రచయితలు తనకిష్టమైన 'పుస్తకాల చెరసాల'లో మగ్గిపోయేలా చేశారంటారు గోర్కీ. "ప్రజలను అంధకారంలో ఉంచి, వారి మూర్ఖపుటలవాట్ల నుండి, అజ్ఞానం నుండి రాజకీయంగా లాభాలు పొందుతున్న వ్యవస్థకు నిప్పు పెట్టాలంటే పుస్తకాలే సాధనం" అంటారు ముల్కరాజ్ ఆనంద్ 'మానవ జీవితంపై పుస్తకాల ప్రభావం' వివరిస్తూ.

తన సంపాదనలో అధిక భాగం పుస్తకాలు కొనటానికే వెచ్చించేవారట అంబేద్కర్. పై చదువులకు విదేశాలు వెళ్లినప్పుడు ఎక్కువ ధనం పుస్తకాలకే ఖర్చయ్యేదట. రౌండ్ టేబుల్ సమావేశానికి వెళ్లినప్పుడు శ్రీనివాసన్ చేత 32 పెట్టెల నిండా పుస్తకాలు ఇంటికి పంపిన అంబేద్కర్ భారత్ తిరిగి వచ్చేటప్పుడు తనవెంట మరో 24 పెట్టెల నిండా పుస్తకాలు తెచ్చుకున్నారట. ఈ విషయాలు చదివినప్పుడు ఆయన అపార మేధకు కారణమేమిటో బోధ పడటం లేదూ!

అప్పట్లో పల్లెపట్టుల్లో పుస్తకాల పరిస్థితి ఎలా ఉండేదో వివరించారు మధురాంతకం రాజారాం. పట్నం వెళ్లేవారిని 'కాస్త ఈ పుస్తకం కొని తే నాయినా' అని బతిమాలే వాతావరణాన్ని చిత్రించారు. మర్యాద రామన్న కథలు, మదన కామరాజు కథలు, బట్టి విక్రమార్క కథలు, తెనాలి రామలింగం కథల దగ్గర్నుంచి సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి అనే బృహత్ జానపద నవల దాకా ఎన్నో పుస్తకాల గురించి మధురంగా చెప్పారు. "ఎంతటి బృహత్ గ్రంథాన్ని తెరిచి చూసినా మచ్చుకొక్క అచ్చుతప్పు కనిపించదు గదా! అచ్చయిన ఫారాలను నోటీసు బోర్డుపైన అతికించి, ఒక అచ్చుతప్పు కనిపెట్టిన వారికి అర్ధరూపాయి పారితోషికం ప్రకటించేవారట! ఒక ప్రచురణ సంస్థగా వావిళ్ళ వారు, ఒక పత్రికగా ఆంధ్రపత్రిక వారు చేసినంత భాషా సాహిత్యసేవలు మన విశ్వవిద్యాలయాలన్నీ కలిసి చేయగలిగాయా అన్నది నా అనుమానం!" అంటారు మధురాంతకం.

'పుస్తకాలే నన్ను పులిని చేశాయి' అని చెప్పిన వేలుపిళ్లై ప్రభాకరన్ 'చదివే అలవాటులో భాగంగానే భారత జాతీయో ద్యమంతోనూ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్, బాలగంగాధర్ తిలక్ వంటి అమరవీరులతోనూ నాకు గాఢమైన మానసిక సాన్నిహిత్యం ఏర్పడింది' అంటారు. 2009లో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ఈ వ్యాసాన్ని 'పుస్తకాలం'లో చేర్చటం చలం ప్రత్యేక కృషికి నిదర్శనం.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'అనుభవాలూ జ్ఞాపకాలూను'లోంచి సేకరించిన భాగం 'శ్రవణానందం' పేరిట ఆకట్టుకుంటుంది. 'ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని లైబ్రరీ ఎవరికి ఏయే ఉపకారాలు చేసిందో నాకు తెలియదు కాని, ఆ లైబ్రరీ నాకు మాత్రం తెలియని లోకాలను చూపెట్టింది' అంటారు రాచకొండ విశ్వనాథశాస్త్రి.

◆ ◆ ◆

"నేను చదివినదంతా నా మనసులో మెదుల్తోంది. ఋగ్వేద అగ్నిసూక్తాలు, దశోపనిషత్తులు, గీత, సంస్కృత నాటకాలూ, సంగం యుగం నాటి పంచ మహాకావ్యాలూ, బుద్ధచరిత్ర, హిమాలయమంత పోగుపడే జైన, బౌద్ధ, వేదాంత దర్శన, శంకర గానలహరి, కబీరు, పోతన, బసవేశ్వరుడు, త్యాగరాజ స్వామి, ఆళ్వారుల మహిమాన్విత భక్తిగీతాలు– ఇవన్నీ గుర్తున్నాయి. టాగూర్, ప్రేమ్‌చంద్, శరత్, చలం, సుబ్రమణ్య భారతి, కేశవ్ సుత్, నజ్రుల్ ఇస్లాం, నిరాలా, తోరూ దత్, మన్‌మోహన్ ఘోష్, గోపీనాథ్ మొహంతి గుర్తున్నారు' అంటూ 1987లోనే ఆంధ్రప్రభ వారపత్రికలో వాడ్రేవు చినవీరభద్రుడు రాసిన వ్యాసం మనల్ని పట్టి కుదిపేస్తుంది. నవోదయ రామ మోహనరావు 'పుస్తకాలు లేని ప్రపంచం ఎలా ఉంటుందో ఊహించి, అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో జురాసిక్ టెక్నాలజీ మ్యూజియం' గురించి చెప్పిన విషయం అబ్బురపరుస్తుంది.

"నాకు నేనే నన్ను అధ్యాయులుగా చింపుకుంటున్నాను. జలజలా రాలే కన్నీళ్లు, మెలి తిప్పేసే ఆకలి, ధారలుగా కారే జ్ఞాపకాలు, ఒలికిపోయిన ప్రేమలు, అకారణ వెలివేతలు, ఒక్కో అధ్యాయంలో నిండి ఒక్కొక్కరు టాల్‌స్టాయ్, గొగోల్, దోస్తొవిస్కీ, మార్క్వెజ్, కామూ, ప్రేమ్‌చంద్, మంటో, కిషన్ చందర్, తగళి, పొట్టేకాట్, కారంత, రావిశాస్త్రి, పతంజలి, కేశవరెడ్డి– మొత్తం వీళ్లే! ఇక నేనున్నదెక్కడ?' అంటూ 'పుస్తకాల చితి మీద నుంచి...' శీర్షికన రాసిన జె.వి.ఎన్.మూర్తి వ్యాసం చాలాకాలం

మనల్ని వెన్నాడుతుంది.

పదిహేడేళ్ల వయసులో చదివిన 'ఫ్రాంక్లిన్ డి రూజ్‌వెల్ట్' (అమెరికా మాజీ అధ్యక్షుడు) జీవిత చరిత్ర తనను ఎంతగా ప్రభావితం చేసిందో దేవినేని మధుసూదనరావు వివరించారు.

'నేను పుస్తకాలు లేకుండా జీవించలేను' అంటాడు థామస్ జెఫర్‌సన్. హారీ పోటర్ పుస్తకాలను మన పిల్లలూ విపరీతంగా కొని చదివారు. 'పోన్లే, అట్లా అయినా పిల్లలు పుస్తకాలు చదువుతున్నా'రని సరిపెట్టుకుందామంటే, 'పాతకాలపు కాన్వెంటు పిల్లలు ఆ పుస్తకాలు కొన్నారేగానీ– నారాయణ, శ్రీ చైతన్యలాంటి విద్యాసంస్థల పిల్లలు ఆ దాపులకు రాలే'దని ఓ బుక్‌షాపు ఓనర్ కుండబద్దలు కొట్టి మరీ చెప్పాడని కాకర్లమూడి విజయ్ తేల్చిపారేశారు. రోజుకు కేవలం 15 నిమిషాలైనా చదవటానికి కేటాయిస్తే, సంవత్సరానికి 1800 పేజీలు చదవగలమని బీవీ పట్టాభిరామ్ ఒక అద్భుతమైన చిట్కా చెప్పారు. పాటించేస్తే పోలా! నార్మన్ విన్సెంట్ పీలే రాసిన 'ది పవర్ ఆఫ్ పాజిటివ్ థింకింగ్', వేన్‌డైన్ 'పుల్లింగ్ యువర్ ఓన్ స్ట్రింగ్స్', ఆంథోని రాబిన్స్ 'అన్‌లిమిటెడ్ పవర్' వంటి పుస్తకాలు లక్షలాది ప్రజల జీవితాల్ని మార్చేశాయని పట్టాభిరామ్ చెప్పారు.

'లోకం కథల లతల పందిరి' అంటారు రవీంద్రనాథ్ టాగూర్. పుస్తకాలతోపాటు పెద్దలు పిల్లలకు కథలు చెప్పాల్సిన ఆవశ్యకత, తద్వారా పిల్లల్లోని సృజనశక్తులు వికసించే తీరును వివరించిన టాగూర్ వ్యాసం పాఠకులకు అదనపు తాయిలం.

తన తాతయ్య స్ఫూర్తితో, అమెరికాలో గ్రామగ్రామాన గ్రంథాలయాలు స్థాపించటానికి ఆస్తులు వెచ్చించిన ఆండ్రూ కార్నెజీ ప్రేరణతో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ద్వారా పదివేల గ్రంథాలయాలకు పుస్తకాలు కొనిచ్చినట్లు సుధామూర్తి చెప్పిన విషయాలు మనలోనూ కదలిక తెస్తాయి. యు.కె.లో ప్రతి ఒక్క పిల్లాడికీ ఆరు బాలల పుస్తకాలు అందుబాటులో ఉంటే, మన దేశంలో 11 మంది పిల్లలకు ఒక్క బాలల పుస్తకం అందుబాటులో ఉందని ప్రస్తావించిన సాక్షి దినపత్రిక సంపాదకీయాన్ని సైతం చేర్చటం చలం అచంచల కృషికి నిదర్శనం. ఈనాడు, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి వంటి ప్రముఖ దినపత్రికలు, మరికొన్ని వార–మాస పత్రికలు పుస్తక ప్రాధాన్యంపై వెలువరించిన విలువైన సంపాదకీయాలను చేర్చి ఈ సంకలనాన్ని సంపద్వంతం చేశారు.

కె.ఎన్.వై.పతంజలి, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, చలసాని ప్రసాదరావు, చుక్కా రామయ్య, నార్ల వెంకటేశ్వరరావు, పి.వి.సుబ్బారావు తదితరులు రాసిన వ్యాసాలు పుస్తకం విశ్వరూపాన్ని ఆవిష్కరిస్తాయి. పుస్తకం చివర్లో అనుబంధంగా ఇచ్చిన కవితలు, తెలుగు–ఇంగ్లిషు భాషల్లోని విలువైన సూక్తులు పుస్తకాన్ని మరింత వెలుగులో ఆవిష్కరించే దారిదీపాలు.

పుస్తక ప్రాధాన్యం గురించి మాట్లాడిన వారిలో ఎక్కువమంది చేసిన గొప్ప సూచన ఏమిటంటే– మహాత్మా గాంధీ ఆత్మకథ (సత్యశోధన) తప్పనిసరిగా చదవాలి. పిల్లలతో చదివించాలి.

'పుస్తకాలం' పుస్తకం చదివితే కొన్ని వందల మంచి పుస్తకాల పేర్లు, వాటి రచయితల గురించి కొంతయినా తెలుసుకో గలుగుతాం. చరిత్ర అట్టడుగున పడి కనిపించని కొన్ని కోణాలైనా అవగతమవుతాయి. (ఉదా: 1820 ప్రాంతంలో అమెరికాలో నల్లవారు చదువుకుంటున్నట్లు రుజువైతే బొటనవేలు, చూపుడువేలు తెగకోసేవారట) (పేజీ నం. 86)

ప్రపంచంలో తొలి పుస్తక ప్రదర్శన జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌లో జరిగింది. 500 ఏళ్లకు పైగా ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఏటా అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన జరుగుతూనే ఉంది. మన దేశంలో కోల్‌కతాలో గడచిన నాలుగున్నర దశాబ్దాలుగా ఏటా అంతర్జాతీయ పుస్తక ప్రదర్శన జరుగుతోంది.

ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ పట్టణాలు, నగరాల్లోనూ పుస్తక ప్రదర్శనలకు ఆదరణ లభిస్తోంది. ఈ ఆదరం మరింత పెరగాలి. అధ్యయన దాహం పెరగాలి. పిల్లల్లో పఠనాసక్తి పరవళ్లు తొక్కాలి. పుస్తకం వెలుగులో ఈ సమాజం చైతన్యభరితం కావాలన్న సత్సంకల్పంతో జి.ఎస్.చలం ప్రచురించిన ఈ సంకలనం నిజంగా తెలుగువారికి ఒక వరం. మంచి పుస్తకం, విజ్ఞాన ప్రచురణలు (9440503061) సహకారంతో ఈ సంకలనాన్ని అమూల్య కానుకగా అందించటం అభినందనీయం. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం ఇది. ■



**అవివేకి హృదయం**
**అతని నోటిలో వుంటుంది.**
**కాని వివేకి నోరు మాత్రం**
**అతని హృదయంలో వుంటుంది**
**- ఫ్రాంక్లిన్**



**జడప్రాయంగా వున్న**
**అమిత జ్ఞానం కన్నా**
**చైతన్యరూపంలో వున్న**
**పరిమిత జ్ఞానం మిన్న**
**- ఖలీల్ గిబ్రాన్**

# రాజమండ్రి పద్యం



రాజమండ్రిలో పాదం మోపగానే
కోటిపల్లిలో
కందుకూరి బొమ్మను చూశాను
జీవితాన్ని
సంస్కరించుకోగలనని నమ్మాను

బొమ్మూరు మెట్ట నాకు పునర్జన్మ
సాహిత్యం వంటబట్టిందక్కడే
కొత్తగబ్బిలంతో
దోస్తీ కుదిరిందక్కడే
వర్తమాన సమాజంలో
అసమానతలు తెలిసిందక్కడే
నల్లద్రాక్ష పందిరి నీడలో
ప్రాసలమూట గట్టుకుందీ అక్కడే!

నేదునూరి గంగాధరం
యింటికి వెళ్లాను
సన్నిధానం వారి సన్నిధికి మరలమన్నారు
జనపదాలను
పెదాలకు సింగారించుకున్నాను

చిత్రాంగి మేడలో రాజరాజు లేడు
సారంగధర కొండ మీద మాత్రం
చెప్పుడు మాటలు విని
కోల్పోయిన వాత్సల్యం కనబడ్డది

దానవాయిపేటలో
సైకిలేసుకుని వెతికాను
మైదానం గానీ
సౌరీస్ స్వేచ్ఛగానీ తారసపడతాయనీ
అంతకు మించిన
ఆధునికతను కనుగొన్నాను

కోటిలింగాలరేవు సమీపంలో
కవికోకిల అడుగు జాడల్ని అన్వేషించాను
ఫిరదౌసి పద్యాలను పాడుతుంటే
గోదారి అలల గలగలలు
సంగీతాన్ని సమకూర్చాయి!

పడాల గారి వెంటపడ్డాను
అల్లూరి విల్లంబును
పుస్తకంగా మార్చిచ్చారు
కొంత పౌరుషం పెరిగిందీ
అప్పటినుంచే...!

ఒక స్వామి యశోధరను
నా చేతిలో పెట్టాడు
తథాగతుడు ఫెమినిస్టు అయితే బాగుణ్ణనిపించింది

గౌతమీ గ్రంథాలయంలో
ప్రాచీన కవులందరితో స్నేహం చేశాను
అల్లసాని పెద్దనతో
ప్రబంధమంత బంధమైంది!

గోకవరం బస్టాండు కొత్త రైల్వేస్టేషన్
మోరంపూడి జంక్షన్ దేవీచౌక్ జాంపేట
రాజమండ్రిలో ఏ పేటకెళ్లినా
కవుల వాసనను పసిగట్టేవాణ్ణి
అమృతాన్ని కొన్ని ధారలు జుర్రేవాణ్ణి!

రాజమండ్రి మణికంఠ
సాహిత్యపు ఖజానా
పేదజేబుల్లోంచి రాలిన చిల్లర
కొన్ని అధ్యయనాలైంది!

రాజమండ్రి వెళ్తుంటే
పరదేశం నుంచీ
చాలాయేళ్ల తరువాత
తల్లి దగ్గరకొస్తున్నంత సంబురం
జ్ఞాపకాలు గోదారి చేపలై ఈదుతాయి లోలో!

ఆనం కళాకేంద్రం, సాహిత్యపీఠం సభలు
బుర్రలోని బూజులెన్నో దులిపాయి

రాజమండ్రి నాకు తండ్రి లెక్క
చాలా చాలా దూరం
ఫలవంతంగా పయనింపజేసింది!
రాజమండ్రి నాలో రాజసాన్ని చెక్కింది
కవిత్వాన్ని ప్రసాదించింది!
నన్నెవరైనా కవీ! అనగానే
రాజమండ్రికి నమస్కరిస్తాను!

- మెట్టా నాగేశ్వరరావు
99510 85760

# పాలకోవా బిళ్ళ

- రోహిణి వంజారి
90005 94630



**మా** ఇంటి మొండి ప్రహరీ గోడ కింద
కరీం తాత చిల్లర బంకు
నా బాల్యపు తీపి రెస్టారెంట్..
సీసాలో తెల్లగా గుండ్రంగా పాలకోవా బిళ్ళలు
వెండి చందమామల్లా ఊరిస్తూ ఉంటాయి
అణా పైసలకు వస్తుంది నారింజ దబ్బ పుల్లపుల్లగా
అర్ధణాకే నోరు తీపి చేస్తుంది నువ్వుల చిమ్మిరి ఉండ.
అందని జాబిల్లి మీదే కదా అమితమైన ఆశ
పాలకోవా ధర పదిపైసలు మరి!
నాయనిచ్చే ఎన్ని అణాలు పోగేస్తే
అంత రొక్కం అయ్యేను..!
బడిలో నాగరాజా కొరికి కొరికి
ఊరిస్తా తింటాడు పాలకోవాని ..

బంకులో సీసా చాయ ఆశగా చూస్తానా
రొక్కం మళ్ళీద్దులే బేటీ అంటూ పాలకోవా బిళ్ళని
చేతికిబోతాడు కరీం తాత నవ్వతా ..
ఊరికే తీసుకోవడానికి అభిమానం అడ్డు కదా
ఏనాటికైనా రొక్కమిచ్చి కొనుక్కోవాలని కోరికాయే..

ఆ రోజు పొద్దుపోయాక వచ్చాడు పట్నం బాబాయ్
మద్రాసు రామన్న తొలిసారి మా ఇంటికి ..

వస్తానే పప్పులు కొనుక్కో అమ్ములు అంటూ
పది పైసలు నా చేతిలో పెట్టాడు..

అరచేతిలో స్వర్గం అంటే ఆరోజే తెలిసింది నాకు
ఇక రాత్రి నిద్ర వస్తే ఒట్టు..

పాలకోవా సీసాలన్నీ నా చుట్టూ తిరుగుతున్నాయి
తిరగడం ఆగిపోయినట్లు గోడ గడియారం ముళ్ళు
ఎంతకీ ముందుకు కదలడం లేదు..

ఈ రాత్రి గడిచేది ఎట్లని..?
తెల్లవారేది ఎప్పుడని..?
కరీం తాత బంకులో పాలకోవా కొని
నాగరాజా ముందు నేనెప్పుడు ఎచ్చులు పోయేదని..?

ఏ జాముకో ఓ కలత నిద్ర.. కలల నిద్ర
కల నిండా తియ్య తియ్యని పాలకోవాలే ...

పంచలో పెంకులనుంచి తొలి వెలుగు కిరణం
నులక మంచమ్మీది ముఖం మీద పడనే పడింది.
లేడికి లేచిందే పరుగైనట్లైంది ఇక నాకు
అరచేతిలో పదిపైసలు గుప్పిట మూసి
చిల్లర బంకు ముందుకు పరిగెత్తా ఆతృతగా
పాలకోవా కొనుక్కోవాలని ..

ఎప్పుడూ లేంది బంకు చుట్టూ గుంపుగా జనాలు
బంకు ముందర కరీం తాత పండుకోనుండాడు
కళ్ళు తెరచుకొని శాశ్వత నిద్రలో..

గుప్పిటిలోని పది పైసలు ఎక్కడ జారిపడిపోయిందో
నేను వెతకనే లేదు..

వారం దినాల తర్వాత కరీం తాత కొడుకు వచ్చాడు
బంకు ఎత్తేస్తున్నాం అంటూ పప్పరమెంట్లు
పంచేస్తున్నాడు అందరికీ ...
సీసాలో మిగిలిన చివరి పాలకోవాని
నా చేతిలో పెట్టాడు..

అరచేతిలో అప్పటిదాకా నేను కలలు కన్న స్వర్గం
ఆ రోజు మాత్రం చేదుబిళ్లలా అనిపించింది
కరీమ్ తాత నవ్వుల తియ్యదనం లేక ...!






# కవితాలోకంలోకి కొత్త గాలి

- రావెల సాంబశివరావు
99590 89630

**అ**డిగోపుల వెంకటరత్నమ్ గారి 'కొత్తగాలి'లోని కవితలు చదువుతూంటే నవయుగ కవి చక్రవర్తి జాషువా కవి కనుల ముందు నిలుస్తారు. 'వసుధ శాసింపగల సార్వభౌముండగును / ధీరుడగు, భిక్షకుండగు, దీనుడగును/ దు:ఖితుండగు నిత్య సంతోషియగును/ సత్కవి ధరింపరాని వేషములు గలవె/ అడిగోపుల కవిత్వమూ అంతే! 'పచ్చని ఆకుల పట్టు చీరె ధరించి / పసుపు పూలను అలంకరించుకొంటుంది/ ఉష్ణతాపం తట్టుకోలేని సూర్యుడు/ అప్పుడప్పుడూ చెట్టు కొమ్మల్లో దూరి/ సేద తీరుతాడు'.

చిగురించని బతుకుల్ని చిగురించిన వృక్షం చూస్తునే వుంటుంది. జననం మరణం మధ్య బెయిలు లేని, విడుదల లేని వంటింటి కారాగారంలో జీవిత ఖైదీగా మారే ఇల్లాలు కనిపిస్తూనే వుంటుంది. కొండల్లో, కోనల్లో నడిచి వచ్చిన స్త్రీ మూర్తిగా సతీసహగమనంలో కాలిపోతుంది. కన్యాశుల్కం వరకట్నాల్లో సమిధైంది. సమస్త యుగాల్లో చిరంజీవిగా నిలిచింది. ఆమె శ్వాసిస్తూ మరో ప్రపంచానికి ఊపిరిలూదగలదు.

ఈయన కవిత్వం చదివిన తరువాత రకరకాల దు:ఖానందాశ్రువులు మన మనసును వీడవు. అందులోనూ మరీ ముఖ్యంగా జాతీయ జెండాగా నిలిచిన రైతు దురవస్థ. కాలం నడుస్తున్న తీరు ఈ కవి సునిశిత విమర్శకు గురవుతుంది. నాగల్ని అంటుకట్టుకొన్న హాలికుడు ఈ కవి దృష్టిలో బలరాముని వారసుడు! ఈయన కవితల్లో యింకా 'మనకు ఎన్ని ఉగాదులు పలకరించి వెళ్ళినా/ ఎన్ని ఉదయాలు ఉదయించి వెళ్ళినా/ ఉదయించని వెతలవారు' దర్శనమిస్తారు. మారుతున్న యుగంలో మారని గమనాన్ని గుర్తుకుతెస్తూ – ఒయాసిస్సులోని నీళ్ళన్నీ ఎడారి కార్చిన కన్నీళ్ళుగా ఎడారి దు:ఖాన్ని కళ్ళకు కట్టిస్తాడు. ఇంటింటి జాబిల్లులయిన పసివాళ్ళు ఈయన కవిత్వంలో కేరింతలు కొడతారు. ఈ 'కొత్తగాలి'లో అడిగోపుల పాఠకుల్ని ఎలుగెత్తిన విశ్వగీతానికి శ్రోతలుగా మారమంటున్నాడు. చేతులెత్తి నమస్కరించి అర్థించిన వాడి చేతి నొప్పిని ఖాతరు చేయక అర్జీ అందుకొన్న చేతుల్లోని తెలివితనాన్ని, తెలివితక్కువ తనాన్ని తూర్పారబడతాడీ కవి. విలయాన్ని సృష్టించిన వరుణున్ని పగిలిన అద్దం ముక్కలో నుండి ఒకసారి తన ముఖాన్ని తాను చూసుకోవడం మంచిదని చురకేయటం కన్పిస్తుంది. స్పర్శను ఒకసారి మాటగా, ఒకసారి మౌనంగా, ప్రతిసారి ఔషధంగా తీర్చిదిద్దగల సత్తా ఈ కవిది. అందుకే ఆనందాన్ని మాటల్లో అనువదించుకోమనే ఎల నవ్వును అలా పంచటం. 'నిప్పును కనుగొన్న మానవుడు/ నాటి నుండి/ ప్రపంచాన్ని పొయ్యిలో వేసి / కాల్చటం మొదలైంది' అని భావించినా కాలం చిగురిస్తుంది అనే భరోసాను కల్పించటం బాగుంది.

ఈయన కవిత్వం మనిషికీ మనిషికీ మధ్యన మతం తన చిట్టా విప్పరాదంటుంది. అంధులకు సైతం ఈయన కవిత్వం సూర్యుణ్ణి దీపంగా చేసి చూపెట్టగలదు. ఈ కవికి కలలు కనటమూ వచ్చు. అందుకే కంచెల్లేని, కందకాల్లేని, సిపాయిల్లేని, బందూకుల్లేని దేశ సరిహద్దుల్ని కలగన్నాడు! ఈయన స్వప్నాలలో ఉప్పునీటి సముద్రం మంచినీటి సముద్రంగా మారిపోతుంది. రైతు తల గుడ్డే మకుటంగా మారాజు అవుతాడు. కలలకొక నీతి వుంది కనుక కలలు చెదిరిపోరాదనేది ఈ కవి నినాదంగా కనిపిస్తుంది. శ్రీశ్రీ సకల వృత్తుల సమస్త లక్షణాల్ని ఈ కవి తన బాణీలో 'కూడికలో తీసివేత'గా కూర్చుకొంటాడు.

'గోదావరి విలయకేళి' కవితలో – గలగలా కదలి వచ్చే గోదారి పరుగెత్తి, పరుగెత్తి పది మండలాల్ని ముంచివేసింది. ఆ సమయంలో ఈ కవి భావన ఎంత సరికొత్తగా వున్నదో చూడండి. 'అఆలు దిద్దే వయసువాడికి / ఆంగ్లచదువెందుకని / సరస్వతి పుస్తకాల్ని / నీటికి అందించింది'. 'సాయం చెయ్యని చేతులెందుకు' అనే అబ్రహం లింకన్ ఉపన్యాసాన్ని గుర్తుచేసి/ 'సాయం చెయ్యని చేతులకిప్పుడు / అగ్నిస్నానం చేయించాలి' అంటుంది లావారూపం ధరించి ప్రవహించే ఈయన కవిత్వం. కర్తది బరువు/ కర్మది భారం/ క్రియది విషాదం అంటూ సరికొత్త వ్యాకరణాన్ని బోధిస్తుంది. అయినా / 'అమ్మ ఆవు / ఇల్లు ఈగ చదువుతూ / ప్రాథమిక విద్యాసౌధంలో / మాతృభాష మల్లెల సౌరభం' శ్వాసించే గుణం కూడా ఈయన కవిత్వపు సొత్తే.

'గాయకుల సమిష్టి కృషి / పాటను పోత పోస్తే' చూడాలనుకునే నైజం ఈయన కవిత్వానిది. 'అస్తమయం/ ఉదయం మధ్య/ జాగరూకతే నమ్మకం' అని కూడా గుర్తు చేస్తుంది.

ఆధునిక కవిగా ఈయన ఎంతటి ఆదర్శవాదో అంతటి ప్రకృతి ప్రేమికుడు. నీటిని నాట్యమయూరిగా, మాయల మారిగా, విధ్వంసకారిగా, సుఫలధారిగా వివరిస్తూ అరవై నాలుగు కళల్నీ నీటికి అంటుకడతాడు. ఈయన కవిత్వంలో నిత్య కల్యాణం, పచ్చతోరణంగా సంస్కృతిని పంచే పల్లెటూళ్ళు దర్శనమిస్తాయి. అయితే పడవకు, తీరానికి, కాడికి, అగ్రుకు, కలానికీ, కరానికీ గల బంధం సన్నగిల్లటాన్ని చూచి ఈయన కలం కన్నీరొలుకుతుంది.

ఆకాశం పాతదే. అయినా ఎప్పటికప్పుడు అది కొత్తగా కనిపిస్తుంది. గాలి పాతదే / అయినా మలయమారుతం/, వడగాలి, చలిగాలి అంటూ ఎన్నెన్ని సరికొత్త వేషాలో ఋతువు ఋతువునా ప్రతి సంవత్సరం. నేల పాతదే కాని పండించే పద్ధతులు సరికొత్తవైనప్పుడు పండేది నిక్కంగా ముక్కారు పంటలే! సంగీతం పాతదే కావచ్చు కాని సరికొత్త యమకాలు, గమకాలు వినూత్న రాగాలకు స్వాగతం పలుకుతాయి. రాజ్యం పాతదయినా కొత్త రాజ్యాంగాన్ని అంటుకడితే సరికొత్త వసంతమే అనేది ఈ కవి ఆశ, ఆశయం కూడా.

ప్రజాస్వామ్యానికి సూత్రాలు సంధిస్తూ, వాటికి స్పందిస్తూ మనిషి అలసిపోయాడు. 'చైతన్యం పల్లవించి/ ఎలుగెత్తిన చోట/ మారణకాండై మనిషి మాయం కారాదన్నది/' ఈ వామపక్ష అభిమాని ప్రగాఢ వాంఛ. 'కాలాన్ని మింగిన పరిశ్రమకు/ గడియారంపై అంకెలు కనపడవు' అంటాడీ శ్రామికవర్గ పక్షపాతి. 'శ్రమ ఉపశమనానికి జాబిల్లి దివ్యౌషధం' అంటూ మళ్ళీ ముంతకజ్జాయపు రుచుల్ని అందింపజూస్తుంది ఈయన కవిత్వం.

'ఆసుపత్రి కనువిప్పదు/ అధికారం నోరు మెదపదు / చోదకులదే పాలన/ సారథులదే శాసనం' అంటూ నడుస్తున్న భారతం కవితలో రోగుల అవస్థలు కళ్ళకు కట్టిస్తాడు. అయితే అదంతా చూస్తూ కూడా ఆయనకు మౌనం కప్పుకొన్న మనిషిని చూస్తే ఈసడింపే. ఈయన కవితల నిండా ఎన్నెన్ని దృశ్యాదృశ్య దు:ఖాలో! యుద్ధాల్లో మంచి యుద్ధాలు వుండవనేది జగమెరిగిన సత్యమే. 'యుద్ధం ముగిసాక' రొమ్మిరిసిన రెండు దేశాలు శిథిలాల్ని వెతుక్కోవాల్సిందే. ప్రపంచ ప్రఖ్యాత కట్టడాలు శకలాలుగా చరిత్రకెక్కాల్సిందే. యుద్ధంలో విజయాలుండవు. అటూ ఇటూ పరాజయాలేనని ఫక్కున నవ్వుతాడు.

ఈయన కాలచక్రం 'ఒకసారి ఆనందాశ్రులై/ ఒకసారి దు:ఖాశ్రులై' కన్పిస్తుంది. 'గంటగంటకు రాగాలాపనై అప్రమత్తం చేస్తుంది. బొజ్జ నిండిన పాప ఉయ్యాల్లో చేసే సంగీత సాధన శాస్త్రాల్లో లేని రాగాలను రాగ రంజితం గావిస్తాయి'. ఈ కవి దృష్టిలో వాహ్యాళి చెయ్యటమంటే / కేవలం శరీర వ్యాయామం కాదు/ మనస్సులోని సంగీతం మోసుకురావటం. ఆకలి గొన్న భిక్షగాడు సొరకాయ బుర్రకు బిగించిన తీగను / వాకిట నిల్చి మీటితే/ మదిని కదిల్చిన సంగీతాలు వినిపిస్తాయి/ మెతుకు విదిల్చిన కరాలు కన్పిస్తాయి/ 'సరిగమలు'గా! ఉభయ సంధ్యల మధ్య ఎంతటి ప్రకృతి విన్యాసం. 'చూసి నడువు నాయనా!' అనే మాట అమ్మ సమాధి నుండి విన్పించటమంటే శోకం నుండి శ్లోకం తన్నుకు రావటం కాదా' అన్పిస్తుంది. అలాగే 'నాణేనికి మరోవైపు' చూపిన ఈ బాణీనేమనాలి? మండు వేసవిలో కులూ మనాలీలో కులుకుతున్నట్లుగా వుంటుంది! 'ఉభయ సంధ్యల మధ్య' ప్రకృతిది ఎంతటి విన్నాణమో!

ఈయన కవిత్వం ఎల్లప్పుడు విరుచుకుపడుతూ అలాగే వుండిపోదు. అభ్యర్థనలతో ఆదుకోగలదు కూడా. ఈ కవితామ తల్లి ఎంతటి శక్తిమంతురాలయినా 'సూర్యుణ్ణి ఈరోజు ఉష్ణం తగ్గించు నాయనా అంటే – మేఘాల్ని కప్పుకొన్న సూర్యుడు నేలపై చలువ పందిళ్ళు పరుస్తాడు'. ప్రయాణంలో పదనిసలు ఒకరు చెప్తే వినేవి కావు.. ఎవరికి వాళ్ళు స్వయంగా చదువుకోవాల్సిందే. బాధ్యత గల కవిగా ఈయన కూడా నూతన శకానికి రారమ్మని స్వాగతం పలికాడు. అయితే మనిషిని చూస్తే భయం, చేయి కలిపితే భయం భయంగా వున్న రోజులవి. అలా ముఖాలకు గుడ్డలు చుట్టుకొని, మూతులు కట్టుకొని కూడా స్వాగతం పలకడం జరిగింది.

ఒకానొక కోపానికి బలై.. కుక్క మూడు కాళ్ళ జంతువైనా.. గురి తప్పని వేటగాడి బాణం గూట్లో పక్షి రెక్కను తెగేసినా/ గాలి కుంటుతో ఎద్దు నడక పట్టుతప్పినా.. వాటన్నింటినుండి గట్టెక్కిన రైతు తలగుడ్డలోని రాజసాన్ని చూడగలవాడీ కవి. 'సగానికి సగం చెట్టు నరకబడినా తిరిగి చిగురిస్తుంది'లే అనే భరోసా – ఎంతయినా ఋతుధర్మం తెలిసిన వాడు కదా! అయినా ఈయన కవిత్వంలో భూమి పిడికిలి బిగించక మానదు – అబద్ధాల ద్విపాత్రాభినయాన్ని చూసి పంజరాన చిలకలు చదివిన వారికి స్త్రీ స్వేచ్ఛకు ఈ కవి ఎంతగా కంకణం కట్టుకున్నాడో అవగతమవుతుంది. 'ఆమె ఒకసారి వంటగది పంజరం / ఒకసారి పడకగది పావురం / ఒకసారి వడ్డన గది బొంగరం... విశాల విశ్వంలో ఆమె చెదిరిన చిత్రం.' 'నేను విశ్వమేఖల / నాది విశ్వశాంతి' అని ప్రకటించుకొన్న కవి అడిగోపుల. పాదంలో బొటనవేలు స్థానాన్ని తన వచన పద్య పాదంలో ఎంత బాగా బిగించాడో... ఈ కవికుల అధినాయకునికి జయహో...!

అడిగోపుల 'కొత్తగాలి' కవులపాలిటి ఏరువాక. సమస్త ఉపమానాలు కొత్తగాలి చుట్టూ గిరికీలు కొడుతుంటాయి.

"దారులన్నీ మూసుకున్నాక / మార్గావిష్కరణే కొత్తగాలి
చూపులన్నీ మసకేశాక / క్రాంతి కావడమే కొత్తగాలి
మాటలన్నీ మూగబోయాక/ గర్జించటమే కొత్తగాలి
కొత్తగాలిని స్వయంగా ఆస్వాదించేందుకు సిద్ధం కండి.

**(కొత్తగాలి : అడిగోపుల వెంకటరత్నమ్, సెల్: 9848252946, పుటలు 144, వెల రూ. 150. ప్రతులకు : ప్రజాశక్తి, విశాలాంధ్ర బ్రాంచీలు)**



## ఎదురీది చూడు

ఎందుకో ఆ పూలు
భూతకాల కొమ్మనే వదలిపోయి మరీ
పట్టుకుని వేళాడుతున్నాయి.
కన్నీటిని సృష్టించే శిశిరాన్నే కాదు
పన్నీటిని హెూరులా ప్రవహింపజేసే
వర్తమానాన్ని కూడా ఆహ్వానించలేకపోతున్నాయి

బహుశా సుప్తావస్థనే జీవితమనుకునే
అజ్ఞానపు సింహాసనం అధిష్టించే చరిత్ర పుటలను
జీర్ణించుకున్నాయోమో మరి!

గతాన్ని కూకుటి వేళ్ళతో పీకే శక్తియుత వర్తమానాన్ని
నిత్యయవ్వనమైన మనోధైర్యపు పూలు పూయించగల
హృదయ ఉద్యానవనాలు
ప్రతి మానవ క్షేత్రంలో కొలువై ఉన్నప్పుడు...
పెదవులపై చైతన్య పరిమళాలు వెదజల్లే చిరునవ్వులతో
పలకరించే వర్తమాన ఘడియలను స్వాగతించకుండా..
నిశీధిని పులిమే చీకటి జాడ్యాలతో స్నేహం చేయడమెలా!
ఎదురొచ్చే ప్రతి అలను ఎదురీది చూడండి...
మేను పెంచి పోషిస్తున్న అచేతనం
పరుగు బెట్టి మరీ పారిపోతుంది
విజేతలుగా చరిత్రలో నిలపటానికి ...

**- శ్రీదేవి సురేష్ కుసుమంచి**
70327 60484

## నది ప్రశ్నిస్తోంది ...



**మా**నవ నాగరికతకు ఆలంబనం నేను
నాజీవన స్తన్యం గ్రోలుతూ
పెరుగుతున్న మానవజాతి
ఇసుక తిన్నల మధ్య ఒద్దికగా పారుతూ
నేలతల్లి కౌగిలింతలో
ఒదిగి పోయిన ముద్దుల పాపను
గలగలమంటూ మహా ఝరిలో
పంటలన్నింటికీ ప్రాణాధారమై
వర్షాకాలంలో మీ అందరికీ
వరదాయిని అయిన చల్లని తల్లిని
నా ఎదపై పారాడేపసిపాపలు పడవలు
ఎండి బీటలు వారిన బంజర్లను సస్యశ్యామలం చేస్తూ
రైతుల నుదుటి స్వేదం తుడిచి
సేద్యాలు చేయిస్తున్నాను
అన్నార్తుల బాధను బాపి
దాహార్తుల గొంతుకులను తడిపి
జల జీవరాశులకు మనుగడనిస్తూ
మానవాళిని అలల చేతులతో ఆశీర్వదిస్తూ
సాగర సంగమానికి సమాయత్తమవుతుంటాను
తరాలు మారుతున్నాయ్
అంతరాలు పెరుగుతున్నాయ్
మీ స్వార్థం, దురాశలు
నా అంతానికి దారి తీస్తుంటే
సుడులు తిరిగి పోయాను కలతబారి పోయాను
మీ పరిశ్రమల కాలుష్యం
నా జీవజలాలను నిర్జీవం చేస్తుంటే
నన్ను ఆశ్రయించి బతికే
ప్రాణుల ప్రాణాలు తీస్తుంటే
ఎక్కిన కొమ్మనే నరుక్కొనే
మీ మూర్ఖత్వాన్ని గర్హిస్తున్నాను
జల వివాదాలతో నన్ను నిర్వీర్యం చేస్తున్నారు
మీ పంటలకు నీరందకుంటే
కృత్రిమ మేఘాలను సృష్టించి
వర్షం కురిపించారు నన్ను గాయపర్చారు
అతివృష్టిగా కురిసి వెల్లువలై పొంగాను
బతుకు భయంతో మీరు పరుగెత్తారు
ప్రకృతితో ఆడుకునే హక్కు మీకెవరిచ్చారు
సమతుల్యతను దెబ్బ తీసే
సాహసమెందుకు చేస్తున్నారు?

**- నూతలపాటి సాంబయ్య**
98480 34930



# అంచనాలు

- పి.శ్రీనివాస్ గౌడ్
99494 29449

**"హ**లో సురేష్.."

"ఆc.. ఆంటీ.."

"ఏమనుకోకయ్యా.. చాలామంది వున్నారని మాట్లాడలేక పోయాను"

"ఏం పర్లేదు ఆంటీ.. అర్థం చేసుకోగలను.."

"మొన్న ఒక సంబంధం వచ్చిందని చెప్పా కదా.."

"ఏది ఆంటీ.."

"అదేనయ్యా.. వైజాగ్‌ది.."

"ఆc..ఆc.."

"అమ్మాయి ఫొటోలో బాగా డామినేటింగ్‌గా కనపడుతుంది. వయసు కూడా ఎక్కువగానే వున్నట్టుంది.."

"వెళ్లి చూసొస్తానన్నట్టున్నారుగా, ఆంటీ.."

"ఆc.. ఏం వెళ్లడం.. నేనే ఎగరగొట్టేశాను.."

"అదేంది.. ఎందుకాంటీ..?"

"ఆc.. ఆ పిల్ల అంత అణకువగా అనిపించలేదయ్యా.. రేపు వచ్చి మన మీదే పెత్తనం చేస్తే..?"

"ఒట్టి ఫొటో చూసి అలా అనుకోవచ్చా ఆంటీ..?"

"ఆ.. మొఖం చూసి కొన్ని చెప్పేయొచ్చు.. నీకేం తెలుసు.."

"..............."

"మా వారొక సంబంధం తెచ్చారు. తెలిసిన వాళ్లంట. అమ్మాయి బీటెక్ చదివిందంట. పిల్ల మంచిదేనంట.. కాకపోతే ఎక్కువ ఇచ్చుకోలేమని ముందే చెప్పేశారంట.."

"డబ్బులుది ఏముందాంటీ.. అమ్మాయి మంచిదయితే చాలు కదా.."

"అవుననుకో.. గానీ.. ఆ పిల్లకి ఇప్పుడే చదువయిందంట.. ఉద్యోగం లేదు. ఇప్పుడీ అమ్మాయి అమెరికా వెళ్లి, చదివి, ఉద్యోగం తెచ్చుకోవాలంటే ఎంత టైం పట్టుద్ది చెప్పు .. ఎంత ఖర్చవుద్ది.. మాటలా చెప్పు.. పైగా కరోనా తర్వాత వర్క్ ఫ్రం హోమ్ అంట.. అబ్బాయికి శాలరీ కట్ అవుతుందంట.. ఇంక వాడు ఈఎంఐలకి ఏం కడతాడు? ఇంట్లో ఖర్చులు.. పై ఖర్చులు.. ఇద్దరి శాలరీలు వుంటేనే అక్కడ అంతంత మాత్రంగా వుంటుంది. ఏమంటావు సురేషు..?"

"..............."

"పైగా పండగ పబ్బాలకి, శుభకార్యాలకు అమెరికా నుంచి రాకపోకలకు ఎంత ఖర్చు? అబ్బాయి ఒక్కడే ఇవన్నీ బరాయించడం కష్టం కదా..! వేన్నీళ్లకి చన్నీళ్లు.. అమ్మాయిది కూడా కలిస్తే బావుంటుంది. నువ్వే ఆలోచించు.. నేను చెప్పేది కరెక్టో కాదో.."

"అబ్బో.. ఆంటీ.. చాలా దూరం ఆలోచిస్తున్నారే.. గ్రేట్"

"ఆలోచించకపోతే ఎలా? పెద్దాళ్లం అన్నీ ఆలోచించాలి.."

"ఆ తలనొప్పులు మీకెందుకాంటీ.. వాళ్లే చూసుకుంటారు కదా"

"వాళ్ల బొంద.. ఏంది చూసుకునేది? వాళ్లకేం తెలుసని? మనమే చూడాలి. ఈ పిల్లకి పాస్ పోర్ట్ వుందో లేదో..? మళ్లీ H1B అప్లై చేయాలి. అదెప్పుడొస్తుందో.. ఏం పాడో.."

"కరోనా తర్వాత వీసాలు కష్టం అయ్యాయి ఆంటీ.."

"అవును.. మరే.. డబ్బులూ లేక.. చదువు ఉద్యోగం లేక ఆ పిల్లని ఏం చేసుకుంటాం? ఉన్న డబ్బులు ఖర్చు పెట్టుకుంటా కూర్చుంటే రేపు అక్కడ ఇళ్లు కొనాలంటే ఎలా కొంటాం?"

"................."

"అందుకే ఈ సంబంధం వాళ్లకి ఏం చెప్పలా.. అదట్టా వుంచి వేరే సంబంధాలు చూస్తున్నాం.."

"మ్యాట్రిమోని వాళ్లకి చెప్పకపోయారా.. ఆంటీ.."

"అదీ అయింది సురేషు.. కట్నాలు బాగుంటే పిల్ల బాగుండడంలా.. పిల్ల బాగుంటే ఉద్యోగం వుండడంలా.. అన్నీ బాగుంటే వాళ్లు మనకి దొరకడంలా.."

"మనకి తగ్గావాళ్లని మనం చూసుకోవాలి.. అన్నీ వున్న వాళ్లు అంత తొందరగా దొరకరు ఆంటీ.."

"ఈ మ్యాట్రిమోనిల్లో అన్నీ నాసిరకమేనయ్యా.. అన్ని చోట్లా తిరిగి తిరిగి ఎక్కడా సెట్ కానోళ్లే ఇక్కడ మిగులు తారంట."

"............."

"ఇక్కడ ఊళ్లల్లో సంబంధాలు నాలుగైదు కోట్లు ఇస్తామని వస్తున్నారు గానీ.. మనక్కావాల్సినవి రావడం లేదు.."

"ఇంతకీ మీ అబ్బాయి ఉద్దేశం ఏంది ఆంటీ..?"

"వాడిది ఏముంది సురేషు.. మనం ఏదంటే అదే.."

"అక్కడ సంబంధాలు ఏవన్నా వున్నాయేమో చూడమని చెప్పకపోయావా.. ఆంటీ.."

"ఆం.. వాడూ ఒకటి చూసాడు.. అన్నీ బాగానే వున్నాయి గానీ..."

"మరి ఇంకేంది ఆంటీ..?"

"ఆ అమ్మాయికి వాడి కన్నా యాభై వేలో ఎంతో జీతం ఎక్కువంట.. జీతం ఎక్కువని వాడినేవన్నా చిన్నచూపు చూస్తుందేమోనని ఆలోచిస్తున్నాను.."

"ఎక్కువయితే మంచిదేగా ఆంటీ.."

"ఆం... ఆడవాళ్ల సంగతి నీకేం తెలుసు..? కొంచెం అలుసు ఇస్తే కొంగున కట్టుకొని ఆడించేస్తారు.."

"................."

"అసలే అమెరికా.. అందరితో ఫ్రీగా వుంటారు.. అంత అందం.. జీతం వున్న ఆడపిల్ల ప్రేమని.. దోమని తిరగకుండా వుంటుందా అని.."

"................."

"అది కాదు సురేష్.. నీ రిలేటివ్స్‌లో మంచి సంబంధం వుందంట కదా.. అమ్మాయి బావుంటుందంట.. మంచి ఉద్యోగం అట.. మంచి జీతమంట.."

"అవును ఆంటీ.. వాళ్లు చాన్నాళ్ల క్రితమే అమెరికాలో సెటిల్ అయారు. గ్రీన్ కార్డ్ హోల్డర్స్. అందరికీ సిటిజన్ షిప్ వచ్చేసింది. బాగానే సంపాదించారు.."

"మరి ఆ సంబంధం చూడకపోయావా.."

"నేను మీరిచ్చిన అబ్బాయి డిటెయిల్స్ అన్నీ వాళ్లకి పంపానాంటీ.."

"హ..హ.. ఏవన్నారు..?"

"చిన్న వయసులో అంత పొట్ట ఏంది అన్నారు.."

"ఆం.... ఏంది?"

"అంత పొట్ట ఏంది అన్నారు"

"పొ.. పొట్ట.. పొట్ట తగ్గడానికి జిమ్‌కి వెళుతున్నాడయ్యా.."

"బాల్డ్ బాగా ఎక్కువుగా వుందన్నారు.."

"అదా.. అమెరికా వెళ్లిన తర్వాతే ఎక్కువయిందయ్యా.. ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయిద్దామనుకున్నామయ్యా.."

"లేట్ నైట్ పార్టీలు.. పబ్‌లు ఎక్కువంట గదా.."

"ఏం లేదయ్యా.. ఇంటి దగ్గరే వుంటున్నాడు.."

"ఇప్పుడంటే ఇంటి దగ్గర వుంటున్నాడు ఆంటీ.. అంతకు ముందు..? ఫొటోలు కూడా వున్నాయి.. పంపమంటారా.."

"................"

"డ్రగ్స్ అలవాటయితే అంతే సంగతులు ఆంటీ..."

"................"

"జాబ్ రికార్డు కూడా అంత బాగా లేదంట.."

"................"

"ఆంటీ... హలో.. ఆంటీ.."

".... ఆం.... ఆం....హా... సురేషు.. ఎవరో వచ్చినట్టున్నారు. నేను మళ్లీ ...మళ్లీ చేస్తానయ్యా..." ■

## వెంకట్ సిద్ధారెడ్డికి అక్షరం ట్రస్టు తొలి పురస్కారం

ప్రముఖ కవి, కథారచయిత కాశీభట్ల వేణుగోపాల్ అక్షరం లిటరరీ ట్రస్ట్ అనే సాహిత్య సాంస్కృతిక సంస్థను ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో సాహిత్యరంగంలో కృషి చేస్తున్నవారికి, కవులకు, కళాకారులకు ప్రతి ఏడాది అక్షరం ట్రస్టు పురస్కారాలను ఇస్తుంది. ప్రముఖ కవి జి.వెంకటకృష్ణ కార్యదర్శిగానూ, మరికొంతమంది కవులు సాహిత్యాభిమానులతో ఈ ట్రస్టీ ఏర్పాటైంది. ఈ ఏడాది అక్షరం ట్రస్టు తొలి పురస్కారం కథారచయిత వెంకట్ సిద్ధారెడ్డికి ప్రకటించారు. కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సమావేశం హాలులో ఫిబ్రవరి 26న ఆదివారం ఉదయం పురస్కార ప్రదాన సభ జరిగింది. సిధారెడ్డిని రూ.25 వేల నగదు, మెమొంటోతో సత్కరించారు.

# ఆమెకు.. ప్రేమతో,



ఆమె నడుస్తున్నప్పుడంతా
పాదాల గుండెకు ఏవో
గుచ్చుకుంటూనే ఉంటాయి
వొంగి తుడుచుకునే వ్యవధి లేకనో
మరే దారిలేకనో కానీ
ఆమె ఓర్చుకోవడమే అలవాటుగా మార్చుకుంది

బరువో.. బాధ్యతో
ఆమె బతుకు బండను భారంగా
దొర్లిస్తుంటుంది
తెగిన కలలపూసల దండలు
ఆమె దారిపొడవునా చేదు గురుతుల్ని
రాల్చుతుంటాయి
వెచ్చని పులకరింతలు కాదు..
పచ్చిగాయాల సలపరింతలే
ఆమె దేహం నిండా

ఎవరో రాసిన నిర్బంధ లేఖపై
చదవకుండానే సంతకం చేస్తున్న
అభాగ్యురాలామె
ఆకాశంలో సగం కాదు
అసమానతల సమాజంలో
వెక్కిరించబడుతున్న అమావాస్య ఆమె
మారుతున్న కాలంలో
తాను ఆశించిన జవాబు కోసం
కొంగు నడుముకు బిగించి
ఇంకా ఇంకా వెతుకుతున్న
వేయి కాగడాల ప్రశ్న ఆమె

ఇప్పుడామెకు
ఆమె జీవితం కావాలి
వ్యర్థంగా నలిగిపోతున్న రాత్రుల నుంచి
ఉపశమనం కావాలి
ఆమె ప్రభాతాల్ని బంధించిన పిడికిలి నుంచి
విముక్తి కావాలి
స్వేచ్ఛగా పరిమళించే
మల్లె మొగ్గల్లాంటి తెల్లని నవ్వులు
ఆమె సొంతం కావాలి

ఇప్పుడైనా ఆమెను చదవనిద్దాం..
ఈ ప్రపంచాన్ని..
భయ భ్రమల్లోంచి
బయటపడేందుకు తెరిచివుంచిన మార్గాన్ని

ఇప్పుడైనా ఆమెను చూడనిద్దాం..
రెప్పచాటున దాగిన స్వప్నాల్ని
వెలుగుచూడని అనేకానేక వాస్తవాల్ని
ఇప్పుడామెను మాట్లాడనిద్దాం..
గుండె నది వొడ్డున గూడుకట్టుకున్న
దుఃఖాన్ని తెంచి..
మనసు పొరల్లో అలుముకున్న
చీకటి తెరల్ని నిర్భయంగా తొలగించి

ఆమెనికనైనా స్వేచ్ఛగా సాగనిద్దాం
సృష్టిని ప్రతిసృష్టించే ఆమె కోసం
భావితరాలకు దన్నుగా నిలిచే
రేపటి అమ్మల కోసం ...

-సునీత గంగవరపు
94940 84576

## శ్వాస బిందువులు ... గుప్పెడు



నీటి వయసు ఎన్ని లక్షల ఏళ్ళో
గాలి వయసు ఎన్ని కోట్ల ఏళ్ళో
వెలుతురు ఆయుష్షు
ఎన్ని కాంతి సంవత్సరాలో
మట్టి ఈడు మరెన్ని కొలమానాలో!
ఈ అగణిత చరితల విశ్వపు ఉనికిలో
నీకు గానీ నాకు గానీ
వరమై దక్కిన ఊపిరి నిడివి మాత్రం
గుప్పెడు క్షణాలే!

భూమ్మీద విడిది కుందిరి కుదిరిన
తొలి ఘడియ స్వాగతం నుండీ
మన వీడ్కోలు కౌంట్ డౌన్ మొదలైనట్టే!
కాలం బిడారుతో మజిలీల ప్రయాణం
దారంతా ఒక తెలియని ఆకలి
ఎప్పటికీ తీరని వాంఛ
అనేక రూపాలతో అనేక కొలతలతో
ఆఖరి శ్వాస వరకూ వెంబడించే కోరిక!
సమాపణ సమయం దగ్గరయ్యే కొద్దీ –
ఏ ఆయువుకు ఆకలి మందగిస్తుందో
ఆ కాలశకలం కథ సంపూర్ణం
ఏ ప్రాణానికి కోరిక బలం పుంజుకుంటుందో
అది కురచ బతుకు!

బిచాణా సర్దుకునే వేళయ్యేకొద్దీ
తిరిగి వెళ్లాల్సిన దారులేవో తెరుచుకుంటాయి
కంటి ముందరి రంగులన్నీ వెలిసేకొద్దీ
కళ్లకేవో వివర్ణ సంకేతాలు అందుతుంటాయి
ఎండకోనేట్లో చలివిరి మునకల్లో ఈదులాడుతూ
ఇల్లు మరిచిపోయిన వేసవి పిల్లాడిలా నీవుంటే
ఇంటికెళదాం రమ్మనే అమ్మ పిలుపులా
ఒక అపరిచిత అల తట్టి పిలుస్తుంది

అదే ఆఖరు స్పర్శ అనుకోమేమో గానీ
శీతల శైథిల్యంలోకి ఒళ్ళు జారిపోవడం
చీకటిలోకంలోకి కళ్లు సంలీనం కావడం
మంచుపొగలా చల్లగా స్పర్శించే అల
కాలరేఖనుండి ఊపిరి తీగను తెంచే అల
కత్తి అంచు మీది శ్వాసబిందువు లాంటి అల

వాంఛితమయినా అవాంఛితమయినా
మృత్యు స్పర్శ ఒక చివరాఖరు అనుభూతి!

ఆకలి సముద్రం లాంటి ఆశ
నిరాళంగా తనువు చాలించే క్షణాలవి
ఆ ఆఖరు క్షణానికి చేరితే గానీ
ఆశకు ఆయువు తీరదని తెలిసొచ్చే క్షణాలవి!
జీవితం అకౌంటుకు జమకాబడిన క్షణాలన్నింటినీ
జారవిడవకుండా మళ్లీ మళ్లీ తోడుకోవాలని
బోధపరిచే క్షణాలవి!

బతుకంతా గుప్పెడు క్షణాల్లోనే ఒదిగి ఉన్నా
ఒక్కో క్షణానిదీ బతుకు మీద వల్లమాలిన ప్రేమ!

**- కంచరాన భుజంగరావు**
**94415 89602**




# మనసును తడిమే కలుంకూరి గుట్ట కథలు

- నరహరిరావు బాపురం
99086 56434

**క**థలంటే అవి ప్రత్యేకంగా ఎక్కడినుంచో పుట్టుకు రావు. మన చుట్టూ ఉన్న సమాజంలో ఎక్కడో ఒక చోట నిత్యం కళ్ళముందు జరిగేవే కథకుడి కలంలో కథల రూపంలో ఒదిగిపోతాయి. వాస్తవికతను సహజత్వాన్ని రంగరించుకున్న సజీవత్వాన్ని సంతరించుకున్న కథలు పాఠకుల మనసులను చూరగొంటాయి. మనసున్న మనుషుల హృదయాలను తడుముతాయి. వివిధ రకాల జీవితాల్లో నిజ జీవితాలతో మమేకమైన కథలను చదివే పాఠకుడికి అవి కథల్లా అనిపించవు. పైగా 'అరే! ఇందులో ఉన్నవి మన జీవితాలేనే!' అని అనుకొని 'మన జీవితాలను ఎంత బాగా దర్శింపజేసాడీ కథకుడు' అని ఆశ్చర్యపోతాడు. ఆ అచ్చెరువులోంచి తేరుకొని 'ఈ రచయిత మనవాడేనబ్బా!' అని కథతో పాటు కథకుడినీ సొంతం చేసేసుకుంటారు. పాఠకుడిలో సరిగ్గా అలాంటి భావనలను ప్రతిఫలింపజేసే కథకుడు కె. వి. మేఘనాథ్ రెడ్డి.

ఈ రచయిత 'కలుంకూరి గుట్ట కథలు' అనే కథా సంపుటితో తెలుగు సాహిత్యరంగంలో ముందుకు వచ్చాడు. ఒక్కో కథ చదువుతుంటే John Steinbeck అనే నోబెల్ బహుమతి రచయిత చెప్పిన మాటలు నిజమనిపిస్తాయి. If a story is not about the hearer he will not listen... A great lasting story is about everyone or it will not last. The strange and foreign is not interesting - only the deeply personal and familiar. ఈ అభిప్రాయం నిజమని తన కథల ద్వారా నిరూపించాడు ఈ రచయిత. ఈ సంపుటిలోని కథలు చదువుతున్న పాఠకుడు ఆ కథలలో చేరిపోతాడు. కథల్లోని వాతావరణాన్ని తన చుట్టుపక్కలే సందర్శిస్తాడు. కథల్లోని భావాలు– దుఃఖమో... బాధో... సంతోషమో... ఏదో ఒకటి మనలను మనల్నిగా వదలకూడదు. కథకుడు ఏమి చెప్పాలనుకుంటున్నాడో ఆ భావోద్వేగాలన్నీ మనలను చేరిపోవాలి. ఇంకా కథకుడు చెప్పనివి కూడా మన ఇంగింతానికి అర్థమై పోవాలి. అచ్చంగా అలాంటి కోవకే చెందినవి కలుంకూరి గుట్ట కథలు.

ఈ కథా సంపుటి ద్వారా అలా పాఠకుడి మదిని ఆకర్షించడంలో ఒక విధంగా రచయిత కృతకృత్యుడయ్యాడు అనే చెప్పవచ్చు. ఇందులో 12 కథలు ఉన్నాయి. అన్ని కథలు పల్లెసీమల నేపథ్యాన్ని ప్రతిబింబించేవే అయినా ఏ కథకాకథ తనదైన విశిష్టతతో అలరిస్తుంది. ఇక్కడ కథకుడు కథలను మామూలుగా కాకుండా యాసలో రాయడం మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. కథల్లో యాసను ఒదిగింపజేస్తూ కథలను హృద్యంగా చిత్రీకరించడమనేది ఒకవిధంగా అంత సులభసాధ్యం కాదనే చెప్పవచ్చు. ఆ విధంగా రాసి మెప్పించిన వారిని తెలుగు సాహిత్యరంగంలో వేళ్ళమీద లెక్కింపవచ్చు. కానీ తన మొదటి కథల పుస్తకంలోనే అటువంటి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి తన ప్రాంతంలోని యాసకు ప్రాముఖ్యతనిస్తూ పల్లె జీవితాలను కథల్లో కళ్ళకు కట్టినట్లు చూపిస్తూ మట్టి పరిమళాలను ఆస్వాదించేట్లు చేసిన రచయిత మేఘనాథ్ అభినందనీయుడు.

ఈ రచయిత సాహిత్య రచనకు పూనుకొని ఇంకా మూడేళ్ళు కాలేదంటే ఆశ్చర్యమే మరి! సాహితీరంగంలో బుడి బుడి నడకల ప్రాయంలోనే అద్భుతంగా కథలను ఆవిష్కరించడ మంటే పువ్వు పుట్టగానే పరిమళించిన వైనం గుర్తుకు రాక మానదు. రచయిత ముప్పాతిక భాగం తన కథల్లో కథను చెప్పే రీతిలో నవ్యమైన శైలిని చొప్పించాడు. A story has no beginning or end : arbitrarily one chooses that moment of experience from which to look back

or from which to look ahead అని ప్రఖ్యాత ఆంగ్ల రచయిత గ్రాహం గ్రీన్ మాటలు గుర్తుకు వస్తే... ఆల్ ది క్రెడిట్ గోస్ టు మేఘనాథ్.

వినూత్న రీతిలో కథలను నడిపించిన తీరు అబ్బురానికి గురి చేస్తుంది పాఠకుడిని. ఈ కథలు చదవడం ముగించగానే అంతవరకూ అపరిచితమైన చిత్తూరు ప్రాంతంలోని ఒకానొక యాస పాఠకుడికి మరింత చిరపరిచితమైనదిగా మారిపోతుందనడంలో సందేహం లేనే లేదు.

ఈ సంపుటిలో మొదటి కథ 'పనిమంతుడు'లో రంగి, రంగడు పాత్రలు చదువరి మనసును ఆకర్షిస్తాయి. ఆ పాత్రల మాటలు, చేతలు ఎంతో సహజంగా రోజూ చూసే మనుష్యుల్లో కనిపిస్తాయి. కష్టనష్టాలు జీవితంలో భాగాలే అయినా వాటిని వచ్చినవి వచ్చినట్లుగానే స్వీకరించి జీవన పూదోటను వికసింపజేసుకోవడం మన చేతుల్లోనే ఉంటుదన్న విషయాన్ని ఈ కథలోని పాత్రల ద్వారా తెలియజేస్తాడు రచయిత. 'వాన మబ్బులు' కథలో వాన కోసం ఎదురు చూపులు, రైతు బతుకులో కలసిపోయిన దుఃఖాలు, అంతటి దుఃఖంలోనూ రేపటి రోజుపై ఆశావహ దృక్పథం... ఇవన్నీ ఎన్నో జీవిత పాఠాలను నేర్పిస్తాయి. ఈ కథలోని లచ్చుము పాత్ర పల్లె కుటుంబాల్లో కనపడినా... ముఖ్యంగా కథలో లచ్చుము చూపించే తెగువ, ఆలోచనా పద్ధతి ఒకింత విస్మయం కలుగజేస్తుంది. ఈ కథను నడిపించిన తీరు అనిర్వచనీయం అనిపిస్తుంది. 'ఒలికిలి' కథలోని పిచ్చోడి పాత్ర చాలా కాలం మనలను వెంటాడుతూ ఉంటుంది. 'కలుంకూరి గుట్ట' కథలో చిన్నమ్మి, ఆనందుడుల ప్రేమ మన హృదయాలను కట్టి పడేస్తుంది. పాఠకుడి మనసులో 'కలుంకూరి గుట్ట' వర్ణన చెరగని ముద్ర వేయడమే కాక చదువరిని చేయి పట్టి ఆ గుట్టవైపు తీసుకెళుతుంది.

ఈ సంపుటిలోని కథలు చాలా మటుకు ఆ గుట్ట చుట్టుపక్కల చిత్రీకరించినవే! కలుంకూరి గుట్టను ఒక్కసారైనా సందర్శించాలనే కోరిక చదువరి మనసులో బలీయమౌతుంది. ఆ విధంగా కథల ద్వారా మనసులను చూరగొనడంలో రచయిత సఫలమైనట్లే! My short stories are like soft shadows I have sent out in the world, faint foot prints I have left. I remember exactly where I set down each and every one of them and how I felt when I did అని చెబుతారు జపనీస్ రచయిత హరుకి మురాకమి ఒకానొక సందర్భంలో. సరిగ్గా 'కలుంకూరి గుట్ట కథలు' ద్వారా రచయిత మేఘనాథ్ ఇదే చెబుతున్నాడని అనిపిస్తుంది. తన జీవిత అనుభవాలను ఎటువంటి ఆడంబరాలు లేకుండా కథల్లో చొప్పించాడు రచయిత. తను పుట్టి పెరిగిన పల్లెల్లో తాను పెరుగుతూ గమనించిన అంశాలనే కథా వస్తువులుగా మలచి కథలకు సహజత్వాన్ని ఆపాదించాడు.

మట్టి పరిమళాలు మన నాసికలకు చేరి మనలను కాస్సేపు మరో లోకానికి తీసుకెళ్తాయి. కల్మషంలేని మనసున్న మనుషుల జీవితాలు మనలను స్పృశించి మానవతానుభూతిని కలుగచేస్తాయి. హృదయాలను స్పృశిస్తాయి... మనమింకా జీవించి ఉన్నామన్న స్పృహను కలిగిస్తాయి. కథల్లోని ప్రతి పాత్రను సజీవంగా కళ్ళ ముందు నిలిపిస్తాయి. ఇలా ఏ కథ తీసుకున్నా ఏదో ఒక విధంగా మన జ్ఞాపకాల తేనెతుట్టిని జీవితకాలం పాటు కదిలిస్తూనే ఉంటాయి. లేదా ఆ కథలు... కథల్లోని పాత్రలు మన జ్ఞాపకాల పొదరిల్లులో పదిలమై కలకాలం ఉండిపోతాయి. When you read a short story, you come out a little more aware and a little more in love with the world around you అని మాన్ బుకర్ ప్రైజ్ విన్నర్ జార్జ్ సాండర్స్ చెప్పిన వాక్యాలు యథార్థమని నిరూపిస్తాయి ఈ సంపుటిలోని కథలు. మనకు తెలియకుండానే రచయిత తన కలం చేత ఆవిష్కరించిన సజీవ వాతావరణంలో మమేకమైపోతాము.

పల్లె జీవితాల్లో పొడచూపే చిత్ర వైచిత్రాల అనుభూతుల రంగుల చిత్రాలను యథాతథంగా కనులముందు దృశ్యీకరించడమే కాక యాసకు పట్టం కట్టి కథా సింహాసనంపై కూర్చోబెట్టిన రచయిత మేఘనాథ్ ఎంతైనా అభినందనీయుడు. ఎటూ ఇది రచయిత మొదటి సంపుటి కాబట్టి ఇందులోని లోటుపాట్లు తెలుసుకుని వాటిని సవరించుకొని ముందుకు సాగితే మున్ముందు తెలుగు సాహిత్యరంగంలో తనదైన ముద్రను వేసుకునే అవకాశం ఉంది మేఘనాథ్ రెడ్డికి. మరిన్ని కథలు ఈ నవ్య రచయిత కలం నుంచి ఆశిద్దాం. ■

## కవితలకు ఆహ్వానం

**భా**రతరత్న డా.బాబా సాహెబ్ అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా విజయవాడలో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నందుకు, 125 మంది కవులతో, ఒక కవితా సంపుటి తీసుకుని రావాలనుకుంటున్నాం. కవులు తమ సొంత కవితలను, మార్చి 20 సోమవారంలోగా 20 – 25 లైన్లు మించకుండా యూనికోడ్ ఫాంట్‌లో మాత్రమే పంపాలి. హామీపత్రం జతచేయాలి. మీరు పంపవలసిన మెయిల్ ఐడి : sonytangirala@gmail.com . వివరాలకు తంగిరాల సోని, 96766 09234ని సంప్రదించొచ్చు.

## అంతిమ సంస్కారం @ 2030

**మీ** మరణానంతర జీవితాన్ని
నేడే డిజైన్ చేసుకోండి
మీరు మరణించిన క్షణం నుండి
కాశీలో పిండప్రదానం చేసే వరకు
మీ కులాచారం ప్రకారం
శాస్త్రబద్ధంగా మీ అంతిమ సంస్కారాలు
నిర్వహించబడును
మీ పిల్లలు అందుబాటులో లేరని
చింతించవద్దు
వారు వచ్చేవరకు డీప్ ఫ్రీజర్‌లో
నెలరోజులైనా మీ శవం
చెక్కుచెదరకుండా ప్రిజర్వు చెయ్యబడుతుంది
మీ పాడె దగ్గర నుండి పిడకల వరకు
'ఫ్యూనరల్ యాప్'లో మీరు బుక్ చేసుకున్న
స్పెషల్ కేటగిరీ బ్రాండ్ మెటీరియల్ వాడబడును
అంతిమ శవయాత్రకు
ప్రత్యేక శిక్షణ పొందిన ఆర్టిస్టులు పాల్గొందురు
మీ స్థోమతను బట్టి సినీ, టీవీ ఆర్టిస్టులు
కూడా ఏర్పాటు చేయబడుదురు
'ఎ' గ్రేడ్ మైసూర్ శాండిల్ వుడ్ మాత్రమే వాడబడును
దహనానికి స్పెషల్ గ్రేడ్ నేతిని విదేశాల నుంచి
ఇంపోర్ట్ చేయబడును
మీకు ఇష్టమైన రంగుల్లో
మీ శవదహన మంటలు సృష్టించబడును
మీ ఫ్యూనరల్‌కు ముందుగా
అంతిమ సంస్కార యాత్రను
కాశీలో అనుభవజ్ఞులైన వేద పురోహితులతో
షూట్ చేయబడిన
'స్పెషల్ టీజర్' రిలీజ్ చేయబడును
వివిధ టీవీ, యూట్యూబ్ చానెళ్లలో
ప్రత్యేక ప్రకటనలు వేయబడును
మీ వారసులకు మీ చరిత్రను
సరికొత్త ఇమేజ్‌లతో సృష్టించి
పొలిటికల్ బేస్ కూడా ఇవ్వబడును
మీ అంతిమ సంస్కార యాత్రను
మా స్పెషల్ డిస్కౌంటు ధరలకు
నేడే బుక్ చేసుకోండి
స్పెషల్ ఇఎంఐ సౌకర్యము కూడా కలదు
మరణించిన తర్వాత కూడా
జీవించగలరు!

**– రత్నాల బాలకృష్ణ**
94401 43488

## స్వేచ్ఛ కోసం ...

**ఆ**శలు ముక్కలై కలలు చెల్లాచెదరై
మాటలు జారిపోతున్నాయి
కడలి కెరటంలా
తిరిగి వెనక్కి పోవాల్సిందేనా...
అభద్రత రక్షణలో సంసారం
సమస్యల సుడిగుండాలలో
నిండా మునిగి కూరుకుపోతున్నా ...

కాపాడే భర్తే కాలయముడుగా
ప్రాణాలను బలిగొన్న బానిసత్వం
స్వేచ్ఛ ఎరుగని నేను నలిగిపోవడమేనా
అత్తమామల అధికారం ఆడపడుచుల ప్రతీకారం
భర్త అనుమానాల అవమానాలకు
ఆహుతి కావాల్సిందేనా?

ఆర్థిక స్వతంత్రత లేని నాకు
మహిళా హక్కులు మాత్రం ఎక్కడ
పొద్దస్తమానం గొడ్డుచాకిరి చేసినా
ఏ గుర్తింపూ లేని మహిళను!
ఆంక్షలతో ముళ్లకంచెలు వేసి
బంధించిన వివాహ బంధాన్ని!

నా ఇష్టాయిష్టాలతో పనిలేదు ఎవరికీ
శాసించే అధికారమే అందరికీ
మూడు ముళ్ల బంధానికి
లొంగిన ఇల్లాలిని కదా!
రోగం వచ్చినా నలత చెందినా
పట్టించుకోని పవిత్ర బంధాన్ని!
తాళి అనే తాడుతో ఆశలను ఉరి తీస్తూ
కట్టు బానిసగా కట్టేసినా ..
కట్టు బంధాలను తెంచుకోలేని
నీరస నారిమణిని
పెళ్లి ముసుగులో బందీనైన గృహలక్ష్మిని ..
స్వేచ్ఛావాయువులను ఆకాంక్షించే
నిరంతర ఆశావాహిని!

**– నెల్లుట్ల సునీత**



# మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా కవులూ, రచయితలూ గొంతెత్తాలి!

## అరసం రాష్ట్ర మహాసభల పిలుపు

**ఆం**ధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర 19వ మహాసభలు, 80వ వార్షికోత్సవాలు ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఉత్తేజపూరితంగా జరిగాయి. మహాసభలకు ఆంధ్ర, రాయలసీమ, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాల నుంచి 200 మంది ప్రతినిధులుగా హాజరయ్యారు. సరిగ్గా 80 ఏళ్ళ క్రితం ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం ప్రథమ మహాసభల ఆతిథ్యం ఇచ్చిన తెనాలి ఇప్పుడు మరోసారి మహాసభల వేదిక అయింది. అభ్యుదయ సాహిత్యోద్యమ నాయకులు ప్రముఖ రచయిత అమరజీవి బొల్లిముంత శివరామకృష్ణ సాహిత్య ప్రాంగణం (శ్రీ తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం)లో 11వ తేదీ ఉదయం అరసం గౌరవ అధ్యక్షులు డా॥ పి.సంజీవమ్మ అరసం పతాకను ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. మహాసభల ఆవరణలో ప్రముఖ చిత్రకారులు ఎస్.వి. రామశాస్త్రి చిత్రించిన కవులు, రచయితల రేఖాచిత్రాల ప్రదర్శనను, పుస్తక ప్రదర్శనను ప్రొఫెసర్ గుజ్జర్లమూడి కృపాచారి ప్రారంభించారు.

ప్రారంభ సభకు అరసం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించగా, ఆహ్వాన సంఘం అధ్యక్షులు ప్రముఖ రచయిత సాయిమాధవ్ బుర్రా స్వాగతోపన్యాసం చేశారు. అరసం ఉద్యమ చరిత్రలో తెనాలి ప్రాధాన్యతను, తెలుగు సాహిత్య రంగంలోని తెనాలికి చెందిన ప్రముఖ రచయితలను ప్రస్తావించారు. యువ రచయితలను ప్రోత్సహించాలని, వారికి శిక్షణా కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని అన్నారు.

అరసం ప్రయాణం అలవోకగా సాగలేదని ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొందని అధ్యక్షోపన్యాసంలో రాచపాళెం గుర్తు చేశారు. సమాజం విముక్తిని సాధించేదాకా అవిశ్రాంత భావప్రచారం చేసే శక్తి సామర్థ్యాలు, రచయితల విమర్శకుల బలం గల సంస్థ అరసం అన్నారు. 'మన ముందు ఒక మహాస్వప్నం ఉంది. అది స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వంతో కూడిన వ్యవస్థ నిర్మాణం. అందులో సామాజిక న్యాయం, సామ్యవాదం ఉంటాయి. ఈ సందర్భంలో మార్క్సీయులు, అంబేద్కరీయులు ఐక్యంగా ముందుకు సాగాలి.' అని అన్నారు.

**రచయితలు ఉద్యమించాలి :** రచయితలు రాయటమే కాదు; పోరాడాల్సిన సమయమిదని అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సుఖదేవ్ సింగ్ సిర్సా అన్నారు. రచయితలను పాలకవర్గాలు కార్పొరేట్ శక్తులు ప్రలోభ పెడుతున్నాయన్నారు. లొంగని వారిపై దాడులు చేస్తున్నారన్నారు. దేశంలో ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు హిందుత్వ శక్తులు పనిచేస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో రచయితలు మరింత చైతన్యవంతమైన పాత్రను నిర్వహించాలని అన్నారు. ఢిల్లీలో జరిగిన రైతాంగ ఉద్యమ ప్రభావంతో పంజాబ్‌లో నవతరంలో ఒక కొత్త ఒరవడి బయలుదేరింది. వారి గుండెల్లో ఉన్న ఆవేశం ఆవేదన గేయాలుగా ఇతర రచనా ప్రక్రియలుగా బయటకొచ్చాయని, ఇది దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించాలని అన్నారు. 'హిందూ మతోన్మాద శక్తులు, కార్పొరేట్ శక్తులు కలిసి లౌకిక ప్రజాస్వామ్య సామాజిక భావనలను అణచివేస్తున్నాయి. ఈ దశలో సామాజిక ఆర్థిక విప్లవానికి రచయితల కలాలు, గళాలు పదునెక్కాల'ని అభ్యుదయ సాహితీవేత్త, దళిత ఉద్యమ నాయకులు డా॥ కత్తి పద్మారావు అన్నారు. అందుకు మార్క్స్, అంబేద్కర్, పూలే భావాలే మార్గదర్శకాలు. ఇప్పుడు లాల్ – నీల్ శక్తులు సంఘటితం కావాలని అన్నారు.

అరసం జాతీయ నాయకులు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ కులపతి ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ ... అరసం 80 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం గురించి వివరించారు. మతోన్మాద ఫాసిజానికి, కాషాయీకరణలకు వ్యతిరేకంగా కలిసివచ్చే ప్రగతిశీల సాహిత్య సంస్థలతో కలిసి పనిచేయాలని అన్నారు. డా.పి. సంజీవమ్మ, వినీత్ తివారి, వేల్పుల నారాయణ, తెలంగాణ రాష్ట్ర అరసం ప్రధాన కార్యదర్శి డా॥ రాపోలు సుదర్శన్, ప్రజానాట్యమండలి జాతీయ కార్యదర్శి గని, సందేశాలు ఇచ్చారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

అభ్యుదయ రచయితలు సామాజికంగా వస్తున్న మార్పులను అవగాహన చేసుకుని ప్రజలను చైతన్యపరిచే విధంగా రచనలు చేయాలని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్ అన్నారు.

తెలుగు సాహిత్యం – దశ దిశ అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి జి.ఎస్.చలం అధ్యక్షత వహించారు. సాహితీవేత్త ముత్తేవి రవీంద్రనాథ్, ద్రవిడ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ కె.శ్రీదేవి ప్రసంగించారు. అరసం కార్యదర్శి కలం ప్రహ్లాద సమన్వయకర్తగా ఉన్నారు.

ఆంధ్ర రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజల్ని భ్రమల్లో ఉంచుతోందని యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగు విభాగ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్.ఈశ్వరరెడ్డి అన్నారు. తెలుగునాట తెలుగు భాష గమనం – గమ్యం అంశంపై జరిగిన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని తప్పనిసరి చేయడం సరికాదన్నారు. ఆంగ్లమాధ్యమంలో విద్యాభ్యాసంతోనే అన్నీ అయిపోతాయనే భ్రమను ప్రభుత్వం ప్రజలకు కల్పించడం సరికాదన్నారు. సదస్సులో ప్రజాసాహితి నాయకులు దివికుమార్, సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు సత్యాజీ, అరసం అధ్యక్ష వర్గ సభ్యులు సాకం నాగరాజ ప్రసంగించారు. తిరుపతి జిల్లా అరసం అధ్యక్షులు యువశ్రీ మురళి సమన్వయకర్తగా ఉన్నారు.

ఈ మహాసభల సందర్భంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతీ ప్రదానం జరిగింది. చెరుకుమల్లి సింగ సంపాదకులుగా వస్తున్న అమరావతి మిర్రర్ మాసపత్రిక అరసం రాష్ట్ర మహాసభల ప్రత్యేక సంచికను అరసం కార్యవర్గ సభ్యులు జి. ఓబులేసు ఆవిష్కరించారు. డా.పి. సంజీవమ్మ రచించిన జీవని సాహిత్య వ్యాససంపుటి, మందలపర్తి కిషోర్ వ్యాససంపుటి ఇరవైలో అరవై, కోసూరి రవికుమార్ కవితాసంపుటి దాపల బంగారు వివి ఆచార్య కవితా సంపుటి నాగేటి సాళ్ళలోను అరసం నేతలు ఆవిష్కరించారు. శిఖా ఆకాష్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

ఈ మహాసభల ప్రతినిధులు, అతిథులు, రచయితలు, కవులు, కళాకారులు 11వ తేదీ సాయంత్రం సభాప్రాంగణం నుంచి రణరంగ చౌక్ వద్దకు పాదయాత్రగా వెళ్ళి స్వాతంత్ర్య సమరంలో బ్రిటీష్ పాలకుల తూటాలకు బలైన మృతవీరులకు వారి స్మారకస్థూపాల వద్ద నివాళు లర్పించారు. రాత్రి 7గంటలకు మహాసభల వేదికపై డప్పు శ్రీను కళాకారుల బృందం అభ్యుదయ గేయాలను ఆలపించింది. బద్రి కూర్మారావు తమ బృందగానంతో, డప్పు వాద్యాలతో ప్రతినిధులను అలరించారు.

**అప్రకటిత ఎమర్జెన్సీని ప్రతిఘటిద్దాం :** నేటి పాలకులు ఏ రకమైన ప్రకటనలు లేకుండానే దేశంలో ఎమర్జెన్సీని అమలు చేస్తున్నారని అరసం జాతీయ కార్యదర్శి వినీత్ తివారి అన్నారు. మహాసభల రెండవ రోజు ఉదయం ప్రగతిశీల సాహిత్యం, సాంస్కృతిక శక్తులపై దాడులు – కర్తవ్యాలు అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. సదస్సుకు అరసం రాష్ట్ర కార్యదర్శి కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ అధ్యక్షత వహించారు. బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరిస్తోందని, భావప్రకటనా స్వేచ్ఛపై దాడులకు తెగబడుతోందని తివారి అన్నారు. ఈ దాడులను ప్రతిఘటించేందుకు రచయితలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇంకా విరసం నాయకులు సి.ఎస్.ఆర్. ప్రసాద్, ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ సాహిత్య సాంస్కృతిక రంగాలపై జరిగే దాడులను తిప్పికొట్టేందుకు కవులు కళాకారులు ఒక్కటిగా నిలవాలని అన్నారు.

**పలు తీర్మానాలు :** మతోన్మాద భావజాలాన్ని తిప్పికొట్టటానికి ప్రగతిశీల సాహిత్య సంస్థలన్నీ సంఘటితం కావాలని, ఐక్యవేదిక నిర్మించాలని ఈ మహాసభల్లో తీర్మానించారు. ఇంకా ఆంధ్రప్రదేశ్‌లో అనువాద అకాడమినీ ఏర్పాటు చేయాలని, ఉన్న అన్ని అకాడమీలకు తగిన నిధులను మంజూరు చేయాలని మహాసభ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రతి ఏడాదీ రచయితల కొత్త పుస్తకాలను అన్ని గ్రంథాలయాలకూ కొని సరఫరా చేయాలని; అన్ని పాఠశాలల్లో తెలుగు మాధ్యమం తప్పనిసరి చేయాలని కోరింది. మూఢనమ్మకాల నిర్మూలనా చట్టాన్ని తీసుకురావాలని; జానపద సాహిత్యాన్ని, తెలుగు భాషని, లిపి లేని గోండు, సవర, కోయ, గబద భాషలను పరిరక్షించాలని తీర్మానాలు చేసింది.

**కథాస్రవంతి ఆవిష్కరణ :** ఈతరం కోసం కథాస్రవంతిలో భాగంగా మహాసభల సందర్భంగా 8 కథాసంపుటాలను ప్రచురించారు. వాటి ఆవిష్కరణ ప్రధాన సంపాదకులు వల్లూరు శివప్రసాద్ అధ్యక్షతన జరిగింది. కె.పి. అశోక్ కుమార్, డా॥ నక్కా విజయ రామరాజు, డా॥ హరికిషన్ ప్రసంగించారు.

**ప్రతినిధుల సభ, నూతన కార్యవర్గం :** అరసం రాష్ట్ర అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన ప్రతినిధుల సభ జరిగింది. ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. తరువాత నూతన కమిటీని పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రతిపాదించగా ప్రతినిధుల సభ ఆమోదించింది. గౌరవాధ్యక్షులుగా డా॥ పి.సంజీవమ్మ , అధ్యక్షులు డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, అధ్యక్షవర్గం డా॥ కేతు విశ్వనాథరెడ్డి, ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర రెడ్డి, సాయి మాధవ్ బుర్రా, ప్రొఫెసర్ కిన్నెర శ్రీదేవి, నల్లి ధర్మారావు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వల్లూరు శివప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.ఎస్.చలం ఎన్నికయ్యారు. కార్యదర్శి వర్గంగా కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ, బి.ఎన్.సాగర్, కలం ప్రహ్లాద, ఉప్పల అప్పలరాజు, గంటా మోహన్, యువశ్రీ మురళి, సామాజిక మాధ్యమాల కార్యదర్శిగా ఏ.ఎం.ఆర్. ఆనంద్ ఎన్నికయ్యారు.

కార్యవర్గ సభ్యులుగా డా॥ తక్కోలు మాచిరెడ్డి, చెరుకుమల్లి సింగ, డా॥ పెరుగు రామకృష్ణ, డా॥ ఏ.ఏ. నాగేంద్ర, డా॥ తుమ్మలూరి సురేష్‌బాబు, గంగా సురేష్‌బాబు, డా॥ నెమిలేటి కిట్టన్న, పల్లిపట్టు నాగరాజు, కొత్తపల్లి సత్యనారాయణ, చింతా కృష్ణారావు, ఆర్.బాలకృష్ణ, మల్లిపురం జగదీష్, మల్లుల సీతారాం ప్రసాద్, చలసాని వెంకట రామారావు, శిఖా ఆకాశ్, కొండపల్లి మాధవరావు, పరుచూరి అజయ్, పడాల వీరభద్రరావు, కోసూరి రవికుమార్, గోలి సీతారామయ్య, కొప్పర్తి రాంబాబు, మోతుకూరి అరుణ్‌కుమార్, మంచికంటి వెంకటేశ్వరరెడ్డి, ఎస్.వెంకట సుబ్బయ్య, ముర్తుజా, ఎస్.జి. ఓబులేసు, చిన్నం పెంచలయ్య, కూన అజయ్‌బాబు, పెనుగొండ లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.

**– కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ**


# సాహిత్యప్రస్థానం

విలువైన పత్రిక .. విలువలున్న పత్రిక

**చందాదారులుగా చేరండి ..**

**మీ మిత్రులను చేర్పించండి ..!**

**వివరాలకు 94900 99057 ను సంప్రదించండి.**

## కవిత

### ఆమె రాక

**బా**ర్లా తెరిచిన గేటు అలానే ఉంది
ఆమె ఎంతకూ రాదే !

కళ్ళను వీధి వాకిలికి తగిలించి
క్షణాలు లెక్కపెట్టుకుంటూ నేను

రాలుటాకుల చప్పుడుకు ఉలికులికిపడే నేల కూడా
ఆమె కోసమే ఎదురుచూస్తూ ఉంటుంది

ఆకాశాన్ని శుభ్రంగా ఊడ్చిన సూర్యుడు
ఉక్కబోతను కళ్లాపిగా చల్లుతున్నాడు
ఓదార్పునిచ్చే ఒక్క మేఘమూ లేదు

ఎగ శ్వాసతో రొప్పుతున్న ఐసియు పేషెంట్‌లా
అరుగుపక్కన వీధికుక్క డొక్కలెగరేస్తూ ...

మామిడిగుబురు పరదా వెనుక నక్కి
గజల్స్ వినిపిస్తున్న కోయిల కూడా
ఏమాత్రం సాంత్వననివ్వదు!

వడగాల్పుల కర్ఫ్యూకు
ఆటలనుంచి గృహనిర్బంధానికి తరలించబడ్డ
బాధిత చిన్నారుల సణుగుడు

రోజంతా మోగుతున్న పెళ్లి మైక్ సెట్ పాటల్లా
సహనాన్ని పరీక్షిస్తుంది!

ఇంతలో
చూస్తూనే ఉన్న కళ్ళను మోసగిస్తూ
ఆకాశంలో మబ్బులు మొలుచుకొస్తాయి
ఒక్కసారిగా మొదలైన చినుకుల రన్నింగ్ రేస్‌ను
చప్పట్లతో ఉత్సాహపరుస్తూ కిటికీ రెక్కలు ఊగిపోతాయి



మట్టివాసన గమ్మత్తు
వాసెన కట్టిన జాడీలోని ఆవకాయలా
మనసుని ఊరిస్తూ నాస్టాల్జియాలో ముంచెత్తుతుంది

నోట్ పుస్తకం కాస్తా కాగితప్పడవల అవతారమెత్తి
పిల్లల వదనాల్లో విసుగును రబ్బరు మల్లే తుడిపేస్తూ
సంబరాల సన్నాహాల వైపు మళ్ళిస్తుంది!

సినిమా హాల్లో తెరమల్లే
చూరునుంచి కిందికి దిగుతున్న ముత్యాల దండల కర్టెన్
ఉక్కిరిబిక్కిరి ఉక్కపోతకు శుభం కార్డు వేస్తుంది!

ఆమె రాకతో అంతా ఒక్కసారిగా మారిపోతుంది!


**- సత్య భాస్కర్**
satyabhasker.s@gmail.com

### నువ్వుంటే ...

**ను**వ్వుంటే ...
ఎడతెగని ఎడారిలో పాదయాత్ర చేసినా
మది దోచిన నదీ తీరాన నడిచినట్టే ఉంటుంది
ఒక్క క్షణమూ గుక్కతిప్పక
పెక్కు ఋతువుల పాటు మాటలే సాగినా..
పంచుకొనగ ఇంకొక్కటేదో
మిగిలినట్టే ఉండిపోతుంది!
గుండెలోన ఊసుల రాశి నిండిపోతుంది

జన్మ జన్మల పరిచయాన్ని
నీ కరస్పర్శ తుడిచిపోతుంది
మరలా నా మేను మరిచిపోతుంది
అదే తొలిసారి అన్నట్టు మురిసిపోతుంది.
ప్రియా!
నువ్వుంటే చాలు!

**- డా. డి.వి.జి.శంకరరావు,** మాజీ ఎంపీ,
**94408 36931**





# సానుకూల దృక్పథంతో జీవితాన్ని దర్శించే కథలు

- సత్యాజీ

గడిచిన ముప్పయ్ ఏళ్లలో మన చుట్టూ చాలా చాలా మార్పులొచ్చాయి. అప్పటిదాకా నెమ్మది నెమ్మదిగా మనం ఎదుగుతున్నట్టే– పరిసరాల్లోనూ నింపాదైన మార్పులు ఉండేవి. మనకు కనిపిస్తూ, వినిపిస్తూ, మన అంచనాలకు, అభిప్రాయాలకు అందుతూ సాగేవి. ప్రపంచీకరణ మొదలయ్యాక– మార్పుల్లో పెను తుపాను వేగం అందుకొంది. అనేకం కుదేలైపోయాయి. అనేకం కొత్త కొత్తవి వచ్చి చేరాయి. ఎవరి కోసమో, ఎందుకోసమో తెలియని అయోమయం జనసామాన్యంలో ఆవరించి ఉండగానే– మార్పు శరవేగంతో సాగిపోతూనే ఉంది. జీవితాల్లో, జీతాల్లో, జీవన విధానంలో, మానవ సంబంధాల్లో చాలా మార్పులు చోటు చేసుకున్నాయి. అవి మనుషుల మీద చూపించే ప్రభావం ఎలా ఉంది? మానవ సహజ ఉద్వేగాలకు, అవసరాలకు ... ఈ కొత్త వరవడి సృష్టించిన పెను వేగానికి మధ్య సంఘర్షణ, సమన్వయం ఎలా కుదురుతోంది? ఇలాంటి సున్నితమైన అంశాలను కథలుగా మలచటం చాలా పరిశీలనతో చేయాల్సిన పని. శ్రీ ఊహ తాజాగా వెలువరించిన తన 'ఇసుక అద్దం', ఇతర కథల్లో అలాంటి ప్రయత్నం చేశారు.

కథలు ఊహాల్లోంచి పుట్టవు. జీవితమే కథలకు ఆధారం. రచయిత్రి శ్రీ ఊహ ఆ మాటే చెప్పారు : "సాఫీగా సాగిపోతున్న ఐటీ జీవితం నుంచి హఠాత్తుగా బయటకు రావాల్సి వచ్చింది. ఆ సంఘటన గురించి కథ రాయడం, దానికి మంచి స్పందన రావడంతో నా ఆలోచనలు కొత్త కోణం వైపు అడుగులు వేశాయి." ఆ అడుగులూ, ఆలోచనలూ నిజ జీవితాల పరిశీలన మీదుగా సాగాయి. జరిగిన దానిని జరిగిన క్రమంలోనే, జరిగిన విధంగానే రాస్తే వార్త అవుతుంది. ఆ జరగటం వెనక ఏఏ కారణాలు ఉండి ఉంటాయో అన్వేషిస్తే, ఆలోచిస్తే, సరిగ్గా అన్వయించి పాత్రోచితంగా చెప్పగలిగితే మంచి కథలు పుడతాయి. శ్రీ ఊహలో ఆ పరిశీలనాశక్తి, మానవీయ దృక్పథం, కథన నైపుణ్యం పుష్కలంగా ఉన్నాయి. కాబట్టే– తన దృష్టికి వచ్చిన ఒక్కో సంఘటనా ఒక్కో కథై ఈ సంపుటిలో చోటు చేసుకొంది.

మహిళలు సాధించిన, సాధిస్తున్న ప్రగతి గురించి ఈరోజు ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. అన్ని పని ప్రాంతాల్లోనూ వారు కనిపిస్తారు. మరి ఆ పని ప్రాంతాలు మహిళలకు అనుకూలంగా ఉంటున్నాయా? అంటే అవునని జవాబు చెప్పలేం. ఈ సంపుటిలోని తొలి కథ 'వాష్' కథ చదువుతున్నప్పుడు చాలా సంగతులు తెలిసొస్తాయి. పీరియడ్స్ సమయంలో, ఇతర సందర్భాల్లో ఉద్యోగినులు ఎదుర్కొనే అసౌకర్యం, అననుకూలత కళ్లకు కడతాయి. ఇంట్లోని చీర కనపడకుండా పోయిందని బాధ పడాలా, అది పనావిడ కూతురి పెళ్లి చీరగా మారినందుకు సంతోషించాలా? అన్న సందిగ్ధంలోంచి పుట్టిన కథ 'ఎర్రచీర'. పనావిడను దొంగగా చిత్రీకరించటంగా కాక, ఆమె అవసరాల్లోంచి మనల్ని ఆలోచించేలా తీర్చిదిద్దటం ఈ కథ ప్రయోజనకత్వం. అట్టడుగు జీవితాల జీవన వెతల్ని అత్యంత దగ్గర పట్టి చూపించిన కథ .. 'శివ అంటే ఈడే ..'. హుస్సేన్ సాగర్‌లో దూకి చనిపోవాలనుకునేవాళ్లను, చనిపోయిన వాళ్లను ఒడ్డుకు చేర్చే పని అతడిది. అనాధగా బతికిన వాడు అనాథలకు ఆసరాగా నిలుస్తాడు. తన పేరుతో గుర్తింపు కోసం పరితపిస్తాడు. వృత్తిని ప్రేమిస్తాడు. సాగర్‌లో దూకినప్పుడు మేకు తగిలి ఒళు చీరుకుపోతే .. అతడు ఆసుపత్రిలో చేరాల్సి వస్తే ... 'బాడీని లేపే' పనిని అతడి భార్య శాంతమ్మ చేపడుతుంది. అన్నన్ని కష్టాల మధ్యా వాళ్లు జీవితాన్ని ప్రేమించే వైనం ఈ కథకు అంతరాత్మలా వెలుగొందింది. సమకాలీన సమాజంలో

'లావైపోవడం' పెద్ద సమస్యగా మారిపోయింది. ఆ ఇతివృత్తంతో సాగిన కథ 'డబల్ ఎక్సెల్'... అమ్మమ్మ హితబోధతో సుఖాంత మవుతుంది. ఈ కథ చెప్పటానికి రచయిత్రి ఎంచుకున్న పద్ధతి బాగుంది.

'బుజ్జమ్మ మెట్లు' కథ చదూతుంటే చాసో 'లేడీ కరుణాకరణం' గుర్తొచ్చింది. తమ్ముడి ఎదుగుదలకు గర్వమూ, ఆ స్థితిని అనుభవిస్తున్న మరదలు బుజ్జమ్మ పట్ల అసూయా ఏకకాలంలో రేకెత్తుతాయి, రత్న, అలివేలులో. ఆ ఎదుగుదలకు కారణం బుజ్జమ్మ ఎవరెవరితోనో సన్నిహితంగా ఉండడమేనని తెలిసి అగ్గి మీద గుగ్గిలమవుతారు. తమ్ముడికి తెలిసే ఇదంతా జరుగుతుందని నిర్ధారణకు వచ్చి, నెమ్మదిస్తారు. 'ఏమీ అడక్కుండా వదిలేస్తామా?' అని అలివేలు అంటే– 'పక్కా అడుగుదాం. నీ కూతురికి ఉద్యోగం, మా ఆయనకు ట్రాన్స్‌ఫర్..' అంటుంది రత్న. మనుషుల్లోని ద్వంద్వ ప్రవృత్తిని వేలెత్తి చూపే కథ ఇది. కార్పొరేట్ ఉద్యోగాల్లో పైపైకి ఎదగటానికి వృత్తి నైపుణ్యం ఒక్కటే సరిపోదు, కాస్త కాకా పట్టే స్వభావం కూడా ఉండాలి. ఆ కళకే అద్భుతమైన పేర్లు కూడా ఉంటాయి. పనికి మాత్రమే పరిమితమై, అలాంటి లౌక్యం ఇష్టం లేని అర్చనకు ఉద్యోగంలో నెగ్గుకురావడం తలనొప్పిగా తయారవుతుంది. అప్పుడు అమ్మ చెప్పిన మాటలు అద్భుతమైన ధైర్యాన్నిస్తాయి. "మీ జెనరేషన్‌తో ప్రాబ్లెం ఇదే.. అన్నీ ఒకేసారి సాధించేయాలనే తాపత్రయం. చెక్స్ అండ్ బ్యాలెన్స్ ఉండాలి. అన్నిటి వెనకా ఒకేసారి పరిగెడితే అలసిపోయేది నువ్వే ..', 'ఇది జీవితం, రేస్ కాదు. ఈ సంవత్సరం ప్రమోషన్ రాకపోతే నిన్ను వెతుక్కుంటూ వచ్చి ఎవరైనా నిలదీస్తారా? ఆ రేస్‌లో పడి నువ్వు జీవితంలో చిన్న చిన్న సంతోషాలకు దూరం అవుతున్నావు." అంటుంది తల్లి. ఈ మాటలు అర్చనకే కాదు; ఉరుకుల పరుగుల తరం మొత్తానికి వర్తిస్తాయి. సోషల్ మీడియా, విలాసతత్వం సృష్టిస్తున్న జీవన సంక్షోభాన్ని పరిచయం చేస్తుంది 'నోటిఫికేషన్' కథ. పిల్లలు చెబితే కాదు; చూసి నేర్చుకుంటారు అని ప్రబోధిస్తుంది. చేనేతకు అందించాల్సిన సాయం గురించి 'నెయ్యిబువ్వ'; తరాల మధ్య అంతరాలను, ప్రేమలను 'వడ్డాణం'; పుట్టెడు కష్టాల్లోనూ తోటి మనుషుల గురించి ఆలోచించే వైనాన్ని 'మనిషి అని పిలవనా' కథలు చర్చిస్తాయి.

ఈ సంపుటికి శీర్షికగా అమరిన 'ఇసుక అద్దం' ప్రత్యేకమైన ప్రేమ కథ. వయసు చిన్నదైనా అద్భుతమైన పరిణతి, పట్టుదలా ప్రదర్శించే కౌముది; ఆమె ప్రేరణతో ఇజ్జత్ గల మనిషిగా ఎదిగిన శివ ... పాఠకుల మది నిండా నిలిచిపోతారు. దుబాయ్ బుర్జ్ ఖలీఫాలో క్లీనింగ్ పనిలో కుదిరిన శివ క్షణక్షణం కౌముదినే దర్శిస్తాడు. అత్యంత ఎత్తులో క్లీనింగ్ పనిచేస్తున్నప్పుడు ఏదన్నా ప్రమాదం ముంచుకొస్తుందా అన్న ఉత్కంఠ వెంటాడుతుంది. గౌరవప్రదంగా బతకటమే జీవితం, అలా చేయగలిగిందే ప్రేమ అని చెప్పటానికి అత్యంత నైపుణ్యంతో మలచిన కథ ఇది.

గొప్ప సానుకూల దృక్పథంతో సమకాలీన సంఘర్షణలను చిత్రించిన కథలు ఇవి. శ్రీ ఊహకు ఇది తొలి కథా సంపుటే అయినప్పటికీ – కథను చెప్పటంలో చాలా గొప్ప పరిణతి కనిపిస్తుంది. చిన్న చిన్న మాటలతో కథను వేగంగా నడిపే నైపుణ్యం ముచ్చట గొలుపుతుంది. "గచ్చి బౌలి.రాళ్లు గుట్టలు, ఇరుకు రోడ్లతో ఒకప్పుడు నిర్మానుష్యంగా ఉండేది. రాను రాను గుట్టలను అభివృద్ధి మింగేసింది. రోడ్లను వాహనాలు కమ్మేసాయ్ .." అనటంతో రెండు పెద్ద పెద్ద దృశ్యాలు, పరిణామ క్రమాలూ మన కళ్లముందు సాక్షాత్కరిస్తాయి. 'చిలకలు' కథలో వనజక్క కీలకమైనప్పటికీ ఆమెను నేరుగా చూపకుండా కథ చెప్పటం ఒక మేలిమి లక్షణం. 'బుజ్జమ్మ మెట్లు'లోనూ ఇదే తరహా ఎత్తుగడ. 'డైరెక్టడ్ బై వర్మ' ఉత్కంఠభరిత కథ. ఎప్పుడేం జరుగుతుందోనన్న ఎదురుచూపును కొనసాగిస్తూనే ... తాయెత్తుల తంతులోని మోసకారితనాన్ని బట్టబయలు చేయడం అభినందనీయం. వివిధ ఆధునిక రంగాల్లో పనిచేస్తున్న, ఆధునిక జీవనాన్ని చవిచూస్తున్న యువ కథకులు తాము చూస్తున్న, ఎదుర్కొంటున్న సమస్యలను, సంఘర్షణలను ఇలా కథోపకథలుగా వెలువరించటం మెచ్చదగినది. శ్రీ ఊహ నిశిత పరిశీలన, కథన కౌశలం, నిర్మాణ నైపుణ్యం భవిష్యత్తులో మరిన్ని మంచి కథలకు ప్రాణం పోస్తాయని బలంగా నమ్మకం కలుగుతోంది. ■

## కథా పురస్కారానికి రచనల ఆహ్వానం

**శ్రీమతి** గంటా కమలమ్మ స్మారక కథా పురస్కారానికి గాను, రాయలసీమ కథకుల నుండి రచనలను ఆహ్వానిస్తున్నట్లు అవార్డు వ్యవస్థాపకులు గంటా మోహన్ తెలిపారు. ఈమేరకు, శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, 2021, 2022 సంవత్సరాల్లో ముద్రితమైన కథా సంపుటాలను మూడేసి ప్రతులను, గంటా మోహన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బంగారు పాలెం (పోస్టు, మండలం), చిత్తూరు జిల్లా అనే చిరునామాకు మార్చి 30 లోపు చేరేలా పంపాలని కోరారు. పురస్కార గ్రహీతను పదివేల రూపాయలు నగదు, జ్ఞాపికతో సత్కరించనున్నట్లు తెలిపారు.

## ఇరానీ చాయ్ ...!

హైదరాబాద్‌లో ఉద్యోగమొచ్చిన తొలి రోజుల్లో
సాయంత్రం ఐదు కాగానే
బెదురుగా ఆఫీసు నుండి బయటపడి
ఆకలి మంటల కడుపుని చల్లార్చడానికి టీ నీళ్ల కోసం
'జమ్ జామ్'లో దిగేవాణ్ణి...
కొత్తలో గొంతు మండే మధువులా
ఆ గాఢతకి ఖాళీ కడుపు తిప్పేది
అంతవరకూ 'టీ' టోటలర్‌ని...
కానీ కాఫీ అలవాటే
కాఫీ కావాలంటే 'క్రాంతెన' పక్క నున్న
'క్రిష్ణా' తీరానికెళ్లాల్సిందే...
'ఏక్ ఛాయ్... ఏక్ ఎమ్టీ'
కొత్త జీవితం సర్దుబాటుని అలవాటు చేసింది
పొగలు కక్కే టీ కప్పు
పరిమళాలు వెదజల్లే పారశీక పుష్పం
హొటలొక చమన్!...
ప్లేటులో పెట్టిన కారా బిస్కట్లన్నీ
తినేయాలనుకునే అమాయకత్వం అప్పట్లో ...
నగరం నేర్పినవెన్నో!
బీరువా గ్లాసు వెనుక
రెక్కల్లో తలదూర్చి ముడుచుకుపడుకున్న కబూతర్‌లా
భారీ కాజా పూరీ
చిన్నప్పుడు మార్టేరు మంగళవారం సంతలో
తాతయ్య తెచ్చే మడత ఖాజా
జ్ఞాపకాన్ని తాజా పరుస్తూ... నోరూరిస్తూ...
ఎన్నికలప్పుడు సుత్తీ కొడవలి బాడ్జీని ఎదపై
సగర్వంగా పెట్టుకు తిరిగే
ఖాసిం సాహెబ్ మామయ్య
రంజాన్ రోజునిచ్చే పలావు మాలావు రుచి వుండేది
మళ్లీ ఆ రుచి జాడ
ఆబిడ్స్ గ్రాండ్ హొటల్‌లో కనిపించింది
ఇప్పుడు అటు చిక్కటి ఆంధ్రా టీ ఇరానీ హొటల్లో సైతం
ఇటు హైదరాబాద్ ఇరానీ ఛాయ్ అన్న బోర్డులు దర్పంగా...
అన్నీ జీవన వైవిధ్యం రుచి చూపించేవే...
వైరుధ్యం కాదు సుమా; వైవిధ్యం
జీవితపు రుచిని పెంచే వైవిధ్యం ...!

♦ 'జమ్ జామ్' ఇరాన్ దేశపు ప్రముఖ నది ♦ క్రిష్ణా అనేది క్రిష్ణా హొటల్

(తీరప్రాంతం వాడైనా ఇరానీ ఛాయ్ లేందే పొద్దు గడవని గుప్తా గారికి)

**- ఎస్.హనుమంతరావు**

8897815656

## మంజూషమా .. జోహారు ...

గతాన్ని జ్ఞాపకాల పొదరింట బొమ్మ కట్టి
జనం కోసం అపురూప ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు
జీవితాన్ని కమ్మని కలగా కంటూ తుళ్ళుతూ
ఆట బొమ్మల్లా బాల్యాన గోడూబిళ్ళా ఆడుకుంటున్నట్లు
జీవిత చరమాంకాన దేవతారూపం దాల్చినట్లు
నిశ్శబ్ద కాసారంలో వెలుగుతూ వెలుగుతూ
కొడిగట్టిన వత్తి
వత్తి పక్కనే పొత్తిగిల్లిన ఓ మంజూషం
తన శీతల సమీరంతో
కుళ్ళుపై పోరాడుతున్న మహోన్నత బ్రహ్మ పదార్థం
మనిషి ఆఖరి అంకాన్ని తనలో ఇముడ్చుకొనే
అపురూప ధాతువు
మనిషిలో జీవుడు నిష్క్రమించాక
పార్థివ శరీర నిష్క్రమణ వేళ
ఆఖరి మజిలీ కోసం ఏర్పరచిన శయన మందిరం
రాజ్యాలేలిన రాజులైనా ఆఖరి ప్రస్థానం అక్కడే
విశ్వాన్ని ఉగ్రూతలూగించిన నటవిరాట్టులైనా
ఆఖరి విడిది అదే కదా!
అపురూప జీవన దేహానికి సాంత్వన పలికే
ఓదార్పు సూచిక ధవళకాంతులీను మంజూషమే!
కడపటి భాగ్యోదయ స్పర్శను అందించే ఆఖరి మజిలీ అక్కడే
అక్కున జేర్చుకొని ఆదరించే శీతల కోవెల అదే
తన చల్లని చేత్తో పొదవి పట్టుకొని ఓదార్చి
ఆఖరి ఘడియల్లో సుఖవంతం చేయగల్గే
అమృత వాటిక అదే
బంగారు స్వూనుతో జన్మించినా
ఆఖరు ఘటనల శుశ్రూషల మహాతల్లి అదే
ఆవేదనాపరుల గుండెల్లో జ్ఞాపకాల
బీజాల్ని చిరస్మరణీయం చేసి
చితిని పేర్చే సమశీతల మంజూషానికి
నిలువెత్తు జోహార్లు ..!



**- చిన్ని నారాయణ రావు**

9440202942



# జీవ వైవిధ్యం

- పి.ఎల్.ఎన్. మంగారత్నం
97014 26788

ఆ రోజు ఉదయం ..

తొమ్మిది గంటలకు నేనింకా .. వంటలో ఉండగానే వీధి గుమ్మంలోనుంచి ఉషామణి గారి నుంచి పిలుపు. నన్ను పేరుతో పిలిచేది ఆవిడ మాత్రమే!

రెండు బ్లాకులుగా కట్టిన ఈ అరవై పోర్షన్ల అపార్టుమెంటులో మిగిలిన వాళ్లందరికీ నేను 'అంటీ'నే. పిల్లలకైనా, పెద్దలకైనా. ఇంకా ఉంటే .. వాళ్ళ మనవలకైనా. రిటైరు అయి రెండేళ్ళు గడిచిన నా వయసు కన్నా .. మరో పదేళ్ళు పెద్దది ఆవిడ.

మా డోర్ కర్టెను పక్కకు లాగి పట్టుకుని, లోపలి తొంగి చూస్తూ 'పనిలో ఉన్నారా?' మళ్ళీ అడిగింది.

ఉదయం, నిద్ర లేచినపుడు తీసిన తలుపు .. మళ్ళీ రాత్రి పడుకునేటప్పుడే వేసేది. అయిదవ ఫ్లోర్లోని లిఫ్ట్ పక్క పోర్షన్ అయినా సరే, అది అలానే ఉంటుంది ఎప్పుడూ. నాకు తలుపులు తెరుచుకుని ఉండే అలవాటు ఉన్నందుకేమో! ఎదురు పోర్షన్లోకి ఎవరు వచ్చినా తలుపులు బిడాయించుకునే ఉంటారు.

అలాగే, ఈవిడా. ఎంతో అవసరం అయితే తప్ప బయటకు రాదు. కనిపిస్తే పలకరించుకోవడమే. అలాంటిది ఏం అవసరం వచ్చిందో, పొద్దుటే, గుమ్మం ముందుకు వచ్చింది. ఇంతకు ముందు అయితే .. సాయంత్రాలు వాళ్ళ తలుపులు తెరిస్తే, అప్పుడప్పుడూ ఇంట్లికి వెళ్లి కూర్చునేదాన్ని. ఇంట్లో ఆవిడా, అన్న గారు ఇద్దరే ఉంటారు.

ఆవిడకి భర్త లేకపోతే .. అన్న గారికి భార్య లేదు.

ఉషామణి గారికి ఒక కొడుకూ, కూతురు అయితే .. అన్న గారికీ ఓ కొడుకూ, కూతురే. ఈవిడ కొడుకు సుదర్శనరావు హైదరాబాదులో మంచి ఉద్యోగంలో ఉంటే .. కూతురు పెళ్లై అత్తవారింటిలో ఉంది. కొడుక్కి చేసుకున్నది, ఇంకో అన్న కూతుర్నే. అయినా, ఆ పిల్లకి మేనత్త పొడగిట్టక పోవడంతో .. రిటైరు అయినా కొడుకు దగ్గరకు వెళ్లి ఉండక .. ఉన్న ఊరిలోనే ఉండిపోయింది ఒంటరిగా. ఆ తరువాతి కాలంలో, అన్నగారికి భార్యా, కొడుకూ పోవడంతో .. చెల్లెలి దగ్గరకు వచ్చేసాడట, ఆవిడది సొంత ఇల్లు కావడంతో.

తరువాత .. తరువాత

ఏవో కారణాలతో, ఉషామణి గారు కూడా ఉన్న 'ఫ్లాట్'ను అమ్మేసుకుని, అన్నగారితో పాటు, ఎక్కడెక్కడో ఉండి, చివరికి మా ఎదుటి ఫ్లాట్లోకే .. అద్దెకు దిగారు నాలుగేళ్ళ కిందట.

ఆవిడకి పెన్షను ఆసరా అయితే .. అన్నగారు తద్దినం బ్రాహ్మడు. ఎవరి దగ్గరో జీతానికి పని చేస్తాడు. అయినా, ఇద్దరి సంపాదనలూ అంతంతమాత్రమే. అన్ని సౌకర్యాలూ ఉన్నాయని, చివరి రోజుల్లో ఈ ఖరీదైన అపార్టుమెంటులో దిగారు గానీ.. గొర్రె తోక బెత్తెడే.

తల్లిని, తీసుకెళ్ళి ఇంట్లో ఉంచుకోకపోయినా .. ఖర్చులకు ఇబ్బంది లేకుండా డబ్బు పంపిస్తుంటాడు సుదర్శనరావు. మొదట్లో.. ఆఫీసు పనుల వల్ల ఆవిడని, నేను అంత పట్టించుకాకపోయినా .. కాలక్రమంలో మంచి స్నేహమే కుదిరింది మాకు... ఇంట్లో కష్టం సుఖం చెప్పుకునేంతగా.

పొద్దుటే, ఆవిడ అలా వచ్చేసరికి "ఆ .. వస్తున్నా ఉండండి' అంటూ కాగే నీళ్ళ కింద స్టవ్ కట్టేసి ముందు ఉన్న హాల్లోకి వెళుతుంటే ... 'మాస్కు వేసుకెళ్ళు' అంటూ ఆయన హెచ్చరిక చిన్నగా వినిపించింది. మాస్కు ధరించి, వంటగది దాటి, హాల్లోకి అడుగుపెట్టాను.

"నేను నాలుగు రోజులనుంచి ఇంట్లో లేను, మా అమ్మాయి గారి ఇంటికి కాత్రావులపల్లి వెళ్ళాను పండక్కి" చెప్పింది ఆవిడ.

"ఆ .. లేకపోవడం గమనించాను. గుమ్మం ముందు ముగ్గు కూడా లేదు" చెప్పాను. ఆవిడ చేతిలో ఉన్న డోర్ కర్టెను గుడ్డని తీసుకుని .. తలుపు మీదకి జారేస్తూ.

ఆవిడ బయటా .. నేను లోపలా.

'లోపలికి రండి' అనే మాట దూరం అయిపోయింది.

"ఓ గంట అయ్యింది వచ్చి. ఇప్పుడే మా ఇంటి ఓనరు సతీష్ గారు 'ఫోన్' చేసారు. ఆయన అక్కకీ .. అతనికీ ఏవో 'గొడవలు' వచ్చాయట. ఆ అక్కగారి పోర్షన్లో అతను 'రెంటు'కే ఉంటూ .. అతని పోర్షన్ మాకు అద్దెకు ఇచ్చాడట. ఇప్పుడు ఆవిడ అర్జంటుగా.. ఆవిడ పోర్షన్ ఖాళీ చేసి ఇచ్చెయ్యమందట. కాబట్టి, అతని పోర్షన్లోకి అతను వచ్చేయ్యడానికి .. మమ్మల్ని రెండు రోజుల్లో ఖాళీ చెయ్యమన్నారు" చెప్పిందావిడ.

"అయ్యో!" షాక్ తిన్నాను.

ఎందరితో స్నేహం ఎలా ఉన్నా .. కాస్త మనసు విప్పి మాట్లాడింది ఈమెతోనే. అందుకు వయసు ఓ కారణం కావచ్చు.

"అలా అన్నది మొదలు కాళ్ళూ, చేతులూ ఆడడం లేదు. ముందు మీకే చెప్పాలని వచ్చాను" గుమ్మం కమ్మీని పట్టుకుని నిలబడింది.

ఒక్క నిముషం పాటు మాట్లాడలేకపోయినా..

"ఆ .. ఆ అక్క అయినా వచ్చి ఈ ఇంట్లో ఉండిపోతుందా? ఏమిటి? వాళ్ళకి ముందునున్న, వీధిలో పెద్ద ఇల్లే ఉంది. తమ్ముడితో ఖాళీ చేయించిన ఇల్లు .. ఇంకెవరికో ఇచ్చుకునే బదులు.. 'రెంటు' ఇచ్చేటపుడు తమ్ముడిని ఉండనిస్తే ఏమయ్యిందో" అన్నా స్వగతంలా.

"అదే కాదు, సతీష్ గారి భార్య అరుణ' మొన్నా మధ్య .. ఆ ముందు వీధిలోనే 'బ్యూటీ పార్లర్' కూడా పెట్టింది కదా!"

"ఊ"

"ఆ ఇల్లు కూడా అక్కగారిదేనట. దాన్నీ, ఖాళీ చేసెయ్యమంటే, నిన్నటి రోజున అదీ ఖాళీ చేసి ఇచ్చేసారట"

"హా" ఆశ్చర్యపోయాను.

"అలాగే 'అతను' నడుపుకునే మెయిన్ రోడ్డు మీద ఉన్న 'కార్ వాష్' సెంటరు 'స్థలం' కూడా అక్కగారిదేనట. అదీ ఖాళీ చేసెయ్యమంటే .. అది కూడా ఖాళీ చేసి ఇచ్చేసారట"

ఇంకేం మాట్లాడలేదు ఈసారి.

ఆస్తులు .. అయిన వాళ్ళ మధ్య ఎంత చిచ్చు రేపుతాయో!

వెంటనే, ఆ కుటుంబ నేపథ్యం కళ్ళముందు మెదిలింది.

సతీష్ తండ్రి, సత్యనారాయణ గారూ ఈ అపార్టుమెంటు లోనే .. మూడవ ఫ్లోర్లో, ఫ్లాటు కొనుక్కున్నారు, మాతో పాటే 'పదహారేళ్ళ' కిందట. అతను బ్యాంకు ఉద్యోగం చేసి, రిటైరు అయిపోయి, రియల్ ఎస్టేటు వ్యాపారంలోకి దిగారు. ఎక్కడ చవుకగా వస్తే అక్కడ భూములు కొనడం .. అమ్మడం. ఆ తరువాతి కాలంలో .. మా ఎదుటి పోర్షనూ, రెండవ సేల్లో" కొన్నారు. అలా ఈ అపార్టుమెంటు అతనికి రెండు ఇళ్ళు ఉన్నాయి.

ముందు కొన్నది పెద్దదైన కూతురికి ఇచ్చి, రెండవది కొడుక్కి ఇచ్చినట్లున్నారు. కూతురు హన్విత భర్త అమెరికాలో సాఫ్ట్వేర్ ఇంజనీరు. అక్కడే ఇల్లు కొనుక్కుని స్థిరపడడమే కాదు, వీలైనపుడు మావగారికి డబ్బు పంపిస్తుంటాడట, తమ కోసం కూడా భూములు కొనమని. అలా కొన్నవి అన్నీ, తరచూ వచ్చి పోయే కూతురి పేరు మీదే ఉన్నాయన్న మాట.

మళ్ళీ ఆవిడే అంది. "అయినా, డబ్బేం చేసుకుంటారండీ? మొగుడో చోట .. పెళ్ళాం ఓ చోట. బతికే బతుకు సుఖంగా ఉండాలి కదా!" ఏమీ చెయ్యలేని పరిస్థితిలో ఆవిడ తన అసహనాన్ని వ్యక్తపరుస్తూ.

"అదేం. లేదు లెండి. వెళ్ళాలంటే, ఆ అమ్మాయి రెండు నెలలకు ఓసారి .. భర్త దగ్గరకు వెళ్లి రాగలదు. అమెరికా చదువుల కన్నా .. ఇండియా చదువులే మేలని, కూతుర్ని ఇంటర్మీడియట్ చదివించడం కోసం అన్నట్లూ, తండ్రి కూడా పెద్దవాడు అయిపోవడంతో ప్రస్తుతం వచ్చి ఇక్కడ ఉంటుంది" చెప్పాను.

"అయినా, ఎవరిష్టం వారిది లెండి. మా అన్నాచెల్లెళ్ళం 'ఇద్దరి'లో .. ఎవరు ముందు 'పోయినా' రెండో వాళ్ళు ఇల్లు ఖాళీ చేసేయ్యాలనుకున్నాం. కానీ, ఇప్పుడే ఇలా ఖాళీ చేసేయ్యాల్సి వస్తుందనుకోలేదు" అంటూ దిగులు పడింది.

ఆ క్షణాన.. నాకూ అలాంటి ఆలోచనే వచ్చింది.

ఆ పెద్దవాళ్ళు ఇద్దరూ ఇంట్లో దిగినప్పటి ఓపికలతో ఇప్పుడు లేరు. ఆవిడ అయితే, సందు చివరన ఉన్న మందుల షాపుకే వెళ్ళలేకపోతుంది. అన్నగారూ అంతే! బయట నుంచి వచ్చి కింద కారిడార్లో కాస్సేపు కుర్చీలో కూర్చోనిదే .. లిఫ్ట్ ఎక్కరు. వీళ్ళకు చేసి పెట్టడానికి కూడా మరెవ్వరూ లేరు.

ఇవన్నీ అందరికీ తెలిసినవే; ఒక్క 'కొడుక్కి' తప్ప.

భార్యకు నచ్చచెప్పుకోలేడా? చెప్పేవాళ్ళులేక గాని.

అంతలోనే తేరుకుని "అయితే, సతీష్ ఖాళీ చేసే.. ఆ అక్కగారి పోర్షన్ అయినా ఇవ్వమని అనకపోయారా?" సమస్య అలా తీరిపోతుంది అనుకుంటూ.

"అదీ అయ్యింది. అంత అద్దె మీరు భరించలేరు . ఎనిమిది వేల అద్దె, ఎనిమిది వందల మెయింటినెన్సూ.. మీకు కష్టం అన్నాడు".

అది రోడ్డు ఫెసింగులో ఉన్న .. విశాలమైన ఫ్లాటు. పైగా కప్ బోర్డూ, బయట అంతా గ్రిల్సూ. ఇక మాట్లాడడానికి ఏముంది?

ఉన్న ఇల్లు అమ్మేసుకున్నాక .. లేవలేని వాళ్ళకి డబ్బు కోసం అయినా, ఎవరు .. ఎన్నాళ్ళు ఆశ్రయం ఇస్తారు? 'అయిన' వాళ్ళకే మనుషుల మీద ఆసక్తి లేకపోతే, బయట వాళ్ళకు ఏమిటి? వీళ్ళు కాకపోతే, మరొకళ్ళు వచ్చి 'అద్దె' ఇస్తారు. 'గ్రాసం' లేకపోయినా ఓ పూట గడుస్తుంది గానీ .. 'వాసం' లేకపోతే గడవదు అనేది ఓ తెలిసినావిడ. అదేదో ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను.

■■■

ఆరోజంతా మనసు మనసులో లేదు, వాళ్ళ పరిస్థితిని తలుచుకుని. రోజంతా ఎవరితోనో ఫోనులో మాట్లాడుతూ .. బాధ పడుతునే ఉంది ఆవిడ. కూర్చున్న పీట కదిలిపోతే, ఎవరికి మాత్రం స్థిమితం?

ఆ సాయంత్రం ..

ఎక్కడికో వెళ్లి .. నీరసపడుతూ వచ్చింది.

బయట కారిడార్లో నిలబడిన ఉన్న నన్ను చూసి ..

"మా పనిది, ఈ చుట్టుపక్కల పదకొండు ఇళ్ళు చేస్తుంది కదా! దానికేమన్నా చెబితే పని అవుతుందేమోనని చెప్పా. అలా చెప్పినందుకు .. పక్కనున్న 'సుజనా అపార్టుమెంటు'లోకి తీసి కెళ్ళింది. నేల మీద పోర్షను. ఓ మెట్టు ఎక్కాల్సిన పని లేదు అనుకున్నా. అద్దె కూడా ఫర్వాలేదు. దీని అంతే, ఐదువేలే. అయితే, బాత్రుంలు బయటకు ఉన్నాయి. రాత్రి పూట బయటకు వెళ్ళాలంటే కష్టం కదా! వచ్చేసాను" చెప్పిందావిడ.

ఇప్పుడు నేను శ్రోతనే. ఆవిడ ఏం చెబితే అది వినడమే.

"మా అన్నయ్యని తిరుమలరావు వీధిలో ఏమైనా ఉంటాయేమో కనుక్కోమన్నాను. అక్కడ తెలిసిన వాళ్ళ ఇల్లు ఒకటి ఉంది. కింద పోర్షన్ ఏదైనా ఖాళీగా ఉందేమోనని. అక్కడికైతే మా పనిది రాలేదు. అంతదూరం. మళ్ళీ అక్కడెవరు దొరుకుతారో నాకు" తలుపుకి ఉన్న తాళం తీస్తూ చెప్పింది.

అన్నీ సమస్యలే. ఆ వయసులో ఒకళ్ళు వండి పెడితే, తిని సుఖంగా ఉండాల్సిన పరిస్థితి. ఆవిడకు అది సాధ్యపడడం లేదు. తనతో పాటు మరొకరికీ వండిపెట్టాలి. జీవిత చరమాంకంలోనూ వదలని కష్టం.

ఒకప్పుడు సంపాదించుకుని, మహారాణిలా బతికిన ఆమె, అభిమానం చంపుకుని కొడుకు ఇంటికి వెళ్ళినా.. కోడలి నిరాదరణను తట్టుకోలేక పోతానేమోనన్న భయం. కొడుకుతో ఏమైనా అంటే "నువ్వు వచ్చేస్తే, మామయ్య ఒంటరి వాడైపోతాడు కదే!" అంటాడు. లేవలేని తల్లి కన్నా.. మేనమామ బాధ్యతే ఎక్కువన్నట్లు.

ఇంతలో.. బయటకు వెళ్ళిన అన్నగారు కూడా వచ్చారు.

"ఏమయ్యింది? కనుక్కున్నావా?" అడిగింది ఆత్రంగా.

"ఆ.. నేల మీద ఏమీ లేవు. మూడో అంతస్తులో ఉన్నాయి అంటే, వెళ్ళబోయాను. రెండు అంతస్తులు ఎక్కే సరికి, ఆయాసం వచ్చింది. వెనక్కి వచ్చేసాను" చెప్పాడు. తనకు డెబ్బై అయిదు పైనే.

వాళ్ళ పరిస్థితికి జాలి పడుతూ "మెట్లు అంటే అసలు వెళ్ళాల్సిన పనే లేదు, మీరు" అన్నాను.

అలా మాట కలిపినందుకో, ఏమో! ..

"ఆ మధ్య .. మీరో ఇల్లు కొన్నారు కదా!" అడిగాడు ఆశగా నా వైపు చూస్తూ. ఆశ ఎంత బలియమైనదో అతన్ని చూస్తే తెలిసింది.

సంవత్సరం కిందట ..

రిటైరుమెంటు డబ్బుల్తో, ఉన్న అపార్టుమెంటులోనే, ఇంకొక పోర్షన్ అమ్మకానికి వస్తే, డబ్బులు బ్యాంకులో ఉంటే, 'ఇన్‌కంటాక్స్' సమస్య అని .. కొన్నాను. ఇప్పుడు అందులో అబ్బాయి వాళ్ళు ఉంటున్నారు.

"మా అబ్బాయే వచ్చి ఉంటున్నాడు" చెప్పాను, మీకేం సహాయం చెయ్యలేను అన్న అర్థం వచ్చేలా.

విషయం సద్దుమణిగినాక .. మా శ్రీవారితో అన్నాను.

"ఇక నుంచీ సతీష్ వాళ్ళు వచ్చి ఉంటారన్న మాట, నలుగురు మనుషులు వాళ్ళు, ఆ పిల్లాడు అసలే అల్లరిగాడు, కాలు నిలవదు. హడావుడిగా ఉంటుంది ఇంటి ముందు" అని.

నాకు ఆ సతీష్ మీద అంత సదభిప్రాయం లేదు. అసోసియేషన్ మీటింగుల్లో అందరి మీదా నోరు పారేసుకుంటాడు. 'ఆడూ, ఈడూ' అంటూ గట్టిగా మాట్లాడతాడు. అందరూ వాళ్ళ .. నాన్న సత్యనారాయణ గారి ముఖం చూసి, సర్దుకుపోతూ ఉంటారు. అందుకే, వాళ్ళు వస్తారంటే, ఇప్పటి నుంచే కాస్త అలజడిగా ఉంది మనసులో.

"అతను ఏమీ రాడు. ఏదో, వీళ్ళని ఖాళీ చేయించే ఆలోచన .. అంతే" అన్నారు.

"అలా ఎలా తెలుసు?" అడిగాను ఆశ్చర్యంగా. ఎందుకైనా కిందికి వెళ్ళినప్పుడు .. అతను కనిపించి చెప్పాడు గానేమో! అని. ఆయన మాట్లాడలేదు. 'అవును' అంటే, నేను మళ్ళీ ఆవిడతో అనేస్తాననుకున్నారో! ఏమో!

■■■

మరో నాలుగు రోజులు గడిచినా వాళ్ళ సమస్య తీరలేదు.

ఈ కరోనా సమయంలో ఊరిలో చాలా ఇల్లు ఖాళీ అయినా .. అద్దెలు ఏవీ ఎనిమిది వేలకు తక్కువ లేవు. కొన్ని చోట్ల, అయిదు అంతస్తుల పైన 'పెంట్ హౌస్లు' మాత్రమే ఉన్నాయి. అంత చివర ఉండ లేక .. వెళ్లి చూసే ప్రయత్నమూ చెయ్యలేదు.

తరచూ ఫోన్లోనే ఉంటుంది ఆవిడ. "అబ్బే, ఇండివిడ్యువల్ హౌస్ వద్దు, అపార్టుమెంటు అయితేనే, సెక్యూరిటీ ఉంటుంది. అలాంటి ఇళ్ళలోకి వెళ్లి .. ఆ కడుగుళ్ళూ, తుడుపులూ నేను చెయ్యగలనా" అంటుంది ఎవరితోనో!

■■■

నాలుగు రోజుల తరువాత ఆవిడే వచ్చి ..

"మనింటిలోనే, రెండవ ఫ్లోర్లో .. ఆ బట్టల దుకాణం వాళ్ళు ఖాళీ చేసిన పోర్షన్ ఖాళీగా ఉందిట" చెప్పింది సంతోషంగా.

"హా! ఇంకా అది ఖాళీగానే ఉందా! నాలుగునెలల నుంచీ" నేనూ సంతోష పడ్డాను. చంకలో పిల్లాడిని పెట్టుకుని ఊరంతా తిరిగినట్లు అయ్యింది. అయితే, దానికి 'టు-లెట్ 'బోర్డు పెట్టలేదు. వాళ్ళు ఖాళీ చేసేముందు ఆ ఇంటి అతనికి 'కరోనా' వస్తే అక్కడే ఉండి, తగ్గిన తరువాతే .. వెళ్లారు. అప్పుడు అన్ని రోజులూ .. మున్సిపాలిటీ వాళ్ళు అ ఇంటి ముందు ఎక్కువ మోతాదులో బ్లీచింగు జల్లి, సానిటైజ్ చేసేవాళ్ళు. అందుకేనేమో ఖాళీ అయిన అన్ని రోజులైనా ఎవరూ వచ్చింది లేదు.

ఇప్పుడు ఈవిడ కాలికి తగిలింది.

"అద్దె .. ఏడువేల అయిదు వందలు చెబుతున్నారు. ఇంటి ఓనర్స్ ఇక్కడ ఉండరట. కొడుకు విజయవాడలో డాక్టరు అయితే, వెళ్లి అక్కడ ఉండిపోతున్నారట. మన అపార్టుమెంటు అసోసియేషన్ సెక్రటరీ 'శ్రీధర్' గారు ఏ విషయమూ రేపు చెబుతానన్నారు" చెప్పింది.

ఆ శ్రీధరు ... ఫైనాన్స్ బిజినెస్ చేస్తూ, దగ్గర లేని వాళ్ళ ఇళ్ళకి 'కేర్ టేకర్లా' వ్యవహరిస్తాడు. ఇంటి పనులు అంటే, సున్నాలు వేయించడం, రిపేర్లు వస్తే చేయించడం మాత్రమే కాదు, ఇళ్ళ అమ్మకాల బేరాలు చూసిపెట్టడం లాంటి పనులు చేస్తూ ఉంటాడు. తెలివితేటలు ఉంటే డబ్బు సంపాదించడం సులువే. దానికి పెద్ద చదువులు అవసరం లేదు.

■■■

ఆ మరునాడు ..

"ఆ ఇంటికి రెండు నెలల ఎడ్వాన్సు ఇచ్చేశాను. మా అబ్బాయి డబ్బు పంపిస్తాను. ఇబ్బంది పడవద్దు అన్నాడు " చెప్పింది నిశ్చింతగా.

"పోన్లెండి"

"శ్రీధర్ గారు ఫోన్లో 'ఇంకా ఓపికలో ఉన్న వాళ్ళే. వాళ్ళ పనులు వాళ్ళు చేసుకోగలరు. బయటకీ వెళ్లి వస్తుంటారు' అంటూ, చెప్పడంతో వప్పుకున్నారు .. ఆ ఇంటి ఓనర్లు" అంటూ.

అలా చెప్పకపోతే, పని జరగదు.

మళ్ళీ ఆవిడే "వెనుక వీధిలో నేల మీదే ఒక ఇల్లుంది. అద్దె .. దీనిలానే అయిదు వేలే. అయితే, ఇంటి ఓనర్లు పక్కనే ఉంటారు. వాళ్ళూ మా వాళ్లే. అయితే, మాత్రం .. ఇంటి ఓనర్లు పక్కనే, ఉంటే ఇబ్బంది. అక్కడ తుడవలేదు .. ఇక్కడ కడగలేదు అంటే, కష్టం. అసలే ఓపిక లేనిదాన్ని. అందుకే అది వద్దనుకున్నా"

చెబుతుంటే వింటున్నాను.

"అందుకే. ఏమైతే అయ్యిందని, దీనికి ఎడ్వాన్సు ఇచ్చేశాను. ఇప్పుడు మా అబ్బాయికి నా వలన .. మరో రెండున్నర వేలు అదనపు ఖర్చు" బాధ పడింది.

"ఏం ఫర్వాలేదు" అన్నాను ఒక్క పిసరు కోపంగానే.

నా కోపం ఏమిటో! ఆవిడకు తెలుసు. భార్య ఇష్టపడదన్న కారణంగా ఎప్పుడూ తల్లిని ఇంటికి పిలవడు. మొన్న 'నాలుగు' బెడ్రూంల ఫ్లాటు, కూకట్‌పల్లిలో, ఎనభై లక్షలు పెట్టి కొనుక్కుని .. తల్లిని గృహప్రవేశానికి పిలిచి, రెండో రోజుకే రిటన్ టిక్కెట్టు కూడా తీసేసుకున్నాడు. అసలు 'నాలుగో బెడ్రూం' .. 'తన' కోసమేనేమో అన్న ఆశ కూడా కలగకపోలేదు ఈవిడకు.

కొడుకు నుంచి ఆ మాట వినాలనుకుంది. అలా రాలేదు.

పెద్ద మనవరాలు ఇల్లు చూపిస్తూ చెప్పిందట "ఈ పెద్ద బెడ్రూం అమ్మానాన్నాలది, ఆ పక్కది నాది, ఆ ఎదురుది చెల్లిది. చివరిది బ్యూటీ పార్లర్ కోసం" అంటూ, ఆ గది చూపిస్తూ .. ఈ గదికి బయట మెట్ల దగ్గరికి వచ్చేలా.. ఈ డోర్ 'ఎక్స్ట్రాగా' పెట్టించింది అమ్మ. వచ్చిన వాళ్ళు, బయటి నుంచే వెళ్ళిపోయేలా' అంటూ.

కోడలు ఎన్నో ఏళ్లుగా బ్యూటీ పార్లర్ నడపడం తెలుసు. అది ఇప్పుడు ఇంట్లోనే పెట్టుకున్నారన్న మాట. తనూ, వాళ్ళ ఇంటిలో సభ్యురాలేనని, చివరి దశలో ఉన్న ముసలి నాయనమ్మ అందర్లా .. వచ్చిపోయే చుట్టం కాదనీ బంధాల్నీ, అనుబంధాల్నీ గురించీ ఎవరూ చెప్పకపోతే, 'ఆ పిల్లకి' అయినా ఎలా తెలుస్తుంది? ఉద్యోగం చేసే వయసుకి వస్తే మాత్రం.. అని అనుకుంటూ వచ్చేసింది ఆవిడ.

ఆవిడ పరిస్థితి చూసి జాలి పడడం తప్ప ఎవ్వరేం చెయ్యగలరు? అవసరానికి డబ్బు పంపించే కొడుకు 'అయినా' ఉన్నాడని సంతోషపడడం తప్ప. ■

## బతుకంటే ...

**క**ళ్ళలో శిశిరాలు రాలుతున్నప్పుడు
ఒక జీవిత నిర్వేదం
ఒక జీవిత క్రమం
పాఠాలు చెబుతుంటాయి

కన్నీళ్ళను బిగపట్టి
వసంతాల చిగుళ్ళ కోసం
మనసుతో మాటాడి
కాస్తంత ఊరట పొందటం ఒక అవసరం.

నిశ్శబ్ద ఏకాంతాన్ని
నాలో నింపుకొని
కళ్ళ నిండా చెట్ల గాలులు
పూసుకొని
ధ్యాన సాగరంలో మునిగిపోతాను

చుట్టూ ప్రపంచం నుంచీ
వేడి గాలులూ తగులుతుంటాయి.
ఏదీ పూర్తిగా చొరబడనివ్వక
లోలోపల రక్షణ కవచాల్ని
నిర్మించుకుంటాను

బతుకంటే
బతకడమంటే
నిరంతర మూల్యాంకనంలోంచి
సరిచూసుకొని
నిత్య నూతనంగా జీవించడమే!


**- గవిడి శ్రీనివాస్**

**70192 78368**

# ఆత్మ విశ్వాసమే ఈ యుగ సూత్రం



మనిషి ఆలోచనల్లో ఘర్షణ
ఒక మార్పుకు సంకేతం
తృప్తికి అసంతృప్తికి మధ్య
నలిగిపోతున్న మనిషి
గవేషణ అన్వేషణలలో
ఒక మథనం
జననానికి మరణానికి మధ్య
ప్రయాణ రణం
జీవించటం వర్తమానంలోనా?
భూతకాలంలోనా?
మీరెందుకు నిన్నలో బతుకుతున్నారు?
ఈరోజు
వారి కాళ్ళ కింద నలిగిపోతుంది
ఇప్పుడు దృశ్యం
ఒక వ్యాపార వస్తువు
ఇతరుల కోసం జీవించడం
ఒక నిగమనం
అంతరంగానికి అభివ్యక్తి శూన్యం
వారెందుకు తపన పడుతున్నారు?
గుండె కొలుములు ఆరిపోయాయా!
విత్తు పొటమరించిన నేలపై
నెత్తుటి బొట్ల వాన.
దేన్ని తగలబెడుతున్నారు?
వర్తమానాన్నా? భవిష్యత్తునా?
మెదడులో పేరుకున్న
వ్యామోహాల భ్రమణం
వ్యాపార సంస్కృతి విస్తరిస్తుంది
ఆ కొండల్లో కమ్ముకున్న
మంచులో నుండి
సన్నని రాగం వస్తుంది
ఆ పచ్చిక బయళ్ళు
శృతిబద్ధంగా తలూపుతున్నాయి
ఆ పక్షి కూతకు
సూర్యుడు పొటమరించాడు
ఆ గూడులో ఉన్న పక్షి గుడ్డు
కళ్ళు తెరిచింది
ఆ టేకు చెట్టు విశాలమైన
ఆకుపై నిలబడిన నీటి బిందువులు
ముత్యాల్లా మెరుస్తున్నాయి
ఆ తబలా వాయించే వారి వేళ్ళు
శృతిబద్ధంగా ఆడుతున్నాయి
ఆ జంతు చర్మం తీసిన వారు
దాన్ని రసాయనాలలో నాన్చి
చెక్కను కూర్చి
ఈ తబలా చేశారు
అది అన్ని శ్రుతులూ పలుకుతుంది
నిజమే! ప్రకృతి
స్నేహంగా, ప్రేమగా,
ఆత్మీయంగా ఉంది
ఆ కడలి తరంగాల్లో
ఏదో వేదన ఉంది
దాని గర్భం నిండా
ఎవరో నిప్పుల కుంపటి పెట్టారు
ఆ బెస్త స్త్రీ మెడలోని
గవ్వల మోతకు ఆ కడలి నిద్రించింది
ఆ పాలు పితుకుతున్న
యాదవ స్త్రీ కళ్ళు మెరుస్తున్నాయి
ఆ పచ్చని గడ్డి దానికి వేసింది
అది తెల్లని పాలు ఇస్తుంది
పదార్థంలోని రంగులు మారుతున్నాయి
కానీ దాని శక్తి ఒక్కటే
రెండు తాటి రెబ్బలు
కాలుకు చుట్టుకుని
ఆ తాడిచెట్టు ఎక్కుతున్నవాడు
మన నివాసానికి మూలకర్త
ఆ తాటి ముంజలు
బొటనవేలితో తీసి
మన నాలుక కొసకు అందించిన
ప్రేమ మూర్తి అతడు
ఆ మగ్గంలో కూర్చున్న ఆ పడతి
వంద బుటాలు ఒక్క చీరలో కూర్చింది
ఆ వేలికి ఎన్ని రంధ్రాలో?
ధరించిన వారి సౌందర్యం వెనుక
ఆమె శ్రమ దాగుంది
ఆ యువకుడు కలల అలల్లో
తేలి ఆడుతున్నాడు
తన ముందే పూసిన
గులాబీ తోటను
చూడటం మరిచాడు
సౌందర్యం ఎక్కడో లేదు
నీ ముంగిటే ఉంది నీలోనే ఉంది
మన ముందున్న శిల్ప సౌందర్యాన్ని
చూడలేని అంధులు వీరు
చూపు అంటే
బాహ్యాన్ని చూడడం కాదు
అంతరంగాన్ని చూడడం
ఆ యువతి తన ప్రియుడి కోసం
ఆకాశం దాకా నడిచింది
నక్షత్ర మండలం ఆమెకు
పాద సేవ చేసింది
ప్రేమమూర్తులు ఆకాశ పక్షులు
త్యాగం లేని మనుషులు
చప్పని చెరుకు గడ లాంటివాళ్ళు
మన ముందే జీవిస్తారు
మనకేం కలిగించలేరు
మనతో ఉంటారు మనల్ని వెలిగించలేరు
చలనం లేని నిశ్శబ్దులు వీరు
అందుకే ఈ యుగం
నదీ ప్రవాహ ప్రజ్వలిత యుగం
ఆకాశం నదిపై నిద్రిస్తుంది
నది ఆకాశపు
అంచుల్ని తాకుతుంది
రెండూ పరస్పర సంబంధితాలు
ఆచారాలను ధ్వంసం చేస్తున్న
ప్రతి అడుగూ
ఒక మలుపుకు సంకేతం
హృదయ క్షేత్రం ఓ పాలపుంత
అనేక భావాల సమ్మిశ్రిత సమాహారం అది
వెలుగుకి ఎంత ప్రతిష్ట ఉందో
చీకటికి అంతకంటే ప్రతిభ ఉంది
మాకు చీకటే వెండితెర
దృశ్య దృశ్య జీవన వ్యవస్థలన్నీ
అందులో ప్రదర్శింపబడుతుంటాయి
మీది విరాగం మాది రాగం
మీది విధ్వంసం మాది సృజనం
మీది స్తబ్దత మాది కదలిక
ఎన్నో పడవలు నదీ తరంగాలపై
పొద్దుపొడుపులో పయనమవుతున్నాయి
ఎన్నో అలలు దాటి
ఒడ్డుకు చేరతాయి
నిజమే!
ఆత్మ విశ్వాసమే ఈ యుగ సూత్రం! ■






# సముద్ర జలాల మీద పోరాట యోధుడి సంతకం

- డాక్టర్ కె.జి.వేణు
98480 70084

**సు**ప్రసిద్ధ ఆంగ్ల రచయిత ఎర్నెస్ట్ హెమింగ్వే 1951లో రాయగా, 1952లో ప్రచురితమై, 1953లో పులిట్జర్‌బహుమతిని, 1954లో నోబుల్ బహుమతిని సొంతం చేసుకున్న 'ది ఓల్డ్ మేన్ అండ్ ది సీ' నవల, ప్రపంచంలోని అనేక భాషల్లోకి అనువాదమై, కాలంతోపాటు నిలిచిన ఉత్తమ నవలల సరసన తన స్థానాన్ని పదిలం చేసుకుంది. ఈ నవలలో 'శాంటియాగో' పేరుగల ముసలోడు 84 రోజులు చేపల వేటకు వెళ్లినా రోజూ ఖాళీ చేతులతోనే తిరిగి వచ్చేవాడు. 85వ రోజున మళ్లీ చేపల వేటకు వెళ్లాడు. సముద్రంలోనే మూడు రోజులు రాత్రింబగళ్లు గడిపి, చివరకు 18 అడుగుల భారీకాయం కలిగిన చేపను పట్టి, దాన్ని ఒడ్డుకు తీసుకురావటానికి అతడు చేసిన పోరాటాన్ని టన్నుల కొద్దీ కాగితాలనిండా విశ్లేషకులు, విమర్శకులు, సాహితీవేత్తలు తమ ప్రశంసలను అన్ని భాషల్లోనూ గ్రంథస్థం చేశారు. కాని అసలు పోరాటం జరిపిన నన్ను అనగా ముసలాడు పట్టిన భారీ చేపను మాత్రం అందరూ మరచిపోయారు. 'ఓ నా సాహితీవేత్త లారా! ప్రపంచంలో ఎందరో చేసిన పోరాటాల కంటే భయంకర మైన పోరాటాన్ని నేను చేశాను. మరి నా గురించి మీరెందుకు మాట్లాడుకోవటం లేదు. నా పోరాటాన్ని ఎందుకు ప్రశంసించటం లేదు. నా చావు పట్ల మీరెవరూ కన్నీళ్లు కార్చనక్కరలేదు, నా పోరాటాన్ని ఒక్కసారి గుర్తించండి చాలు. నవలలో కనిపించని, వినిపించని, రచయిత కలం నుంచి వెలువడని అంతర్లీన విశేషా లను తెలుసుకోవాలనుకొనే ఆసక్తి మీకుంటే ఒక్కసారి మీరంతా నాతో కలిసి సముద్రమనే మా సామ్రాజ్యంలోకి నాతో పాటు అడుగులు వేయండి.

ఆ మహాసముద్రమే మా సామ్రాజ్యం. నేను ఇక్కడే పుట్టాను, ఇక్కడే పెరిగాను. ఎన్నో పోరాటాల్లో విజయం సాధించి నా వీరత్వానికి మా సమూహం చేత సంబరాలు చేయించుకున్నాను. పసితనం నుంచే పోరాటాలంటే మక్కువ పెంచుకున్నాను. చిన్నప్పుడు పెద్దలు చెప్పినా వినకుండా సముద్రపు లోతుల్లోకి వెళ్లి వింత వింత ప్రాణుల్ని సరదాగా తాకి, వాటిని రెచ్చకొట్టి, నా వెంటబడితే దొరక్కుండా తప్పించుకున్న సరదాలు నాకు చాలా సంతోషానిచ్చేవి. వాటిని కథలుగా నా సమూహానికి వివరించినప్పుడు, మెచ్చుకుంటూ అందరూ నా చుట్టూ చేరి ఈతలోని అన్ని విద్యలు ప్రదర్శించేవారు. నా పెంపకం మా సమూహంలో చాలా ప్రత్యేకంగా జరిగింది. వయసు పెరుగు తున్న కొద్దీ నా శరీరం చాలా బలిష్టంగా, పొడవుగా తయారైంది. దాంతో పాటు నాకు ధైర్య సాహసాలు కూడా పెరిగాయి. నా బలం నా సమూహాన్ని రక్షించుకోవటానికి చాలా సందర్భాల్లో ఉపయోగపడింది. ఓ మారు షార్క్ చేపలు మా మీదికి దాడి చేశాయి. మాలో సగంమంది వాటికి ఆహారమై పోవటం ఖాయమనుకున్నారు. భయంతో వణికిపోయారు. ఆ క్షణంలో ఒంటరి గానే పోరాటానికి సిద్ధపడ్డాను. నేను బలంగా, వేగంగా రెప్ప పాటులో కదిలించి, విదిలించిన నాతోక ధాటికి వచ్చిన షార్క్ చేపలకు ఊపిరి ఆగిపోయింది. చాలా వాటికి ఎముకలు విరిగిపోయాయి. దొరికిన వాటినల్లా నా పళ్లతో కొరికి చంపేశాను. వెంటపడి, వెంట పడి వాటి భరతం పట్టాను. చివరికి వాటిని కనిపించనంత దూరం తరిమికొట్టాను. నా సమూహ మిత్రులు ఊపిరి పీల్చుకున్నారు. నా విజయానికి వేడుకలు చేశారు. ఆ రోజే నా సమూహ సామ్రాజ్యానికి నన్ను రక్షణ కవచంగా ప్రకటించుకున్నారు. ఆ రోజునుంచి వాళ్ల రక్షణే నా బాధ్యతగా మారిపోయింది. క్రమ క్రమంగా మా నివాస ప్రాంతం కొన్ని మైళ్ల దూరం విస్తరించుకోవటానికి కూడా సాయపడ్డాను.

ఇంతటి చరిత్ర ఉన్న నేను ముసలోడి గాలానికి ఎలా చిక్కానో అర్థం కావటంలేదు. గతంలో ఇలాంటి గాలాలు చాలా చూశాను. దేని మాయలోనూ పడలేదు. అప్రమత్తత ఎప్పుడూ నాతోనే వుండేది. తెల్లారటానికి రెండు గంటలముందు ఒక్కడిని నీటిలోపల విన్యాసాలు చేసుకుంటూ ఈత కసరత్తులు చేసు కోవటం నా దినచర్యల్లో ఒకభాగం. అంతా అయ్యాక

చీకటుండగానే నీటి పైభాగాన వెల్లకిలా పడుకోవటం నాకిష్టం. మసక చీకట్లో వీస్తున్న చల్లటిగాలి, ఏదో మత్తును వొంటికందించి వెళ్తున్నట్లుగా వుంటుంది. అ అనుభవం కోసమే రోజూ నేను నీటి పైపొరలమీదికి నా శరీరాన్ని చేరవేసుకుంటూ వుంటాను. ఎంతో భారీగావున్న నా దేహం ఆ సుఖంలో గరికమాదిరి తేలిపోతూ వుంటుంది. ఆ రోజూ అన్నీ అలాగే జరిగాయి. ఆ తరువాతే నేను వూహించనిది జరిగింది. ఆ ముసలాడి గాలానికి దొరికిపోయాను. ఒక్కసారిగా నా తప్పిదం తెచ్చిన ప్రమాదాన్ని గుర్తించాను. అయినాసరే అధైర్యపడలేదు. ఎన్నో సాహసాలు నేర్పిన నా ధైర్యమే నా బలమయింది. చింతించటం మానేసి పోరాటానికి సిద్ధపడ్డాను.

నా నోట్లోకి బలంగా దూరిపోయిన గాలం కొక్కిని విడిపించు కోవటానికి విశ్వప్రయత్నం చేశాను. దానిని గట్టిగా ఒక్కలాగు లాగాను. అంతే పడవ మొత్తం కదిలిపోయింది. జాడించిన నా తోక ధాటికి చుట్టూవున్న నీరంతా అల్లకల్లోలమయింది. అలల మీద పడవ అదుపు తప్పేలా కనిపించింది. దాన్ని లాక్కుంటూ ముందుకెళ్లిపోతున్నాను. జారిపోతున్న తీగల్ని జాగ్రత్తపడి గట్టిగా కదుతున్నాడు ముసలోడు. ఇంతలో సూర్యోదయమయింది. రోజూ ఆ వెలుగుల్ని చూడటం నాకు చాలా ఇష్టం. చావు పోరాటంలో సైతం నా కోరికను చంపుకోలేకపోయాను. మెల్లగా తేలుతూ పైకొచ్చాను. లేతభానుడి కిరణాలతో సముద్రం ఒంటిమీద ముత్యాల రాసుల జాతర మొదలయింది. నీటిలోపల చీకట్లు సైతం మెల్లమెల్లగా పారిపోతున్నాయ్. ఉదయం ఆకాశాన్ని చూస్తూ మేఘాలతో కబుర్లు చెప్పటం రోజూ నేను తీర్చుకొనే కోరికల్లో ఒకటి. మొదటిసారి ఆ కోరిక తీరకుండానే కాలం దాటిపోయింది.

తీగను మరింత పైకిలాగి కట్టాడు ముసలోడు. నా బరువెంతో తెలిసిపోయినట్లుంది. మరింత జాగ్రత్త పడ్డాడు. ఇంతలో ఒక పక్షి వచ్చి పడవ మీద వాలింది. దానిముక్కు నాకు చాలా పరిచయం. చాలాసార్లు నా సమూహంలోని చేపల్ని తినటానికి వచ్చేది. నా తోకతో దాన్ని విసిరికొట్టేసరికి దానిముక్కు విరిగి పోయి బతుకు దేవుడా అనుకుంటూ ఎగిరి పోయింది. ఇప్పుడు అది నన్ను గమనించే వచ్చింది. ఎగతాళిగా అరిచింది. ఆనందం తో రెక్కలు ఆడించింది. సంతోషం పట్టలేక కాళ్లతో నాట్యం చేసింది. ఇదంతా ముసలోడికి అర్థంకాక దాన్ని తరిమికొట్టాడు. అది ఎగురుతూ అరచిన అరుపులకు అర్థమేమిటో నాకు తెలుసు. నిస్సహాయంగా దానివైపే చాలాసేపు చూశాను. నేను నిశ్శబ్దంగా వుండిపోవటం చూసి అలసిపోయాననుకున్నాడు ముసలోడు. అది అలసట కాదు. ఎలాగైనా ఈ ప్రమాదంనుంచి బయటపడాలన్న ఆలోచన. నా దవడలు గాయమై రక్తం ధారగా కారుతోంది. నా మెదడు మాత్రం చురుగ్గానే పనిచేస్తోంది. తప్పించుకొనేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాను. అవకాశాన్ని బట్టి తోకను బలంగా జాడిస్తున్నాను. ఆ దెబ్బకు ముసలాడు చాలాసార్లు పడవలో పడిపోయాడు. నా తెలివికి తేరుకోలేక పోయాడు.

నేను మెల్లగా పైకి తేలడం చూసి ఆనందం పట్టలేక పోయా డు. నేను పైకి లేచినప్పుడల్లా నా మీదినుంచి రెండు పక్కలకు నీళ్లు జలపాతాల్లా జారుతున్నాయి. పొడవైన నా ముక్కును చూసి ఆశ్చర్యపోయాడు. కత్తిలా కదలాడే నా తోకను చూసి మాటరాక నిలబడిపోయాడు. ఉన్నట్టుండి మళ్లీ నీళ్లల్లోకి మునిగి తోకతో పడవను కసికొద్ది బలంగా కొట్టాను. అది గిర, గిరా తిరిగింది. దాంతోపాటు నేనూ తిరిగాను. విశ్వ ప్రయత్నాలు చేసినా గాలం కొక్కినుంచి వేరుపడలేక పోయాను. గాలానికి కట్టిన వైర్లను కొరికి తప్పించుకోవాలనుకున్నాను. అది సాధ్యం కాలేదు. ఆగని నా పోరాటాన్ని చూసి కోపం పట్టలేక నన్ను ఎలాగైనా చంపాలనే నిర్ణయానికి వచ్చాడు. అప్పుడు ఇద్దరి మధ్య దాదాపు ఒక భయం కర యుద్ధమే జరిగింది. కాని ఇది న్యాయమైన, ధర్మమైన యుద్ధం మాత్రం కాదు. ఈ యుద్ధంలో ఒక మోసం నన్ను బందీగా మార్చింది. నిరాయుధ స్థితిలో యుద్ధం చేయాల్సి వచ్చింది. నన్ను స్వేచ్ఛగా వదిలితే, నా విజయాన్ని ప్రతి నీటిబిందువు ఒక చరిత్రగా రాసేది. నేను గాలిలోకి ఎగిరి తిరగబడితే ఇలాంటి పడవలు వంద అయినా నామరూపాలు లేకుండా పోయేవి. రెక్కలు విరిచి ఎగరమంటే ఏ పక్షికి సాధ్యం. పాదాలకు మేకులు బిగించి పరిగెత్తమంటే చిరుతకైనా సరే అది సాధ్యం కాదు. చేతులు నరికేసి విలుకాడిని బాణం సంధించమంటే అది న్యాయం ఎలా అవుతుంది. నా పరిస్థితి ఇప్పుడు అలాగే వుంది. అయినాసరే పోరాటానికే సిద్ధపడ్డాను నేను. నాకు భయం లేదు, భీతి లేదు, చస్తానన్న దిగులు అంతకన్నా లేదు. నాకు తెలిసింది పోరాటం మాత్రమే. ధీరుడు ప్రాణం గురించి ఆలోచించడు, పోరాటం గురించి మాత్రమే ఆలోచిస్తాడు. కొనవూపిరిలో సైతం విజయాన్ని అందుకోవటానికే శక్తిని కూడదీసుకుంటాడు. ఆ వీరుల వరుసల్లో నిలబడ్డ వీరత్వం నాది. ఈ యుద్ధానికి మానసికంగా నన్ను నేను తయారుచేసుకున్నాను. మెల్ల మెల్లగా నీటిలోపలికి వెళ్లాను. ఒక్కసారిగా నీటి పైకొచ్చి పడవమీద మరోమారు గట్టిదెబ్బ కొట్టాను.

నేను కొట్టిన దెబ్బకు పడవ తల్లకిందులైనట్లయింది. కాని వెంటనే సర్దుకుంది. పడవను నాశనం చేయటం నా ఉద్దేశం కాదు. నేను ఈ గాలం కొక్కినుంచి తప్పించుకోవాలి. ఎలా? ఎలా? దాదాపు ఒక రోజంతా ఏకధాటిగా కొక్కీని కొరుకుతూ ఈ దురదృష్టంనుంచి బయటపడటానికి గిల గిలా నీటిలో కొట్ట కున్నాను. నా ధాటికి నీరంతా ప్రళయం వచ్చినట్లు సుడులు, సుడులుగా తిరిగింది. శక్తినంతా కూడదీసుకొని దాడి చేస్తూనే వచ్చాను. ఎంత శ్రమపడ్డా ఫలితం మాత్రం శూన్య హస్తాలతో ఎదురొచ్చింది. చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవుతూవుంటే నామీద నాకే పిచ్చి కోపం ఉప్పెనలా తన్నుకొచ్చింది. మొదటిసారి నా కళ్లల్లో తడిని చూశాను, నా వొంటిమీద మొప్పలు మూలగటం విన్నాను. సముద్రం మీద ఆ రోజుకు వెలుగు దిగిపోతూ చీకటికి ఆహ్వానం పలుకుతోంది. ఇప్పుడు చుట్టూ గాఢాంధకారం. క్రమ

క్రమంగా నాలోనూ శక్తి పూర్తిగా నశించిపోయింది. నా తోక నాకే భారంగా మారిపోయింది. మునుపటిలా ఎటూ కదిలలేక పోయాను. కొక్కి మూలంగా దవడలకు భయంకరమైన గాయమైంది, దాని మూలంగా భరించలేని నొప్పి నా ప్రాణం మీద శత్రువులా దాడి చేయటం ప్రారంభించింది. నాలోని నరాలన్నీ ముక్కలు, ముక్కలుగా తెగిపోయి సెలవు తీసుకోవటానికి సిద్ధపడ్డాయి. కళ్లు శాశ్వత నిద్ర కోసం దారులు వెతుక్కోవటం ప్రారంభించాయి. పోరాడి గెలవాలన్న పౌరుషం ఇంకా నాలో బతికేవున్నా, నిస్సత్తువ మాత్రం నన్ను అచేతనంగా నీటిమీద తేలేలా చేసింది. ఓడిపోవడమంటే ఇదేనేమో. తలవంచటం ఇన్నాళ్లు నా తలరాతలో లేదనుకున్నాను. తల్లకిందులైపోయిన ఈ జీవిత ఆఖరి అధ్యాయంలో ఆయువు చివరి క్షణాలు కాలం హాజరుపట్టీలో సంతకాలు పెట్టటానికి ఉత్సాహంగా నిలబడ్డాయ్.

ముసలోడు నాకోసం వెతుకుతున్నాడు. అలలధాటికి నేను పడవకు దగ్గరగా వచ్చాను. అతడు సంతోషించాడు. చివరిసారి శక్తినంతా కూడదీసుకొని తోకతో పడవను బోల్తా కొట్టించా లనుకున్నాను. కాని నాలో జీవం పూర్తిగా కరువైపోయింది. తోకను అంగుళం కూడా కదలించలేక పోయాను. నిరాశ జోరుగా జోల పాటలు పాడటం మొదలుపెట్టింది. కళ్లు మూతలుపడుతున్నాయి. నీటిమీద తేలిపోతున్నాను. ప్రతిఘటన నాకు చాలా ఇష్టమైన పదం. చివరకు ఇష్టాలన్నీ మిగలకుండా పోయాయి, అయిష్టమైన మరణం మాత్రం నక్కలా నా పక్కనే కాచుకొని వుంది. సరిగ్గా ఈ అవకాశం కోసమే ముసలాడు కాచుకొని ఉన్నాడు. ఇప్పుడు నన్ను అతి దగ్గరగా చూస్తున్నాడు. నా భారీ శరీరాన్ని చూశాక ఆశ్చర్యం, ఆనందం రెండింటి మధ్య ఉక్కిరిబిక్కిరై నలిగి పోయాడు అతని చూపుల్లో నన్ను చంపాలనే తీవ్రమైన తపన, లావాలా అతడి కళ్లనుండి నా మీదికి ప్రవహించింది. అంతే మెరుపులా తన చేతిలోని బరిసెను నా ముక్కు దూలంలోనుంచి మొప్పగుండా బయటికి లాగి దాన్ని ఒక తాడుతో పడవకు కట్టాడు. మిగిలిన తాడును మధ్యకు కోసి దాంతో నా తోకను చుట్టి దాన్ని పడవ వెనక భాగానికి కట్టాడు. ఇక నేను ముసలాడినుండి తప్పించు కోలేనని తెలిసి పోయింది.

మరణ ముఖద్వారం మెల్ల మెల్లగా తెరుచుకుంటోంది. ఒక్కసారిగా నా నాయకత్వానికి జేజేలు పలికిన మా సమూహం నా కళ్లముందు కదలాడింది. చాలా కాలంగా ఎన్నో ప్రమాదాల నుంచి వాళ్లను కాపాడుకుంటూ వచ్చాను. విహారానికి సముద్రపు లోతుల్లోకి వెళ్లినప్పుడు మా సమూహంలోని బుజ్జి బుజ్జి చేపలు ఏ భయంలేకుండా నా పొట్టకింద ఈదుకుంటూ ఆడుకునేవి. వేటకు వెళ్లిన ప్రతిసారి ఎదురైన యుద్ధంలో మా వైపునుండి ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా శత్రుసమూహాలను తరిమికొట్టే బాధ్యత ఏనాడూ విఫలం కాలేదు. ఎక్కడ ఏ ఆహార సంపద దొరికినా మొదట నా సమూహానికే వడ్డించే అలవాటు నాది. మా మధ్య ఆటలు, పాటలు నిత్యం సాగుతూ వుండేవి. లెక్కలేనన్ని సరదాలు, సంబరాలు మా సంతోషాలకు తోరణాలుగా నిలిచేవి. అన్నిటికీ నాయకత్వం నాదే. రోజూ చీకట్లో విహారానికి వెళ్లి సూర్యోదయం వేళకు తిరిగి మా స్థావరానికి రాగానే. మా అందరి దినచర్య ప్రారంభమయ్యేది. మరి ఇప్పుడు నేను లేని రాజ్యంలో నా సమూహం ఉనికి, సముద్రగర్భంలో నామరూపాలు లేకుండా పోతుంది. నా రాకకోసం ఎదురుచూసిన నా సమూహం రోదన తలుచుకుంటే నాకు దుఃఖం ఆగటం లేదు. మా శత్రువుల దాడి ఇప్పటికే ప్రారంభమై వుంటుంది. సమూహ వినాశనానికి నేనే కారణమయ్యాను. నేను బాధపడుతున్నది చావుకోరల్లోకి వెళు తున్నానని కాదు, నా వేదన నా సమూహం గురించి, నా వేదన నన్ను పెంచి, పెద్దచేసి, ఎంతో ప్రేమను అందించిన ఈ తల్లి సముద్రం గురించి, ఈ తల్లి గర్భంలో రుతువులు ఏవైనా మాకు అన్నీ పండగ దినాలే. వర్షం కురిస్తే చాలు; ఇంద్రధనుస్సులు మాకు కిరీటాలవుతాయి. తుపాను వచ్చిందంటే మా ఉత్సాహాలకు పతాకాలు లేస్తాయి. ఉప్పెన వస్తే చాలు ఆకాశం తాకే అలలు మాకు ఉయ్యాలలై ఊగుతాయి. మా ఆనందం పైనున్న ఆకాశాన్ని తాకేది. ఈ అపురూపమైన సంతోషాన్ని శాశ్వతంగా నా ఖాతాలో దాసుకోవాలనుకున్నాను. నా తల్లి సముద్రం ఎదమీద ఆడుకొనే రోజులు తరగని సంపదగా నాకు కానుకలవుతాయను కున్నాను. పుట్టుకతోనే సాధించుకున్న నా స్వర్గం ఒక్క 'ఎర' కారణంగా ఎడారిగా మారుతుందని వూహించలేక పోయాను. చివరకు ఇలా దీనావస్థలో దు:ఖిస్తూ, దగ్ధమైన నా జీవితాన్ని కన్నీటి పొరల్తో కప్పేసుకుంటూ, నా సముద్రం తల్లికి ఆఖరిసారిగా సాష్టాంగపడుతూ, శాశ్వితంగా నా కళ్లకు విశ్రాంతినిచ్చాను.

జరిగింది యుద్ధమే. కాని ఈ యుద్ధం ఇద్దరు వీరుల మధ్య జరగలేదు. ఇందులో పాల్గొన్న వీరత్వం నాది మాత్రమే! కాని మోసం విజయాన్ని తన్నుకు పోయింది. అపజయానికి నా దగ్గరికి వచ్చే అర్హత లేదని నిర్ధారణ చేసుకొని సిగ్గుతో పారిపోయింది. అందుకే నా పోరాటాన్ని గుర్తింమని ప్రపంచ సాహితీవేత్తలందరి వేడుకుంటున్నాను. మీ చరిత్ర యుద్ధాల్లో మరణించి మీచేత కీర్తించబడుతున్న వీరుల సరసన నాకూ ఒక గౌరవ స్థానాన్ని ఏర్పాటు చేయండి. సభలు, సమావేశాల్లో 'ది ఓల్డ్ మేన్ అండ్ ది సీ' నవల గురించి చేసే ఉపన్యాసాల్లో ముసలోడూ, సముద్రం గురించి మాత్రమే కాదు; వీరత్వాన్ని ప్రదర్శించిన నా పోరాటాన్ని గురించి కూడా మనసు విప్పి మాట్లాడండి, సాహితీచర్చల వేదికలమీద నా పాత్రకు గౌరవప్రదమైన ప్రవేశం కల్పించండి. ప్రపంచంలో పుట్టిన ప్రతి ప్రాణికి అనుభవాలు, ఆలోచనలు, బాధలు, ఏడుపులు, సంతోషాలు సమస్తం వుంటాయి. వాటికి అక్షర రూపం రావటమే చాలా అరుదుగా జరుగుతూ ఉంటుంది. ఇలాంటి అవకాశం నన్ను వరించటం నా వీరత్వానికి అక్షరాలన్నీ వరుసగా నిలబడి హారతులు పట్టినట్లుగా వుంది. ఇకనుంచి ప్రతి సూర్యోదయంలో నన్ను పలకరించే పాఠకుల కోసం వెతుకుతూ వుంటాను. ■



# ఉద్యమాల సాపేక్షతతో స్త్రీ వాద అవగాహనను సరిచేసుకుంటూ ఉండాలి

**ప్రముఖ సాహితీ విశ్లేషకులు ఆచార్య కాత్యాయని విద్మహే**

**'ధనిక, పేద, కులమత, స్త్రీపురుష వ్యత్యాసాలతో సంక్లిష్టంగా ఉండే భారతీయ సమాజాన్ని అర్థం చేసుకొనటానికి సోషలిస్టు స్త్రీవాదం కొంచం ఎక్కువ ప్రయోజనకారి అనుకొంటున్నా'నన్నారు ఆచార్య కాత్యాయని విద్మహే. కవి, రచయిత డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య 'సాహిత్య ప్రస్థానం' తరపున ఆచార్య కాత్యాయని విద్మహే గారితో ముచ్చటించారు. ఆ ముఖాముఖి ఇదీ..**

**మీ బాల్యం విద్యాభ్యాసం గురించి క్లుప్తంగా చెప్పండి ?**

నేను 1955 నవంబర్ 3న, మా అమ్మమ్మగారి వూరు మైలవరంలో పుట్టాను. మా అమ్మ ఇందిరాదేవి. నాన్న కేతవరపు రామకోటి శాస్త్రి. నాన్న ఉద్యోగరీత్యా గుడివాడలోనూ, ఉస్మానియా యూనివర్సిటీలో పరిశోధన కోసం హైదరాబాద్ వెళ్లటంతో, మైలవరంలోనూ నా బాల్యం గడిచింది. పిహెచ్.డి పూర్తయి నాన్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అధ్యాపకుడిగా వరంగల్ రావటంతో నా చదువు అక్కడ మొదలైంది. నాన్న బదిలీల వల్ల హైదరాబాద్‌లో కొంతకాలం చుదువుకొన్నాను. 9వ తరగతికి మళ్ళీ వరంగల్‌కే వచ్చాం. అప్పటినుండి చదువు, ఉద్యోగం, నివాసం అన్నీ వరంగల్లే. తెలుగు ఎంఏ చేసి 'చివరకు మిగిలేది' నవలపై పరిశోధన చేసాను. 1977 నుంచి కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగువిభాగంలో అధ్యాకురాలిగా పనిచేసి 2015లో పదవీ విరమణ చేసాను.

**మీ పేరులోని 'విద్మహే' అనే పదం వినూత్నంగా ఉంది. కలంపేరా? అసలు పేరా?**

అమ్మ నాన్నలు పెట్టిన పేరు కాత్యాయని. విద్మహే కలంపేరు. ఎంఏ పూర్తయ్యేనాటికి సాహిత్య వ్యాసాలు రాయటం మొదలు పెట్టాను. కలం పేరుగా అసలు పేరుకు విద్మహే అని చేరిస్తే అర్థవంతంగా ఉంటుందని సూచించింది నాన్నే. విద్ అనే మూలం నుండి ఏర్పడిన విద్మహే అనే మాటకు తెలుసుకొనటం అని స్థూలార్థం. జ్ఞాన మూలం తెలుసుకోవాలన్న జిజ్ఞాస కనుక ఆ మార్గంలో సాహిత్య ప్రస్థానం సాగించాలన్న ఆకాంక్షకు వ్యక్తీకరణ విద్మహే అనే ఆ పేరు.

**మీ సాహిత్యాభిలాష వారసత్వంగా వచ్చిందా? పెద్దయ్యాక తెలుగు చదవాలనే అనుకున్నారా?**

సాహిత్యాభిలాష వారసత్వంగా వచ్చిందా అంటే అవునని ఖచ్చితంగా చెప్పలేను కానీ, సాహిత్యభిలాష ఏర్పడటానికి అనువైన వాతావరణంలో పెరిగానని చెప్పగలను. నాలుగైదు తరగతులు చదువుతుండగా మా బామ్మ సావిత్రమ్మ పర్వాల వారీగా వివరంగా చెప్పిన మహాభారత కథ వల్ల సంప్రదాయ సాహిత్యం పట్ల కుతూహలం కుదురుకొన్నది. ఇంట్లో మా అమ్మ చదివే వార, మాస పత్రికలు, నవలలు ఆరేడు తరగతులనుండే చదువు కొంటూ, ఆధునిక వచన సాహిత్యం పట్ల అభిమానం పెంచు కున్నాను. అదే బి.ఎ.లో పొలిటికల్ సైన్స్, చరిత్రతో కలిపి తెలుగు సాహిత్యం చదవటానికి ప్రధాన ప్రేరణ అయింది. బి.ఎ. లో తెలుగుసాహిత్యం పేపర్లో వచ్చిన మార్కులకు ఉస్మానియా యూనివర్సిటీ వారిచ్చే హెచ్ఇహెచ్ నిజామ్స్ గోల్డ్ మెడల్ వచ్చింది. తెలుగు ఎంఏలో చేరటానికి దానితోపాటు మానాన్న ఆలోచన కూడా కారణమైంది. ఆయనతో పాటు ఎంఏలో కోవెల సుప్రసన్నాచార్యులు గారు, మాదిరాజు రంగారావు గారు, జి.వి.సుబ్రహ్మణ్యం గారు పాఠాలు చెప్పిన తీరు సాహిత్యపు లోతులు తెలుసుకొనటం పట్ల ఉత్సాహాన్నీ, పరిశోధన, విమర్శ రంగాల పట్ల ఆసక్తిని కలిగించాయి.

**మీ తొలి రచన వివరాలు చెప్పండి ?**

తొలి రచన అంటే... 1969లో తెలంగాణ ఉద్యమ కాలంలో బడులు బంద్ అయి, ఇంటిదగ్గరే ఉన్న సమయంలో మా వీధి పిల్లలం అందరం కలిసి బాలానందసంఘం పెట్టుకొని, దాని పక్షాన తీసిన లిఖిత పత్రిక మనోవాణి కోసం రాసిన కవిత్వం. అచ్చయిన తొలి రచన కథ. 1972లో తెలుగు విద్యార్థి పత్రికలో

వచ్చిన దేశం కోసం.

**తొలినుంచీ స్త్రీవాద సాహిత్యం తాలూకు భావాలు మీలో బలంగా ఉండేవా?**

స్త్రీవాద భావాలు మా తరానికి అందివచ్చింది 1975 తరువాత. 1982లో వరంగల్లులో మేము స్త్రీజనాభ్యుదయ అధ్యయనసంస్థ ఏర్పాటు చేసుకున్నాక, అధ్యయనం పెరిగింది. అవగాహన బలపడింది. అయితే, అమ్మగన్న సంతానం ముగ్గురం ఆడపిల్లలమే కావటంవల్ల కావచ్చు. ఇంట్లోలేదు కానీ మా స్నేహితులు, బంధువుల ఇళ్లల్లోని ఆడామగా వివక్ష అర్థం అవుతూనే ఉండేది. అభ్యాసకాలపు కవిత్వంలో ఆ అవగాహన మొగ్గదశలో ఉంది. అప్పుడు 'ఈనాటి వ్యవస్థలో పిల్లలు/ సంసారం వ్యాపారపు లాభనష్టాలు/ మగ – మంచి పెట్టుబడి / ఆడ – గుండెలమీద కుంపటి'(పిల్లలు – పువ్వులు ) అని రాసాను.

**కొండేపూడి నిర్మల 'లేబర్రూం' కవిత గానీ, విరసం విమల 'వంటిల్లు' కవితగానీ, స్త్రీకి సహజంగాను, ప్రకృతి, సృష్టిపరంగాను, జరిగే శారీరక ప్రక్రియలను కొండంతలు చేసి వర్ణించారని కొన్ని వ్యాసాల్లో చదివాను. మీ అభిప్రాయం?**

స్త్రీకి సహజంగా, సృష్టిపరంగా జరిగే శారీరక ప్రక్రియలను గోరంతలు కొండంతలు చేశారన్నది కదా ఆక్షేపణ! నిజానికి అప్పట్లో అలాంటి ఆక్షేపణకు గురయింది లేబర్ రూమ్ కవిత ఒకటే. ఆడవాళ్లను వంటింటికి పర్యాయపదంగా చేసిన సంస్కృతిలో బండారాన్ని బయటపెట్టి వంటింటిని రాకాసి గద్దగా రూపకం చేసి ఒంటరి వంటిళ్లను కూల్చేయాలన్న విమల పిలుపును అందరూ ఆమోదించి హర్షించారని చెప్పలేను కానీ, అంతగా దానిమీద ఎవరూ విరుచుకుపడలేదు. ప్రసవం స్త్రీకి సృష్టి సహజం సరే. అందులో ఎంత బాధవుందో, అదెలా పునర్జన్మో తెలిసి ఆమె పట్ల గౌరవాదరాలు చూపే సంస్కారం ఈ సమాజంలో ఎంతవుంది? నేను నాలుగో తరగతో అయిదో తరగతో చదువుతున్నప్పుడు మా ఇంటిదగ్గరే వున్న స్నేహితురాలి ఇంట్లో తండ్రి అధికారానికి, అరుపులకు జడుస్తూ ఆమె తల్లి పదకొండవరోజు పురిటిస్నానం చేస్తూనే వంటకు దిగిన దృశ్యం నాకిప్పటికీ గుర్తే! అది నా మనసును ఇప్పటికీ మెలిపెడుతూనే ఉంటుంది. అలాంటి సందర్భాల్లో ఏ ఆడదైనా మాతృగర్వంతో పొంగిపోతుందా? లేక ఏమి కడుపులు, ఏమి పురుళ్ళు అని రోతపడుతుందా చెప్పండి? అలాంటి స్త్రీల ఆక్రోశం లేబర్ రూమ్ కవిత. మన కావ్యాలన్నీ పుత్రోదయ వర్ణనతో ముగుస్తాయి. పుత్రోదయ సమయంలో స్త్రీల శరీరం ఎంత హింసకు, యాతనకు గురవుతుందో వాళ్లకు పట్టలేదు. నిర్మల ఆవైపు చూడమంది. అంత యాతనపడి మానవవనరులను ఉత్పత్తి చేసే స్త్రీల పట్ల ఈ సమాజం ఎంత సున్నితంగా, బాధ్యతగా ఉండాలో చూడమంటుంది. స్త్రీలు పిల్లలను కనటం సృష్టి సహజం అనుకుందాం కాసేపు. వంట చేయటం కూడా సృష్టి సహజమా? మగవాళ్ళు కూడా చేయగల పనే కదా! అయినా వంటిళ్ళు కేరాఫ్ ఆడవాళ్లు గానే ఎందుకు ఉన్నాయి? అని ఎప్పుడైనా ప్రశ్నించుకున్నామా?

**స్త్రీవాదంమీద 'కవిత్వం' ఎక్కువ ప్రభావాన్ని కలిగించిందా? లేక 'కథాసాహిత్యం' ఎక్కువ ప్రభావాన్ని కలిగించిందా?**

స్త్రీవాద భావజాల ప్రసారానికి ప్రారంభంలో కవిత్వమే వాహిక అయింది. భావోద్వేగాలను పదునుగా వ్యక్తీకరించగలిగేది కవిత్వం. ఆవేశం దాని జీవశక్తి. అందువల్ల అది సాధ్యమైంది. స్త్రీవాద భావజాల విస్తృతి తెలిసే కొద్దీ ఆలోచన పెరిగే కొద్దీ కథ ఆస్థానాన్ని ఆక్రమించింది. నిజానికి ఇప్పుడు స్త్రీవాద సిద్ధాంత అవగాహన తెలుగు కథ వస్తు పరిధిని విశాలం చేసింది.

**స్త్రీవాద కవిత్వంలో అశ్లీల పదాలు ఉపయోగించడం సమర్ధనీయమా?**

అశ్లీలం అనేది పదంలో ఉండదు. ఉద్దేశాన్ని, ఉచ్చారణను, సందర్భాన్నిబట్టి అది నిర్ణయం అవుతుంది. ఈ విషయం మీద అప్పట్లో చాలా వివరణలు వచ్చాయి. స్త్రీలు తమ అనుభవకోణం నుండి శరీరాన్ని నిర్వచిస్తే, స్త్రీలుగా తమ శరీరానికి సంబంధించిన ప్రత్యేక ధర్మాలను, బహిష్టు గురించి కావొచ్చు, గర్భభారం గురించి కావొచ్చు, ప్రసవ సమయపు దశల గురించి కావొచ్చు– కవిత్వం చేస్తే అది అశ్లీలం ఎలా అవుతుంది? అసహజ రీతిలో శరీరాలను ఉద్రేకపరిచి సంభోగ వాంఛను రెచ్చగొట్టే పదాలు వాళ్ళేమీ రాయలేదే !

**స్త్రీవాదం ఉవ్వెత్తుగా ఎగసి తర్వాత చల్లారింది. ఈ వాదం ద్వారా మహిళలు సాధించిందేమిటి?**

స్త్రీవాదం అనే విషయం, తెలుగులో స్త్రీవాద సాహిత్యం రావటానికి చాలా ఏళ్లకు ముందునుండే ప్రపంచంలో ఉంది. ఇప్పటికీ ఉంది. తెలుగులో స్త్రీవాద కవిత్వం ఎనభైలలో, తొంభైలలో ఉన్నంత ఉధృతంగా లేదు కనుక చల్లారి పోయిందనుకొంటున్నారు. అది నిజం కాదు. అప్పుడు కొత్తది కనుక దిగ్భ్రాంతికరమైన కొత్త ఆలోచనలు, అభివ్యక్తులు ఉన్నందువలన కలిగిన ఉక్కిరిబిక్కిరిలో ఉన్నాం. ఈ ఇరవై ముప్ఫయి ఏళ్లలో ఆ ఆలోచనలకు, అభివ్యక్తులకు అలవాటు పడ్డాం కనుక ఇప్పుడు ఆనాటి ఉక్కిరి బిక్కిరి లేక స్త్రీవాదం లేదనుకొంటున్నాం. నిజానికి ఇప్పుడది ఒక అస్తిత్వ తాత్విక భావనగా సామాజిక సాహిత్య సంస్కారంలో కలిసిపోయింది. అదే స్త్రీవాదం ద్వారా సాధించబడిన ప్రయోజనం.

**మీరు సాహిత్య అకాడెమీ పురస్కారం వాపసు చేశారు కదా.. ఆ విషయం క్లుప్తంగా చెప్తారా?**

అవును. 'సాహిత్యాకాశంలో సగం' ఆధునిక స్త్రీల సాహిత్య అధ్యయన అవసరాన్ని, పద్ధతులను, ప్రయోజనాలను నిరూపిస్తూ రాసిన వ్యాసాలు, స్త్రీల కవిత్వాన్ని, కథలను విశ్లేషిస్తూ రాసిన వ్యాసాలు కలిపి వేసిన సంపుటి. ఈ పుస్తకానికి 2013లో సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చింది. తెలుగులో స్త్రీలసాహిత్యానికి లభించిన గౌరవంగా స్త్రీల సాహిత్యాన్ని బాధ్యతగా అధ్యయనం

చేయవలసిన అవసరానికి జాతీయస్థాయి గుర్తింపుగా దానిని భావించాను. కానీ 2015 ఆగస్టులో కన్నడ వచన సాహిత్య పరిశోధకుడు, కన్నడ విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌గా పనిచేసిన విద్యావేత్త, తన పరిశోధనాత్మక సాహిత్య వ్యాసాలకు గాను కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు కూడా పొందిన ఎం.ఎం కల్బుర్గి ఇంటిదగ్గరే హత్యకు గురికావటం కలిగించిన సంచలనం సాహిత్య రంగంలో చర్చకు కారణమైంది. లింగాయత సంప్రదాయంపై చేసిన పరిశోధనలలో ఆయన బసవేశ్వరుడి గురించి నిర్ధారించిన కొత్త విషయాలు హిందూమత భావాలను దెబ్బ తీశాయి అన్న ఆరోపణ ఆయన హత్యకు కారణం. విశ్వాసాల పునాదిమీద పెరిగిన సంస్కృతిలో భిన్నాభిప్రాయాల పట్ల అసహనం ఫలితం ఇది. ఈ అసహనం, స్వతంత్ర పరిశోధనలను, ఆవిష్కరణలకు, వ్రాసే స్వేచ్ఛకు, మాట్లాడే స్వేచ్ఛకు అవకాశం ఇవ్వదు. దానికితోడు భిన్న మతస్థుల ఆహారపుటలవాట్లను సహించలేని దాడులు, హత్యలు. ఈ రకమైన అప్రజాస్వామిక వాతావరణాన్ని సృష్టించి పోషించి చూస్తూ కూర్చున్న ప్రభుత్వం పట్ల నిరసన ప్రకటనగా దేశవ్యాప్తంగా సాహిత్య అకాడెమీ తదితర ప్రతిష్ఠాత్మక అవార్డులు పొందిన రచయితలు, కళాకారులు, శాస్త్రవేత్తలు తమ అవార్డులను వాపస్ చేశారు. నేను వాపస్ చేసింది కూడా అందుకే.

**ఉదార, మార్క్సిస్టు, రాడికల్, సోషలిస్ట్, ఎకో ... ఇలా వివిధ రకాల స్త్రీవాదాలున్నాయి. భారతీయ స్త్రీలకు ఏ వాదం సమర్ధనీయమంటారు?**

ఏ రకం స్త్రీవాదం అయినా స్త్రీపురుష అసమానతలను, జండర్ వివక్షను సంబోధించినవే. వాటిని నిర్మూలించే మార్గాలలో భేదాన్ని బట్టి ఏర్పడ్డవే ఈ స్త్రీవాద భేదాలు. సామాజిక సంస్కరణలు, చట్టబద్ధ అవకాశాల కల్పన ఉదార స్త్రీవాదం వర్గపోరాటంలో భాగంగా శ్రామికవర్గ మహిళా విముక్తితో ముడిపడి మొత్తం స్త్రీల సమస్య పరిష్కార ఆకాంక్ష, ఆచరణ మార్క్సిస్టు స్త్రీవాదం. స్త్రీలంతా ఒక వర్గం అన్న భావన రాడికల్ స్త్రీవాదంలో ముఖ్యాంశం. స్త్రీల దేహాత్మల మీద, ఆలోచనల మీద, ఆచరణ మీద, మొత్తంగా జీవితం మీద పురుషుల అధికారాన్ని స్థిరపరచిన పితృస్వామ్యం వివక్షకు మూలం అన్న గ్రహింపు ప్రాతిపదికగా శరీరం, హృదయం, మెదడు ఉన్న మనుషులుగా స్త్రీలు అస్తిత్వ స్పృహతో ఐక్యంగా విముక్తి మార్గాలను ఆవిష్కరించుకొనటం దీని లక్ష్యం. తనకన్నా భిన్నమైన వర్గంగా పురుషుడు, స్పర్థకు, సవాల్‌కు విషయం అవుతాడు. మార్క్సిస్టు స్త్రీవాదంలోని వర్గ దృక్పథాన్ని రాడికల్ స్త్రీవాదంలోని పితృస్వామ్యాన్ని పరస్పర సంబంధంలో అర్థం చేసుకొనటం, స్త్రీవిముక్తి ఉద్యమాలను వర్గపోరాటంలో భాగంగా అభివృద్ధి చేసుకొనటం సోషలిస్టు స్త్రీవాదం. భారతీయ స్త్రీలకే కాదు, ఏ దేశపు స్త్రీలకైనా ఏదో ఒక స్త్రీవాద భేదాన్ని సర్వరోగ నివారిణిగా సూచించలేం. ఎందుకంటే ఇవన్నీ విడివిడి విషయాలు కావు కనుక. ఒకటి ప్రముఖంగా ఉంటూనే మిగిలిన మూడింటిలోని ఏ ఒకటి రెండైనా సమాంతరంగా జీవన వ్యవహారంలో భాగమవుతుంటాయి. ఇవి చట్టాలు కావు, ఈ దేశంలో వీటిని అమలు చేద్దామనుకొనటానికి. దృక్పథానికి సంబంధించినవి. భిన్న వర్గాల భిన్న స్త్రీ సమూహాలు మళ్ళీ ఒక్కొక్కరుగా ఎవరి చైతన్యాన్ని బట్టి వాళ్ళు తమ తమ అనుభవానికి, అవసరానికి అక్కరకు వచ్చే, ఆకాంక్షల పరిపూర్తికి తోడ్పడగలిగే సూత్రాన్ని ఏ స్త్రీవాద భేదం నుండైనా స్వీకరించి ఆచరణగా మార్చుకోవచ్చు. ప్రధానంగా ఇది వ్యత్యాసాల సమాజం. ధనిక పేద కులమత, స్త్రీపురుష వ్యత్యాసాలతో సంక్లిష్టంగా ఉండే భారతీయ సమాజాన్ని అర్థం చేసుకొనటానికి సోషలిస్టు స్త్రీవాదం కొంచం ఎక్కువ ప్రయోజనకారి అనుకొంటున్నాను.

**స్త్రీవాదం లేవనెత్తిన మౌలిక ప్రశ్నలకు కొన్నింటికైనా పరిష్కారాలు లభించాయయంటారా?**

స్త్రీవాదం లేవనెత్తిన మౌలికప్రశ్నలు వివక్షకు, భార్యాభర్తల సంబంధాలకు, స్త్రీల లైంగికతపై నియంత్రణకు, కుటుంబాధికారానికి, కులమత ఆధిపత్యాలకు సంబంధించినవి. ఈ ప్రశ్నలు అన్నీ కాకపోయినా కొన్నైనా, బీజరూపంలోనైనా స్త్రీవాదం తెలియని కాలాలలో కూడా ఉన్నవే. వాటిని వ్యక్తిగత చైతన్యంతో ఎవరుఎలా పరిష్కరించుకొనటానికి ప్రయత్నించారో సంప్రదాయ సాహిత్యాన్ని పరిశీలిస్తే కథల రూపంలో ఇచ్చిన నమూనాల ద్వారా తెలుస్తుంది. స్త్రీవాదం ఒక సిద్ధాంతంగా పదునెక్కిన ఆధునిక కాలానికి ఈ ప్రశ్నలు మరింత స్పష్టంగా, సూటిగా ఉద్యమ స్థాయిలో ముందుకు వచ్చాయి. తెలుగునాట ఈ చైతన్యం వ్యాపించిన డెబ్బై ఎనభయి దశకాలనుంచి, ఈ నలభై యాభై ఏళ్ల కాలం మీద ఆ ప్రశ్నలకు పరిష్కారాలు లభించాయా అంటే స్త్రీలలో ఆత్మగౌరవ చైతన్యస్థాయిని, పురుషులలో ప్రజాస్వామిక స్ఫూర్తిని కొంతవరకు పెంచినమాట నిజమే కానీ, గుణాత్మకమైన మార్పులు వచ్చాయని మాత్రం చెప్పలేం. ఎందుకంటే స్త్రీవాదం వేసిన ప్రశ్నలు ఉపరితల సాంస్కృతిక నిర్మాణాలకు, భావజాలానికి సంబంధించినవి. వాటికి వేళ్ళు ఆర్థిక పునాది లోపల బలంగా నాటుకొని ఉన్నాయి. ఎక్కడెక్కడ ఏ సమూహాలు, ఏ వ్యక్తులు ఆ నిర్మాణాలతో, భావజాలంతో ఎంతెంత సంఘర్షణ పడుతున్నారో, సంస్కారాలలో మార్పుకు ఎంతవరకు దోహదం చేసారో చెప్పగల గణాంకాలు తియ్యటం అసంభవం. భావజాల సంఘర్షణ తీవ్రతను, సంస్కారాల్లో మార్పును కొలవగల సాధనాలు లేవు. ఈ పరిస్థితుల్లో పరిష్కారాలు లక్ష్యంగా మార్పుదిశగా జరిగే మందగమనమే కనిపిస్తుంది. సాంస్కృతిక విప్లవం నిరంతరం కొనసాగవలసినది, దీర్ఘకాలికమైనది కూడా. తక్షణ అవసరాలు, దీర్ఘకాలిక ప్రయోజనాలు గీటురాళ్ళుగా స్త్రీవాదం లేవనెత్తిన ప్రశ్నల పరిష్కారానికి జరుగుతున్న ప్రయత్నం వర్తమాన చరిత్ర.

**ప్రాచీన సాహిత్యాన్ని స్త్రీవాద దృక్పథంతో పునర్విమర్శ,**

**విశ్లేషణ చేయటం లాంటివి జయప్రభ గారు, ఓల్గా గారు చేశారు. మీరు ఆధునిక దృక్పథంతో మాత్రమే విశ్లేషణ చేశారనుకుంటాను.**

ప్రాచీన సాహిత్యాన్ని స్త్రీవాద దృక్పథంతో విశ్లేషించే పని 1984 నాటికే మొదలు పెట్టాను. అది యాదృచ్ఛికం కాదు. సమకాలీన సమాజంతో చేస్తున్న సంభాషణ పరిణామం. 1977లో ఎం.ఏ పూర్తిచేసి అధ్యాపక వృత్తిలోకి ప్రవేశించిన నాకు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి రాజకీయాలు రగులుకొంటున్న ఉత్తర తెలంగాణా విప్లవోద్య మాన్ని పరిచయం చేశాయి. సృజన, అరుణతార, ప్రజాసాహితి పత్రికలు కొత్త సామాజిక ఆదర్శాలలోకి ఆలోచనలు విచ్చుకొనేలా చేశాయి. విరసం సభల ఉపన్యాసాలు ఉత్తేజాన్ని ఇచ్చాయి. మార్క్సిస్టు సిద్ధాంత అధ్యయనం పట్ల ఆసక్తి పెరిగింది. మార్క్సిస్టు మూల సూత్రాలు మొదలైన పుస్తకాలు, మార్క్సిస్టు దృక్పథం నుండి ప్రపంచ చరిత్రను వ్యాఖ్యానించిన పుస్తకాలు చదువుతుంటే ఆలోచనలకు కొత్తవెలుగు వచ్చిన అనుభూతి. తెలుసుకొంటున్న విషయాలను చదువుతున్న సాహిత్యానికి అన్వయించి చూసు కొనటం, నలుగురితో పంచుకొనటానికి రావిశాస్త్రి, శ్రీశ్రీ వంటి వారి కథలపై విమర్శ వ్యాసాలు వ్రాయటం జరిగింది.

ఆ సమయంలోనే దేశమంతటా విద్యారంగంలో మహిళా జీవన అధ్యయనాలను ప్రవేశ పెట్టటానికి జరుగుతున్న ప్రయత్నాల గురించిన ఎరుక కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకు లను నిలువనీయలేదు. మహిళాజీవన అధ్యయనం ఒక్క తరగతి గదికే పరిమితమైంది కాదని సమాజంలో స్త్రీల జీవిత స్థితిగతుల అవగాహన లేకుండా అది సమగ్రం కాదనే అవగాహనతో 1982లో యూనివర్సిటీ అధ్యాపకులం కొందరం కలిసి స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ ఏర్పాటు చేసుకున్నాం. సాహిత్య విద్యార్థిగా సాహిత్యంలో స్త్రీల జీవన స్థితిగతుల అధ్యయనం నాకు లక్ష్యం అయింది. అప్పుడే చారిత్రక విభాత సంధ్యలలో మహిళా జీవిత వికాసమెట్టిదో తెలుసుకొనటానికి సంప్రదాయ సాహిత్య అధ్యయనం అవసరం అని తెలిసింది. సాహిత్యాన్ని ఉ పయోగించుకొంటూ చరిత్రను వ్యాఖ్యానించిన కొశాంబిని, ఇరావతీ కార్వేని (యుగాంతం) చదువుకొనటం నన్ను ఆ వైపుకు నడిపించాయి. ఆ క్రమంలో వచ్చిన భారతంలో భార్యభర్తృ సంబంధాలు వ్యాసం 1984 నాటిది. అక్కడి నుండి నా పరిశోధనలు పురాణేతిహాసాలను, పాల్కురికి సోమనాధుడి సాహిత్యాన్ని, శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని కేంద్రంగా చేసుకొని చేసిన విశ్లేషణలు అన్నీ స్త్రీ వాదం వెలుగులో సాగినవే. అలంకార శాస్త్రం పాఠంగా చెప్తూ రస సిద్ధాంతం మొదలైన వాటిని ఆ కోణం నుండి విశ్లేషించకుండా ఉండలేక పోయాను. ఈ రకమైన వ్యాసాలను అన్నిటినీ 1998లో 'సంప్రదాయ సాహిత్యం – స్త్రీవాద దృక్పథం' పేరిట సంపుటిగా ప్రచురించాను. 'ప్రాచీన సాహిత్యం –మరో చూపు' (2008) సంపుటిలో కూడా ఇలాంటి వ్యాసాలు ఉన్నాయి.

## విముక్త గీతం

ఎన్ని వేకువలను వెలితిగా వదిలి పెట్టి
నిస్సారపు నీరసపు సముద్రంలో ఈదులాడాలో ...
ఎన్ని పూల పరిమళాలను బహిష్కరించి
ముళ్ళ తీగల మధ్య ఒంటరివాసం చేయాలో ...
ఎన్ని గేయాలను విడిచి పెట్టి
పొట్టి గాయాల సలపరింతలతో సతమతం కావాలో ...
బంధం బానిస బంధనం కాదు కదా, జీవితం!
నిర్బంధపు నికృష్ట కూపంలోంచి
ఎలుగెత్తి పరుగెత్తి నీ స్వతంత్ర గీతమొకటి
మనస్ఫూర్తిగా పాడుకోలేవా?
నీ స్వీయ కళాత్మక సహజ ప్రపంచంలో
మనసారా స్వచ్ఛ ఉచ్వాస నిశ్వాసాలను స్వాగతించలేవా?
ఎన్నేళ్ళూ ఈ ముళ్ళూ తేళ్ళూ
విషపు కసపు కసాయి చీకటి గూళ్ళూ నెగళ్ళూ?
ఏదేదో కోరి కాదు; కేవలం విముక్తి ...
నీ గొంతు నువ్వు వినగలిగిన విముక్తి!
నీ శ్వాసను నువ్వు తీయగలిగిన సంతృప్తి!

**- టీనా**

**94901 32174**

**చివరిగా, స్త్రీవాదాన్ని కొనసాగిస్తున్న రచయిత్రులకు మీ సందేశం ఏమిటి?**

స్త్రీవాదం అనేకమంది స్త్రీల అనుభవాలనుంచి వివక్షకు కార ణాలను గుర్తించటం దగ్గర రూపొందిన సిద్ధాంతం. ఇందులో స్త్రీల లైంగికత, లైంగిక స్వేచ్ఛలకు సంబంధించిన చర్చ ఒక భాగం. అవగాహన అక్కడ ఆగిపోతే అది వ్యక్తి జీవితానికి సంబం ధించిన ప్రయోగాలతో ముగుస్తుంది. స్త్రీలు అంతా ఒకటే అన్న స్త్రీవాద సూత్రం దగ్గర ఆగిపోతే భిన్న వర్గాలు, కులాలు, మతాలు ఉన్న దేశంలో భిన్నవర్గాల స్త్రీల ప్రత్యేక అస్తిత్వ సమస్యలను గుర్తించలేని, అర్థం చేసుకోలేని పరిమితికి లోనవడం జరుగు తుంది. అది బాధిత స్త్రీల మధ్య ఉండవలసిన సహోదరత్వానికి, ఐక్యతకు భంగకరం మాత్రమే కాక సామాజిక అంతరువుల యథాతథ స్థితిని కాపాడేది అవుతుంది. అందువల్ల ఈ నాడు స్త్రీవాదం జీవితాన్ని జండర్ వివక్షను అర్థం చేసుకొనటానికి సాధనమని నమ్మే వాళ్ళు, వివక్షలేని సమాజాన్ని కోరుకొనేవాళ్ళు కుల మత వర్గ వివక్షలనుండి విముక్తికి భిన్నపాయలలో సాగే ఉద్యమాల సాపేక్షతలో స్త్రీవాద అవగాహనను ఎప్పటికప్పుడు సరిచేసుకొంటూ ఉండాలి. అది ఆరోగ్యకరమైన, ప్రజాస్వామిక మానవ సంబంధాల నిర్మాణానికి అత్యవసరమైన షరతు. ■

## కూలిన నగరం పైన డేగ

ఏ ఇటుక తీద్దామన్నా
గుండె పగుళ్ళిస్తుంది
కూలిన నగరం పైన
కన్నీటి వర్షం కురుస్తూనే ఉంది
ఏ శిథిలం ముక్క ముట్టుకుందామన్నా
అదే పేలిన సహస్రారమై పోతుందోనన్న భయం
ఎక్కడ ప్రాణం కొన ఊపిరితో వుందో
ఎక్కడ శరీరం శవంగా మారిపోయిందో

అదిగో అక్కడే అప్పుడే
పుట్టిన పసికందు ప్రాణకేక వినిపిస్తుంది
ఆ సిమెంట్ దిమ్మె సమాధిలోనే
కన్నతల్లి కడ వూపిరి పీల్చింది
దైన్యంగా చూపుల్ని ఆకాశం కేసి చూస్తూ
రెండు చేతులెత్తి ప్రార్థిస్తున్న బతుకు కేకలు
నిన్నటి సాయం సంధ్య సప్తపదులని
సరిగమలుగా సవరించుకుంటూ సాగిన పాదాలు
ఉదయపు శిథిలాల కింద నలిగిన ఆశలై
సజీవ శవాలకి సవాలై నిలుస్తున్నాయి
బొద్దు పేగులో దిగిన ఇనుప ఊచ
కిరాతక చావు ప్రహారాన్ని గుర్తుచేస్తుంది
ఆజా, ప్రార్థన ప్రాణ త్రాణ మంత్రోచ్చాటనల్ని సవాలు చేస్తూ
మరణం సాగిస్తున్న స్వైర విహారం
ఏ దేవుడూ కనికరించడం లేదు
మానవత్వమే ముందడుగు వేసి
కళింగ, కురుక్షేత్రాల కంటే దైన్యమైన
మానవ హనన క్రూరత్వాన్ని
నిలువరించే సాహసానికి పూనుకొన్నది

సందేహం లేదు ..
ఇప్పుడు మనిషే దేవుడు
సందేహం లేదు ..
కరోనా తుఫానుతో కలరా సునామీతో
కుతకుతలాడిన సిరియా నేలపైన
మనిషి మాత్రమే స్నేహ హస్తం చాచగలడు
అందుకే కూలిన నగరం పైన వాలిన డేగల్ని
భూపలకాల మధ్య పాతేసే ప్రయత్నం!

**- ఈతకోట సుబ్బారావు**

94405 29785

## అమ్మా...!


హిందీ మూలం : **అన్వర్ సుహైల్**
అనువాదం : **డా. వెన్నా వల్లభరావు**

మంచి పనే అయిందిలే అమ్మా!
నువ్వు కన్నుమూశావు
లేకపోతే ముసలివాళ్ల పట్ల
రోజురోజుకీ పెరిగిపోతున్న నిర్లక్ష్యాన్ని చూసి
నీకెంత బాధేసేదో!

మంచి పనే అయిందిలే అమ్మా!
నువ్వు కన్నుమూశావు
లేకపోతే భార్యావిధేయునిగా
పిల్లాజల్లలతోనే తీరికలేని
నీ కొడుకుల దుస్థితి చూసి
నువ్వెంత దుఃఖించేదానివో!

మంచిపనే అయిందిలే అమ్మా!
నువ్వు కన్నుమూశావు
'మాతృమూర్తి పాదాల కిందే స్వర్గం ఉంది,
జననీ– జన్మభూమి స్వర్గం కంటే మిన్న' అన్న
ధర్మ గ్రంథాల్లోని విషయాలు
ఇప్పుడెవరూ పట్టించుకోవటం లేదు
మంచి పనే అయిందిలే అమ్మా!
నువ్వు కన్నుమూశావు
లేకపోతే తరచుగా నువ్వు
ఖాళీ కడుపుతో పడుకోవాల్సివచ్చేది
ఎందుకంటే సత్తువ కోల్పోయిన నీ చేతుల్తో
రొట్టెలు చేసుకోలేకపోయేదానివి
గంట–గంటకూ టీ పెట్టుకోలేకపోయేదానివి!
మంచి పనే అయిందిలే అమ్మా!
నువ్వు కన్నుమూశావు
వృద్ధుల పోషణ విషయమై
చట్టం చెయ్యాల్సివస్తుంది ప్రభుత్వానికి
వృద్ధులు చేసే ఒక చిన్న ఫిర్యాదుతో
వాళ్ల కొడుకులకి జైలుశిక్ష కూడా పడొచ్చు
నీ కొడుకుల నిర్లక్ష్యంపై
నువ్వు పోలీస్ స్టేషన్లోనో, కోర్టులోనో
ఫిర్యాదు చెయ్యగలవా అమ్మా?
చెయ్యలేవు కదూ...?

మంచి పనే అయిందిలే అమ్మా!
నువ్వు కన్నుమూశావు!




# విపరిణామాలపై విశ్లేషణాత్మక వ్యాసాలు

- కేశవ్
98313 114213

ద్వంద్వ ప్రమాణాలతోనూ, పతన విలువలతోనూ, ప్రగతి నిరోధక ఆర్థిక విధానాలతోనూ, దిగజారుడు మనువాద సంస్కృతితో కుళ్ళిపోతున్న వ్యవస్థ మీద నిప్పురవ్వల్ని కురిపించిన వ్యాసాల పరంపర 'కొంచెం నిప్పు – కొంచెం నీరు'. నిద్రాణమైన పాఠకుడ్ని మండించడానికి, బాధతో, ఆవేదనతో దుఃఖించేలా చెయ్యడానికి ముందుకొచ్చాడు రచయిత అరణ్య కృష్ణ.

'ఒక సంస్కృతిని వికసింపజేయాలన్నా, విధ్వంసం చేయాలన్నా భాష ఒక బలమైన సాధనం' (పే.72). సరిగ్గా, అలాంటి భాషనే బలమైన సాధనంగా, పదునైన ఆయుధంగా, మండించే నిప్పుగా మార్చి ఈ వ్యాసాలు సమకూర్చారు. నేటి సంక్లిష్ట సామాజిక పరిస్థితుల్లో ఈ వ్యాసాల అవసరం చాలా ఉంది. సామాజిక, సాంస్కృతిక భావజాలాలను వెనక్కి తీసుకెళ్ళడానికి, ప్రజలను మరలా అంధకారంలో తోసెయ్యడానికి అహర్నిశలూ ప్రయత్నం చేస్తూ, అనుక్షణం ప్రగతి నిరోధక భావాలను వ్యాప్తి చెయ్యడానికి వెనుకాడని హిందూత్వ భావజాలం నేపథ్యంలో పుకార్లకూ, నిజాలకు మధ్య భేదాన్ని తెలుసుకొని, రాజ్యం వర్గ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ఈ పుస్తకంలోని అన్ని వ్యాసాలూ దోహదపడతాయి.

విల్‌ఫ్రెడ్ ఓవెన్, పీబీ షెల్లీ పాశ్చాత్య కవులకు వ్యవస్థ ద్వంద్వ ప్రమాణాల మీద విపరీతమైన ఆగ్రహం ఉంటుంది. సరిగ్గా, అరణ్యకృష్ణ రాసిన ఏ వ్యాసం తీసుకొన్నా, అదే ఆగ్రహం కనిపిస్తుంది. సైనికులను యుద్ధాలకు పంపించే నికృష్టమైన విధానాలను కొనసాగిస్తూ, మరలా యుద్ధభూమిలో అత్యంత దయనీయంగా ప్రాణాలు కోల్పోయిన సైనికుల్ని వీరులనీ, శూరులనీ, త్యాగధనులనీ కీర్తించిన పెట్టుబడిదారీ వ్యవస్థ మీద, ద్వంద్వ ప్రమాణాల మీద ఈ పాశ్చాత్య కవులు విపరీతమైన ఆగ్రహం చూపిస్తారు. అరణ్యకృష్ణ రచనల్లో కూడా ఈ అగ్నికణాలు కనిపిస్తాయి. ఈ ఆగ్రహం వ్యక్తిగతం కాదు, సామాజికం. సార్వజనీనం.

ఒక కవి వ్యాసకర్తగా తనను తాను రూపాంతరం చెందించుకోవలసిన చారిత్రక పరిస్థితులు కవి చుట్టూ ఉన్న సమాజమే కల్పిస్తుంది. కవిగా తనకు లభించని విశాలమైన కాన్వాసు ఒక వ్యాసకర్తకు లభిస్తుంది. మరిన్ని విషయాలను మరింత లోతుగా, మరింత విశాలంగా, మరింత స్పష్టంగా చర్చించడానికి, విశ్లేషించడానికి, తర్కించడానికి అవకాశం లభిస్తుంది. ఈ రచనలోని మొత్తం వ్యాసాల్లో ఇదే వాస్తవం కనిపిస్తుంది. వ్యాసకర్తలో కవీ, కవిలో వ్యాసకర్తా లీనమైనప్పుడు అక్షరాలు లయతో విన్యాసం చేస్తాయి. వాక్యాలు నాట్యమాడతాయి. ఎన్నోచోట్ల అక్షరాలు భావాల కత్తులతో హృదయాన్ని గుచ్చుతాయి. అగ్ని బాణాల్ని సంధిస్తాయి. ప్రశ్నిస్తాయి. విమర్శిస్తాయి. ఆవేదనతో విలపిస్తాయి. కన్నీటిని కురిపిస్తాయి.

'గాయమంటే ఆమె చర్మం మీద చేసేదేనా? గాయమంటే నెత్తురొచ్చేదేనా? చర్మం మీద గాయాలే నొప్పి పుట్టిస్తాయా? ఒక ఇబ్బందికరమైన చూపు దుస్తుల లోపలి దేహాన్ని స్కాన్ చేస్తున్నప్పుడు, ఒక జుగుప్సాకరమైన కదలిక ఏకాంత సమయానికి చెందిన శరీర భాగాల్ని తడిమినప్పుడు మనసుకు కూడా గాయమవుతుంది..." (పే.58). ఒక వ్యాసకర్తలో కవీ, ఒక స్త్రీవాదీ, ఒక ప్రగతిశీలుడూ కలగలిసినప్పుడు వాక్యాలు ఇలానే అత్యంత ప్రతిభావంతంగా ఉద్భవిస్తాయి. డా. ఎ.కె.ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన ఈ పుస్తకంలోని 43 వ్యాసాల్లో రచయిత ఇలా ఎన్నో విషయాల మీద ఆగ్రహంతో లేచివస్తాడు. అసంఖ్యాకమైన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాల మీద

ఈ వ్యాసాలు చైతన్యం కలిగిస్తాయి. నేటి హిందూత్వ కాషాయీకరణ, కార్పొరేటీకరణ నిజస్వరూపాలను బట్టబయలు చేస్తాయి – ఈ వాక్యాలు. పతనమైపోతున్న విద్యారంగం మీద బాణాలు విసురుతాడు రచయిత. గుమస్తాలను మాత్రమే తయారుచేసే సాహిత్య సుగంధాలు లోపించిన ఇంగ్లీషు మీడియం విద్యా విధానాన్ని ప్రశ్నిస్తాడు. పిల్లల మీద లైంగిక దాడుల పట్ల మండి పడతాడు. ఒక పెద్ద పరిశ్రమగా మారిపోతున్న విలాసాల పెళ్ళిళ్ళలో మిస్సయిన మానసిక బంధాన్ని ఎండగడతాడు. 'జీవితాల కన్నా, వివాహ పరిశ్రమే బలంగా ఉంది' అంటాడు (పే.98). ఒక మధ్య తరగతి కుటుంబం 20 – 30 లక్షలు ఒక్కో పెళ్ళికి ధారపోస్తున్నది' అని వాపోతాడు. రేపు అంబానీ ఏ 'జియో లింక్స్' పేరుతో వివాహాలు నిర్వహించే ఒక కార్పొరేటు సంస్థని ప్రారంభిస్తే బహుశా బ్రాండెడ్ పెళ్ళిళ్ళు జరుగుతాయేమో' (పే.98) అని సెటైర్ విసురుతాడు. అలానే, హిందూత్వ ప్రాపగాండా మీద విమర్శ బాణాలు సంధిస్తాడు మరో దగ్గర. ఆత్మహత్యలకు దారితీసే వ్యవస్థను 'ఉరిపోసుకుంటున్న మానవత్వం' అని వాపోతాడు. అభివృద్ధి అనే అంశమే లేని 'అభివృద్ధి'ని ప్రశ్నిస్తాడు. పెద్ద పెద్ద కట్టడాలు, రోడ్లు అభివృద్ధి కావంటాడు. మరో దగ్గర మాట్లాడుతూ 'భారతదేశం అనాదిగా బహుళత్వంతో ముందుకు నడుస్తోందని అంటాడు. 'భాషలో, అహారంలో, ఆహార్యంలో, అలవాట్లలో భిన్నత్వం, బహుళత్వం మనది. – కానీ పాలకులు అనుసరించే విధానాలు బహుళత్వానికి, భిన్నత్వానికి అఘాతంగా మారాయని' నిర్ధారిస్తాడు. (పే.100).

'ప్రకృతి, చరిత్ర ప్రసాదించిన వరాలు బహుళత్వం, భిన్నత్వం. వాటిని కాపాడుకోవాలి. చరిత్రని విస్మరించేవారు కొత్త చరిత్రను రాయలేరు. వారు గతకాలపు విషాద చరిత్రలకి తిరిగి ప్రాణం పోస్తారంతే' అంటాడు (పే.106). నిజమే, గతకాలపు అంధకార యుగంలోకి దేశాన్ని, ప్రజల్ని తీసుకుపోయే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతుండడం ప్రగతిశీలులు, సృజనకారులు పరిశీలిస్తున్న విషయమే. 'గో కరోనా గో' అని కొవ్వొత్తులను వెలిగించి కరోనా వైరస్‌ను తరమండనీ, కోట్లకొలది ప్రజలను అంధకారంలోకి నెట్టే ప్రయత్నాలు ప్రణాళికాబద్ధంగా సాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ రచన మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ఒక సమూహాన్ని పరాయి చేసేసి, మెజారిటీల ఆధిపత్యాన్ని రుద్దే విధానం నిజమైన ప్రజాస్వామ్యం కాదనీ, సమూహాలన్నిటి మధ్య భిన్నత్వం పట్ల, వైవిధ్యం పట్ల పరస్పర గౌరవం, సహనం ఉండడమే నిజమైన ప్రజాస్వామ్యం అనీ, ప్రజాస్వామ్యంలో మెజారిటీ, మైనారిటీ అనేది ప్రభుత్వాల ఏర్పాటుకే తప్ప ప్రజా సమూహాల మధ్య ఆధిపత్యానికి సంబంధించినది కాదని మరో వ్యాసం 'ఊరుకుందామా'లో అంటాడు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం నేపథ్యంలో ఇటీవలి దేశ పరిణామాలను పరిశీలిస్తే, ఈ మాటలు అక్షరాలా నిజం అనిపిస్తుంది. తమ రాజకీయ ప్రయోజనాల కోసం ఒక ప్రత్యేక మతస్తుల మీద ప్రణాళికాబద్ధంగా బురదజల్లి, విద్వేషం నింపి ఓట్ల సంచులు నింపుకొనే రాజకీయాల నడుమ ఈ వాస్తవాలు తెలుసుకోవడం అవసరం.

ఈ రచయిత 'మాఫిడియా'లో వార్తల వెనుక, టెలివిజను పరిశ్రమ వెనుక ఒక పెద్ద మాఫియా సామ్రాజ్యం కోసం తవ్వుకుంటూ పోతాడు. వినిమయదారుడ్ని తమ లాభాల సంచుల్ని పోగేసుకోవడం కోసం పతనం చెయ్యడం ఒక ఎత్తయితే, ఆ వినిమయదారుడి అభిరుచుల్ని మార్చడం, అలా మార్చి మరలా తమ లాభాల సంచుల్ని బరువుల్ని పోగేసుకోవడం పెంచుకోవడం మరో ఎత్తు. రచయిత ఈ పరిణామాన్ని చక్కగా విశ్లేషిస్తాడు.

వార్త పతనంగా కంటే దృశ్యంగా ప్రజలకు చేరడం వెనుక ప్రజల అభీష్టాల కంటె నేపథ్యంలో ఒక వ్యవస్థ ఉందనీ, వ్యవస్థ తన ప్రయోజనాలకనుగుణంగా, తనకు అనువైన విధంగా మీడియా రంగాన్ని అచ్చునుండి దృశ్యం వైపుగా రూపాంతరం చేయించిందనీ, అలా మనల్ని అలవాటు చేసిందనీ, అలా మారిన అలవాటుతో తన లాభాల సంచుల్ని పోగుచేసుకుందనీ అంటాడు అందుకే 'మాఫిడియా'లో (పే.175). పఠనం నుండి దృశ్యరూపంలోకి వార్త మారిపోయిన తర్వాత పాలకవర్గాలకు మరింత అనువైన స్పేస్ ఏర్పడింది. తమ విధానాలను ప్రశ్నించకుండా చెయ్యడానికి, తమకు అనుకూలంగా యాంకర్ మూకల్ని తయారుచేసుకోవడానికీ, తాము తిండిపెట్టిన విధంగా తినడానికీ, డిబేట్ చేయడానికి ఎవరు మాట్లాడాలో, ఎవర్ని మాట్లాడించకూడదో చక్కబెట్టుకొని తమ విలువల ప్రయోజనా లను అమర్చుకోవడానికి మరింత సావకాశం లభించింది. ఏది వార్తగా మారాలి? దేన్ని వార్తల నుండి బయటికి పంపించాలి? మొదలైన విషయాలను నిర్ణయించుకోవడం వీరికి సులభమయింది. ప్రజల అజ్ఞానానికి పునాదులు మరింత పకడ్బందీగా వెయ్యగలిగే అవకాశం డిజిటల్ టెలివిజన్ 'దృశ్యం' ద్వారా సాధించుకోగలిగారు. – ప్రజాస్వామ్యానికి ఇది మరో పెద్ద దెబ్బ.

హిందూత్వ ప్రాపంగాండాలో దేశాన్ని వెయ్యేళ్ళ వెనక్కి తీసుకెళ్ళి అంతా వైదిక యుగంలోనే జరిగిపోయిందనీ, విజ్ఞాన శాస్త్రాన్ని హేళన చేసి అంధకారంలోకి ప్రజల్ని తరుముకెళ్ళడం ఒక ఎత్తు. నూతనంగా అభివృద్ధి చెందిన ఇంటర్నెట్, డిజిటల్ విప్లవం, సోషల్ మీడియాను ఉపయోగించుకొని వాట్సప్‌ను పుకార్ల విశ్వవిద్యాలయంగా మార్చుకొని చరిత్రను ఎంత వీలయితే అంతగా వ్యక్తీకరించి, తమకు నచ్చని నాయకులను, తమదారికి అడ్డువచ్చే నాయకులను చరిత్రహీనులుగా మార్చేయ్యడం మాబ్‌ను

రెచ్చగొట్టడం మరో ఎత్తు. అందుకే, 'నిజాలు గబ్బిలాల్లా తలకిందులుగా వేలాడుతూ దర్శనమిస్తుంటాయి' అని వాట్సప్ యూనివర్శిటీ పుకార్ల పరిశ్రమ మీద ధ్వజమెత్తుతాడు 'ఆ వైరస్ పేరు పుకారు'లో (పే.135). 'కార్పొరేట్లకు కావలసిందల్లా పాలకులిచ్చేస్తారు. అందుకు ప్రతిగా 'ఇన్ఫర్మేషన్ డంపింగ్'కి కావలసినంత స్పేస్‌ను వాళ్ళు ఏర్పాటు చేసేస్తారు' అని ఈ పుకార్ల పరిశ్రమ వాట్సప్ విశ్వవిద్యాలయం పనితీరుని చిత్రించిన తీరు ప్రశంసించదగ్గది. నేటి పాలకవర్గ రాజకీయాలను అర్థం చేసుకోవడానికి ఈ వ్యాసాలు దారి చూపిస్తాయి. అప్రమత్తం చేస్తాయి. మూకలో బాజాలు వాయించే మందలో కలిసి పోకుండా వెనుక ఉండి విశ్లేషించడానికి సమాజాన్ని ముందుకు తీసుకుపోవడానికి సహకరిస్తాయి. తేళ్ళ అరుణ ప్రచురించిన ఈ పుస్తకాన్ని సాహస రచనలు అని ముందుమాట రాసిన ప్రొఫెసర్ జి.హరగోపాల్ కొనియాడగా, 'నీటిలో నిప్పు' అని డా.ఎ.కె. ప్రభాకర్ పేర్కొన్నారు. హిందుత్వ భావజాలంతో దేశం ఎటుపోతుందో అర్థంకాని యువతకూ, ప్రజలకూ ఈ రచన దిక్సూచిలా పనికొస్తుంది. ■

## బాల సాహిత్యాన్ని రచయితలమే ప్రచురించుకుందాం

**ఆం**ధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 2019 నుంచి దాదాపు రెండేళ్లు బాల సాహిత్యం కోసం స్థానీయత ప్రధాన అంశంగా బాల సాహిత్యం రాయడం జరిగింది. చరిత్ర, ఆచార వ్యవహారాలు, చారిత్రక కట్టడాలు, పౌరాణిక స్థలాలు, గొప్ప వ్యక్తులు, ఆహార పానీయాలు, నదులు, సరస్సులు మొదలైన అంశాల్లో జిల్లాల వారీగా పాఠశాల విద్యార్థుల కోసం రాష్ట్ర సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో రెండు వర్క్ షాపులు నిర్వహించారు. ప్రతి జిల్లాలోని బాల సాహిత్య రచయితలు ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను ఎన్నో కష్టనష్టాలకోర్చి కరోనా కాలంలోనూ కథలు రూపొందించారు. రూపంలో రాయడం జరిగింది. అయితే పాఠశాల విద్యార్థులకు ఉపయుక్తమైన ఈ స్థానిక కథలను సమగ్ర శిక్ష ఇంతవరకు ప్రచురణకు చేపట్టలేదు. సొంత ఖర్చులతో రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి కరోనా కాలానికి కూడా భయపడకుండా రెండు వర్క్ షాప్‌లకు తమ సొంత ఖర్చులతో హాజరైన రచయితలకు ఎలాంటి చెల్లింపులూ జరపలేదు. అద్భుతమైన ఈ స్థానిక కథలను జిల్లాల వారీగా మేమే ప్రచురించుకుంటాం అని వివిధ జిల్లాల నుంచి రచయితలు సిద్ధమవుతున్నారు. కాబట్టి అద్భుతమైన ఈ స్థానిక చరిత్రలను అన్ని జిల్లాల రచయిలం మనమే ప్రచురించుకొని పాఠశాల విద్యార్థులకు చరిత్ర పరిశోధకులకు అందుబాటులోకి తీసుకువద్దాం.

**– మంచికంటి, కథారచయిత**
**రాష్ట్ర బాల సాహిత్య కోఆర్డినేటర్**
**99495 35695**




## వడ్రంగి

**నే**ను అడవికి వెళ్ళాను
ఒక అందమైన కుర్చీ కోసం
కర్ర తెద్దామని.
చెట్టు చెట్టునీ అడిగాను –
'నేను రానంటే నేను రానని'
నా మనసుకు చెప్పాయి
'సరే, మీకిష్టమయితేనే' అన్నాను.

ఒక్కోచెట్టు కింద కూర్చున్నాను
ప్రతీ చెట్టుతో మాట్లాడాను
చెట్టు చెట్టు కింద నిదరోయాను.
వాటి ఇష్టాన్ని గౌరవిస్తూ –
ఇంటికి తిరిగి వెళ్ళిపోయాను.

కొన్నిరోజుల తర్వాత
ఒక చెట్టు నడుచుకుంటూ
మా ఇంటికొచ్చి
సింహాసనంగా మారిపోయింది!

**- కిల్లాడ సత్యనారాయణ**




# క్రోనీ విధానాలు 'జాతీయ ప్రయోజనాలు' అనే భ్రాంతి!

**- సంజయ్ రాయ్**

**అ**దానీ గ్రూపు కంపెనీలపై హిండెన్‌బర్గ్ సంస్థ ఇచ్చిన నివేదిక చూపించిన ప్రభావంతోను, దానికి భారత ప్రభుత్వం రాజకీయంగా స్పందించిన తీరుతోను భారతదేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం చవి చూస్తున్న కొన్ని ఆందోళనకరమైన ధోరణులు బైటపడ్డాయి. భారత ప్రభుత్వం బడా పెట్టుబడికి రక్షణగా స్పందించిన విధానం అంత ఆశ్చర్యం కలిగించేదేమీ కాదు. నిజానికి గత రెండు దశాబ్దాలకు పైగా ఈ ప్రభుత్వం చేస్తున్నది అదే. ఇక ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అనేది కూడా అంత కొత్తదేమీ కాదని మనదేశంలో ప్రభుత్వానికి, పెట్టుబడిదారులకు మధ్య ఉండే సంబంధాల చరిత్రను పరిశీలించేవారికి తెలుస్తుంది. ఈ దేశంలో గుత్త పెట్టుబడిదారులు అమలులో ఉండే నియమ నిబంధనలను ప్రమాదకరమైన రీతిలో ఉల్లంఘించినప్పుడు వారిని అదుపు చేయవలసివచ్చిన సందర్భాల్లో ఏదో ఒక విధంగా వారికి ప్రయోజనాలు చేకూరేలా వ్యవహరిస్తూ, పాలకులు జాతీయ ప్రయోజనాలకు ద్రోహం చేస్తూనే వున్నారు.

తక్కినవారిని పక్కకు నెట్టి అత్యధిక ప్రయోజనాలను తమ స్వంతం చేసుకోడానికి అమలులో ఉండే నియమ నిబంధనలను మసి పూసి మారేడుకాయ చేయడం, అందుకోసం రాజకీయ అధినేతతో అత్యంత సన్నిహిత సంబంధాలను నెరపడం ఈ బడా పెట్టుబడిదారులకు మొదటినుంచీ అలవాటే. నయా ఉదారవాద విధానాల అమలు మొదలయ్యే మునుపు కొన్ని రంగాల్లో కొద్ది బడా వ్యాపార సంస్థలమీదే అతి ఎక్కువగా ఆధారపడాల్సిన సందర్భాలు తటస్థించినప్పుడు దానిని లోతుగా పరిశీలించిన దరిమిలా ఈ వ్యవస్థ రూపొందించిన నియమ నిబంధనలు గౌరవింపబడేటట్టు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలా ఏర్పరచిన కట్టుబాట్లను సైతం అతిక్రమించడం, బడా గుత్త పెట్టుబడిదారులు మరింత ఎక్కువగా ఆర్థిక సంపదను పోగేసుకోవడం కొనసాగింది.

బడా కార్పొరేట్లకు, అధికారంలో ఉన్న రాజకీయ నాయకులకు నడుమ ఉండే సన్నిహిత సంబంధాలతో పరిశ్రమాధిపతుల్ని క్రమశిక్షణలో ఉంచడం మాత్రం సాధ్యం కాలేదు. కొన్ని తూర్పు ఆసియా దేశాల్లో అభివృద్ధి జరిగిన దశలో ఆ విధంగా చేయగలిగారు కాని మన దేశంలో మాత్రం అది కుదరలేదు. పెట్టుబడిదారులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించినందుకు లేదా వారు నిబంధనలను పాటించనప్పుడు కావాలనే పట్టించుకోకుండా ఉన్నందుకు ఆ యా రాజకీయ పార్టీలకు ఆర్థిక తోడ్పాటు అందుతూ వచ్చింది. ప్రభుత్వం ద్వారా బడా పెట్టుబడిదారులు పొందే రాయితీల, ఇతర ప్రయోజనాల రూపంలో పొందే ప్రజాధనం ఎంత ఉన్నా, దానిని ఉపయోగించుకుని దీర్ఘకాలంలో మార్కెట్‌లో పోటీని తట్టుకుని మన దేశం నిలబడగలిగేలా సామర్థ్యాన్ని పెంచుకొనేందుకు అటు ప్రభుత్వం కాని, ఇటు బడా కార్పొరేట్లు కాని ఎటువంటి ప్రయత్నమూ చేయనేలేదు. ఐతే, ప్రభుత్వాలు కొంతమంది పెట్టుబడిదారులకు ప్రత్యేక ప్రయోజనాలు కల్పించడానికి పూనుకున్న పలు సందర్భాలలో బహిరంగంగా వేడివేడి చర్చలు జరిగేవి. అటువంటి సందర్భాలలో లోతుగా పరిశీలన జరిగేది. కాని ఇప్పుడు అలా జరగడం లేదు. ఎన్నికల బాండ్లు వచ్చాక ఎటువంటి చర్చలూ మనకి కనిపించడం లేదు.

ఇప్పుడు అదానీ వ్యవహారం మీద దుమారం రేగుతున్నప్పుడు దేశంలోని అత్యున్నత పదవిని అధిష్టించిన వ్యక్తి ఆ చర్చను పూర్తిగా వేరే దిశలో పక్కదోవ పట్టించేవిధంగా జోక్యం చేసుకున్న తీరుకు ఈ దేశ ప్రజానీకం అందరూ ఆశ్చర్యపోతున్నారు. దేశ ప్రధాని తన అధికారాన్ని ఉపయోగించి ఒక వ్యాపార సంస్థకి అత్యధిక ప్రయోజనాలు కల్పిస్తూ తక్కినవారికి అవకాశం లేకుండా చేసిన విధానాన్ని, కొందరిని

బలవంతంగా లొంగదీసుకున్న విధానాన్ని అనేకులు అనేక విధాలుగా ప్రశ్నిస్తున్నారు. ఆ విధంగా సాగుతున్న అవినీతి పద్ధతులను, తప్పుడు మార్గాల ద్వారా అదానీ కంపెనీల షేర్లను ఎక్కువ విలువ ఉన్నట్టు చూపించడాన్ని ప్రశ్నించడం అంటే అది భారతదేశం సాధించిన విజయాలను ప్రశ్నించడమే అని, ప్రపంచవ్యాప్త మదుపుదారుల ముందు భారతదేశాన్ని తక్కువ చేసి చూపడమే అని ప్రధాని వ్యాఖ్యానించారు.

పార్లమెంటులో ఏ ప్రశ్న లేవనెత్తినా, తమకు మెజారిటీ ఉంది అన్న వాదనతో ఆ ప్రశ్నలను పట్టించుకోకపోవడమో, పక్కకు నెట్టివేయడమో, లేక బలవంతంగా తమ మాట నెగ్గించుకోవడమో పరిపాటి అయిపోయింది. ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదం తెచ్చిపెట్టే ధోరణి. తమ పార్టీకి మెజారిటీ ఉంటే చాలు. ఇక ప్రజలకు ఏ విషయంలోనూ జవాబు చెప్పనవసరం లేదన్నమాట!

సరళీకరణ కాలంలో దేశ ఆర్థిక వ్యవస్థ యావత్తూ ఎటువంటి ఆర్థిక నిర్మాణ ఛత్రం పరిధిలో బిగించివేయబడుతుందంటే అందులో ద్రవ్య పెట్టుబడి, కార్పొరేట్ల ప్రయోజనాలే దేశ ప్రయోజనాలుగా, ప్రజల ప్రయోజనాలుగా పరిగణించబడే పరిస్థితి ఏర్పడుతుంది. బడా కార్పొరేట్లు దేశ ఆర్థిక వ్యవస్థతో అంతకంతకూ మరింత ఎక్కువగా పెనవేసుకుపోతున్నారు. మరో పక్క ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడులు ఉపసంహరించబడుతున్నాయి. వాటి వాటాలు స్టాక్ మార్కెట్‌లో అమ్మకానికి పెడుతున్నారు. ఆ స్టాక్ మార్కెట్ పదే పదే కుదేలవుతూ, షేర్ల విలువలు కరిగిపోతున్నాయి. మదుపుదారులలో అవి తీవ్ర ప్రకంపనలు కలిగిస్తున్నాయి. ఈ పరిణామాలు దేశ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యంగా లేదన్నదానికి సంకేతాలు. ఆర్థిక వ్యవస్థ లో అంతకంతకూ ద్రవ్య పెట్టుబడి పాత్ర పెరుగుతూ పోతోంది. ఆ స్టాక్‌మార్కెట్ జూదంలో కార్పొరేట్ల లాభాలు అంతకంతకూ పెరుగుతూంటే మరోపక్క అక్కడ సంభవించే నష్టాలు మాత్రం సామాన్య మదుపుదారుల నెత్తిమీద పడుతున్నాయి. ఈ విధంగా జరగడం దేశ ప్రయోజనాలకోసమే అన్న భ్రమ, కార్పొరేట్ల ప్రయోజనాలే దేశ ప్రజల ప్రయోజనాలు అన్న భ్రమ అంతకంతకూ మరింత బలపడుతోంది. ఇప్పుడు అదానీ పెట్టుబడులు దేశంలో ఎంత ఎక్కువగా ఉన్నాయంటే, స్వయానా ప్రధాని ఆదరణతో అవి ఎంత విస్తరించాయంటే, దాని పర్యవసానంగా ఇప్పుడు అదానీ కుప్పకూలడం అంటే భారతదేశమే కుప్పకూలడం అన్న ఆందోళన కలుగుతుందన్నమాట.

**మౌలిక వసతుల కల్పన రంగంలో అదానీ గ్రూపు**

సెంటర్ ఫర్ మోనిటరింగ్ ఇండియన్ ఎకానమీకి చెందిన క్యాప్ ఎక్స్ వద్ద ఉన్న గణాంకాల ప్రకారం అదానీ గ్రూపు ప్రస్తుతం చేపట్టినవి గాని, చేపట్టనున్నట్టు ప్రకటించినవి గాని మౌలిక వసతుల కల్పన రంగపు ప్రాజెక్టులు 191 దాకా ఉన్నాయి. వాటిలో సుమారు రూ.7 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు ఉన్నాయి. ఇవిగాక ఇప్పటికి 123 పెద్ద ప్రాజెక్టులు పూర్తి అయ్యాయి. వాటి విలువ లక్ష కోట్ల రూపాయలకు పైబడే ఉంటుంది.

కొత్తగా పెట్టుబడులు పెడుతున్న ప్రాజెక్టులలో 13 పోర్టులు, 33 సౌర, పవన, జల విద్యుత్తు ప్రాజెక్టులు, 12 సాంప్రదాయ విద్యుత్తు ప్రాజెక్టులు, విద్యుత్తు ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టులు, సిమెంటు ప్రాజెక్టులు వంటివి ఉన్నాయి. భారీ ప్రాజెక్టుల పెట్టుబడులు రెండేళ్ళపాటు పెడతారు. ప్రస్తుతం కొనసాగుతున్న పెట్టుబడుల విలువ సుమారు రూ.7.168 లక్షల కోట్లు. మన దేశంలో ఒక ఏడాదిలోపు పూర్తి అయ్యే మొత్తం ప్రాజెక్టుల విలువతో సమానమైన విలువ కల ప్రాజెక్టులు తాము చేపడుతున్నట్టు అదానీ గ్రూపు ప్రకటించింది. దానిని బట్టి భారతదేశంలో మౌలిక వసతుల కల్పన రంగంలో అదానీ గ్రూపు సంస్థలదే సింహభాగం అని స్పష్టం ఔతోంది.

ఇక అదానీ గ్రూపు సంస్థల ఆర్థిక పరిస్థితి చూద్దాం. అదానీ గ్రూపు సంస్థల మొత్తం ఆస్తులకు, ఆ కంపెనీలు చెల్లించాల్సిన దానికి మధ్య నిష్పత్తి 2021-22లో 0.74 గా ఉంది. మన దేశంలోని తక్కిన బడా కార్పొరేట్ కంపెనీల ఆస్తులు- అప్పుల నిష్పత్తితో పోల్చితే అదానీ గ్రూపు సంస్థలదే అతి తక్కువగా ఉంది. ఇక అప్పులకు, వాటాల విలువకు మధ్య నిష్పత్తి చూస్తే 1.5 నుండి 1.1 మధ్య ఉంది. తక్కిన బడా కార్పొరేట్ సంస్థలతో పోల్చితే ఇదే అత్యధికంగా ఉంది. దీనిని బట్టి అదానీ గ్రూపు సంస్థలు తక్కిన కార్పొరేట్ సంస్థలకన్నా చాలా ఎక్కువ మోతాదులో రుణాల మీద ఆధారపడి నడుస్తున్నాయని కనపడుతోంది. చాలా ఎక్కువ పెట్టుబడులు మౌలిక వసతుల కల్పన రంగంలో పెడుతున్నా, అదానీ సంస్థల స్థిరాస్తులలో పెరుగుదల రేటు తక్కిన సంస్థల (ఆర్థికేతర సంస్థల) కన్నా చాలా తక్కువగా ఉంది. ఇది ఆసక్తి రేకెత్తించే మరో అంశం. గత మూడేళ్ల కాలంలో తక్కిన ఆర్థికేతర సంస్థల స్థిరాస్తుల విలువ పెరుగుదల రేటు (2019 - 2022 మధ్య) 5.3 శాతం ఉంటే, అదానీ సంస్థల స్థిరాస్తుల పెరుగుదల రేటు మైనస్1.7 గా ఉంది. ఈ వాస్తవ వివరాలన్నీ దేశంలోను, బైట ఉన్న మదుపుదారులకు ఆందోళన తప్పకుండా కలిగించే అంశాలే. హిండెన్‌బర్గ్ నివేదిక కూడా అదానీ గ్రూపు సంస్థలు తలకు మించిన అప్పులు చేశాయని, వాటి షేర్ల విలువను కృత్రిమంగా పెంచి చూపించాయని ప్రధానంగా ఆరోపించింది. అందుకే ఆ నివేదిక

బహిర్గతం అయ్యాక ఆ షేర్ల విలువలు భారీగా పడిపోయాయి. దాని ఫలితంగా అదానీ గ్రూపు సంస్థలు తాము ప్రకటించిన రూ.20 వేల కోట్ల విలువ కల ఫాలో అప్ ఆఫర్‌ను వెనక్కి తీసుకోవల్సి వచ్చింది. తమ రెవెన్యూ వృద్ధి లక్ష్యాలను, పెట్టుబడి వ్యయం లక్ష్యాలను కూడా కుదించుకోవల్సి వచ్చింది.

**జాతీయ ప్రయోజనాలు అనే చిత్త భ్రమ'**

అదానీ కంపెనీల వాటాల్లో చిక్కుకున్న ఎస్‌బిఐ పెట్టుబడుల విలువ రూ. 27 వేల కోట్లు వరకూ ఉంటుంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడాలకు కూడా అదానీ షేర్లలో పెట్టుబడులు ఉన్నాయి. ఇక ఎల్‌ఐసి పెట్టుబడులు రూ. 36,500 కోట్లు వరకూ ఉన్నాయి. ఐతే ఆర్థిక మంత్రితో సహా ఉన్నతాధికారులందరూ ఈ పెట్టుబడుల మొతాదు ఆ సంస్థలు తట్టుకోలేనంత ఎక్కువేమీ కాదని గట్టిగా చెప్పారు. ఒక వేళ అదానీ షేర్లు ఇంకా పడిపోయినా, ఎల్‌ఐసి వద్ద బీమా క్లెయిములు చెల్లించడానికి కావలసినంత నిల్వలు ఉన్నాయని కూడా ప్రకటించారు. అదానీ గ్యాస్, అదానీ పోర్ట్స్ వంటి కంపెనీల్లో కూడా ఎల్‌ఐసి పెట్టుబడులు ఉన్నాయి. మంత్రిగారు ఎంత నమ్మబలికినా, అదానీ షేర్ల విలువ ఇదే విధంగా పడిపోతూవుంటే ఈ ప్రభుత్వ రంగ సంస్థల షేర్ల విలువలు కూడా పడిపోక తప్పదు.

స్టాక్ మార్కెట్ జూదానికి ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ఒడ్డడం వలన కలిగే పర్యవసానాలు చాలా అవాంఛనీయ మైనవిగా ఉంటాయి. అదానీ షేర్లు పడిపోవడం కొనసాగితే మదుపుదారుల విశ్వాసం సన్నగిల్లుతుంది. దాని వలన అదానీ సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన ప్రభుత్వ రంగ సంస్థలకు కూడా మార్కెట్ నుండి పెట్టుబడులు సేకరించడం దుస్సాధ్యం అవుతుంది. దానివలన పెట్టుబడులు పెట్టే క్రమం దెబ్బ తింటుంది. ప్రస్తుతం నడుస్తున్న, త్వరలో మొదలు కానున్న మౌలిక వసతుల రంగ ప్రాజెక్టులు పూర్తి కావడం కష్టం అవుతుంది. కాబట్టి అదానీ ప్రయోజనాలు గనుక దెబ్బ తింటే దేశానికే నష్టం అనే చిత్త భ్రమ ఇక్కడి నుండే మొదలౌతుంది. కాని ఈ పరిస్థితి ఏ విధంగా ఉత్పన్నం అయ్యింది? కేవలం ఒక్కరి చేతుల్లో సంపద కేంద్రీకరించబడడం, అందుకు ప్రధాని కార్యాలయం నేరుగా తోడ్పాటు, ఆశ్రయం కల్పించడం మాత్రమే ఈ పరిస్థితికి కారణాలు. అందువల్లనే పెట్టుబడుల కోసం ఒకే ఒక బడా కార్పొరేట్ సంస్థ మీద అతిగా ఆధారపడాల్సిన పరిస్థితి దాపురించింది.

కేవలం అదానీ కంపెనీల షేర్లు కిందా మీదా అయినంత మాత్రాన దేశానికి, సామాన్య ప్రజానీకానికి అదేమీ పెద్ద సమస్యగా మారదు. నిజానికి ఇటువంటి స్టాక్‌మార్కెట్ జూదంలో ఎక్కువగా దెబ్బ తినేది చిన్న మదుపరులే. పెద్ద మదుపుదారులకి ఆయా కంపెనీల లోపల జరుగుతున్న వ్యవహారాల గురించిన సమాచారం ఎప్పటికప్పుడు అందుతూనే వుంటుంది. అంతేకాదు; ఇలా తరుచూ షేర్ల సూచిక పడిపోవడం, మళ్ళీ పెరగడం అనే ప్రక్రియ క్రమంగా కొద్దిమంది చేతుల్లో పెట్టుబడులు కేంద్రీకృతం కావడానికి దోహదం చేస్తుంది కూడా. అందుకనే ప్రస్తుతం అదానీ ఉదంతం తర్వాత కూడా ఏ విధంగా జోక్యం చేసుకుంటే స్టాక్ మార్కెట్ విశ్వసనీయత పెరుగుతుంది? అన్న కోణం నుంచే చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుత నయా ఉదారవాద ఛత్రం పరిధిలోనే పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు.

ఇక్కడ ఆర్థిక వ్యవహారాలు అన్నీ సజావుగానే సాగుతున్నట్టు చిత్రీకరించడానికి, ఏదో విధంగా జాతీయ, అంతర్జాతీయ మదుపుదారులలో విశ్వాసాన్ని నెలకొల్పడానికి తంటాలు పడుతున్నారు. కాని ఈ విధమైన పరిస్థితి ఉత్పన్నం కావడానికి మూలకారణాలైన సంపద కేంద్రీకరణ, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ప్రపంచ పెట్టుబడిదారీ విధానంలోని వ్యవస్థీకఅత అంతర్భాగాలే. అందుచేత ఇప్పుడు మొత్తం ఆర్థిక వ్యవస్థనే పూర్తిగా చక్కదిద్దడం, అందులో భాగంగా స్పెక్యులేటివ్ లావాదేవీలను పూర్తిగా నియంత్రించడం జరిగితేనే సరైన పరిష్కారం దొరుకుతుంది.

**(28.2.2023 నాటి ప్రజాశక్తి నుంచి)** ■

## 'గ్రంథాలయం'పై
## కవితలకు ఆహ్వానం

**మరో** గ్రంథాలయోద్యమం ఇవాళ్టి అవసరం. లీడ్ లైబ్రరీ ఆధ్వర్యాన అనేక గ్రామాల్లో లైబ్రరీలు ఏర్పాటు చేస్తున్నాం. ఇదే తరహాలో గ్రామగ్రామాన విజ్ఞాన భాండాగారాలు వెలిసేలా ప్రయత్నించడం అవసరం. సాంకేతిక వనరులు ఎన్ని వున్నా పుస్తకం పట్టుకొని చదివే అలవాటును ఈకాలం విద్యార్థులలో, యువతలో ప్రోది చేయాలి. వారిని గ్రంథాలయాల వైపు నడిపించాలి. కనుక ఈ విషయమై స్పందించి, గ్రంథాలయం ఇతివృత్తంగా కవితలని పంపించవలసిందిగా కవులను ఆహ్వానిస్తున్నాం. 'జ్ఞానదీపం–గ్రంథాలయం' పేరుతో పాలపిట్ట బుక్స్ – లీడ్ లైబ్రరీ కలిసి ఒక కవితా సంకలనం ప్రచురించాలని సంకల్పించాం. కనుక కవితలను పంపించండి. వస్తు శిల్పాలలో నవ్యతని పాటించే కవితలకే ప్రాధాన్యం. కవితలు పంపడానికి చివరి తేదీ మార్చి 30, 2023. మీ కవితలను palapittabooks@gmail.com లేదా kasula.ravikumar8@gmail.com కు ద్వారా పంపగలరు. వివరాలకు : 9490099327, 7981068048.

**– కాసుల రవికుమార్, లీడ్ లైబ్రరీ**





# భాషా దోషాల నివారణకు జాగ్రత్తల సూచి

- దొండపాటి కృష్ణ
90523 26864

ప్రస్తుతమున్న శాస్త్ర సాంకేతిక, పోటీ ప్రపంచంలో మాతృభాషలో నెగ్గుకురావడం కష్టమని చాలామంది అభిప్రాయం. అదే నిజమనుకుంటే పరభాషలు రానివారు ఎలా మనుగడ సాగించగలుగుతున్నారనేది సమాధానం లేని ప్రశ్న. పరభాష అనేది మనం నిర్దేశించుకున్న గమ్యాన్ని చేరడానికి ఊతమందించే చిన్న ఉపకరణం మాత్రమే! అదే పూర్తి జీవితం, జీవనమూ కాదు.

కథలు, కవిత్వం, నవలలు... ఏదైనా సాహిత్య ప్రక్రియలో మనమెంత అందుబాటులో ఉన్నామనే అంశం మీద తెలుగు భాష అస్థిత్వం ఆధారపడి ఉంటుంది. దాన్ని గుర్తించి తెలుగు భాషలో రచనలు చేస్తూ అందుబాటులో ఉండాలి. విరామ చిహ్నాలు వాడకపోతే ఏమవుతుందిలే, మనం చెప్పాలనుకున్న విషయం చేరిపోతోంది కదా, అనుకుంటే పొరబాటే...

**"నేను దుకాణానికి వెళ్లాను అక్కడ లడ్డూలు పాలకోవా జిలేబిలు ఉన్నాయి అబ్బా అవన్నీ ఎంత బాగున్నాయో"**

ఈ వాక్యంలో ఒక్క విరామ చిహ్నం కూడా వాడలేదు. మనమేం చెప్పాలనుకుంటున్నామో, అదే విషయం అవతలి వ్యక్తికి సూటిగా చేరుతోందా? అనేది ఆలోచిస్తే 'లేదనే' చెప్పాలి. ఫుల్ స్టాప్, కామా, ఆశ్చర్యార్థకంలాంటి విరామ చిహ్నాలు వాడకపోవడం వల్ల చదవడంలో కొంత గందరగోళం ఏర్పడుతోంది. ఇదే వాక్యాన్ని విరామ చిహ్నాలతో రాస్తే...

**"నేను దుకాణానికి వెళ్లాను. అక్కడ లడ్డూలు, పాలకోవా, జిలేబిలు ఉన్నాయి. అబ్బా! అవన్నీ ఎంత బాగున్నాయో!"**

ఇప్పుడీ వాక్యానికి పరిపూర్ణత వచ్చింది. 'నేను దుకాణానికి వెళ్లాను.' అనే వాక్యం తర్వాత ఫుల్ స్టాప్ పెట్టడం వల్ల వాక్యం పూర్తైనట్లు, క్రియ ఏం జరిగిందో తెలుస్తోంది. 'అక్కడ లడ్డూలు, పాలకోవా, జిలేబిలు ఉన్నాయి.' అనే వాక్యంలో కామాలు, ఫుల్ స్టాప్ పెట్టడం వల్ల అక్కడ ఏమేమి ఉన్నాయో తెలుస్తోంది. 'అబ్బా! అవన్నీ ఎంత బాగున్నాయో!' అనే వాక్యంలో అవి ఎలా ఉన్నాయో అనుభూతితో చెప్పినట్లు తెలుస్తోంది. ఏ విరామ చిహ్నం ఎక్కడ వాడాలో రాసేవారికి స్పష్టమైన అవగాహన అవసరం. విరామ చిహ్నాలు వాడటం వల్ల అర్థవంతమైన వాక్యం నిర్మాణమవుతుంది. ఇదే వాక్యానికి విరామ చిహ్నాలు పెట్టాల్సిన చోట పెట్టకుండా మరోచోట పెడితే అర్థమే మారిపోయే ప్రమాదముంది.

సామాజిక మాధ్యమాలు పెరిగాక రాయడమనేది విస్తృతమైంది. మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రావడంతో మనం పంపాలనుకున్న సందేశం క్షణాల్లో చేరిపోతోంది. అందునా సామాజిక మాధ్యమాల ద్వారా సమాచారం బట్వాడా విపరీతంగా జరుగుతోంది. ఈ ప్రాసెస్ లోనే తెలుగులో రాసేవాళ్ళ సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇది ఆహ్వానించదగ్గ పరిణామం. ఇలా సంబరపడేలోపే విశ్వవ్యాప్తం అవుతోన్న తెలుగు భాష లిపిలో అక్షర దోషాలు చంద్రుడిలో మచ్చలా మిగిలిపోతున్నాయి. మన తప్పిదాన్ని ఫోన్ మీదకు నెట్టేయ్యడం బాధ కలిగిస్తోంది. 'మా ఫోన్ కీబోర్డులో సరైన ఫీచర్స్ లేవ'ని అక్షర దోషాలను పట్టించుకోకుండా పంపేస్తున్నారు. రాసేటప్పుడు వ్యాకరణం సరిగ్గా ఉందో లేదో చూసుకోకుండా పంపడం పూర్తిగా మన తప్పే అవుతుంది.

మన పక్కన 'అక్షర సుమాలు' అనే పుస్తకం ఉంటే ఆ

ఈ తప్పిదాల నుంచి తప్పించుకోవచ్చు. అదెలాగో ప్రముఖ రచయిత్రి నండూరి సుందరీ నాగమణి ఈ పుస్తకంలో చక్కగా వివరించారు. ఈ పుస్తకం అధ్యయనం చేయడం మూలంగా మన తప్పులను సరిచేసుకునే మార్గం తెలుస్తుంది.

"తెలుగుభాష పట్ల నాగమణికి గల అభిమానం, ఆరాధన అపరిమితం. ఎవరే చిన్న తప్పు రాసినా, దాన్ని సరిచేయాలన్న తపన, ఆ తప్పు పునరావృతం కాకూడదన్న కోరిక వీరిలో మెండు. ఎదుటివారు విసుక్కుంటారేమోనన్న భయంగానీ, ఆ కారణంగా తనను ద్వేషిస్తారేమోనన్న శంకగానీ నాగమణి లో అణుమాత్రం కూడా కానరావు. కేవలం దోషరహితమైన తెలుగును అందరూ అలవరుచుకోవాలన్న కోరికే తప్ప, వ్యక్తులను ద్వేషించని మంచి మనస్తత్వం ఆమె స్వంతం" అని రచయిత్రికి గల భాషాభిమానాన్ని సమకాలీన రచయిత గండ్రకోట సూర్యనారాయణ శర్మ తన ముందుమాటలో వ్యక్త పరిచారు.

ఇది ముమ్మాటికీ నిజం. రచయిత్రితో పరిచయమున్న ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని ధృవీకరిస్తారు. ఆమెతో పరిచయం పెరిగితే మనం చేసే రచనల్లో అక్షర దోషాలు లేకుండా చూసుకోవడం అలవడుతుంది. ఆమెతో పరిచయం అందరికీ అందుబాటులో ఉండకపోవచ్చు కాబట్టే ఇలా 'అక్షర సుమాలు'గా మన ముందుకొచ్చారు.

'తెలియక కొందరు, తెలిసి కొందరు, తెలిసీతెలియక కొందరు, నిర్లక్ష్యం వల్ల కొందరు తప్పులు రాస్తున్నారు. రాసిన తప్పులన్నీ అలాగే ప్రచురితమైపోతే, రేపు అవన్నీ తప్పులతోనే పుస్తకాలుగా రూపు దిద్దుకుంటే, భావితరాలకు అందే ఈ పుస్తకాల్లో ఉన్నదే అసలైన తెలుగని, దోషభూయిష్టమైన పదాలను సరైనవిగా రేపటి పాఠకులు నేర్చునే ప్రమాదముంది. దీన్ని నివారించాలంటే ఏమి చేయాలి?' అన్న ఆమె ఆలోచన అక్షర సుమాలుగా రూపుదిద్దుకుందేమో అన్పిస్తోంది.

"ఏ యువత అయితే నవీన సాంకేతిక పరిజ్ఞానంతో తమ భావాలను తెలుగులో వ్యక్తం చేస్తున్నారో, వారందరికీ సరైన మార్గదర్శనం చేయాల్సిన ఆవశ్యకత ఇప్పుడొచ్చింది. వాక్యనిర్మాణం గురించి, విరామ చిహ్నాల గురించి, ప్రశ్నార్థ కాలు– వాటి వినియోగిత గురించి, లేదా ఉటంకింపులు గురించిన విషయాలను సోదాహరణంగా సులభగ్రాహ్యంగా తెలియజెప్పాల్సిన ఆవశ్యకత ఉంది. చెప్పదలుచుకున్న అంశం ద్వారా వ్యక్తం చేస్తున్నామనే విషయంలో ఎలాంటి వాక్య నిర్మాణం ఉండాలనే అంశాల గురించి ప్రస్తుత ఇంటర్నెట్ ఆధారిత యువతరానికి తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది." అన్న తెలంగాణా ప్రభుత్వం, భాషా సాంస్కృతిక విభాగం సంచాలకులు మామిడి హరికృష్ణ నొక్కి వక్కాణించడం ద్వారా ఈ పుస్తకం రావాల్సిన ఆవశ్యకతను గుర్తెరగవచ్చు.

ఈ పుస్తకం ఎవరినీ కించపరచదు. ఓవర్ లుక్‌లో దొర్లిపోయే అక్షర దోషాల్ని పట్టి మన ముందు పెట్టటానికి దోహదపడుతుంది. ప్రస్తుతం ఇటువంటి పుస్తకం ఆవశ్యకత ఎంతైనా ఉంది. పుస్తకం చదవడం ప్రారంభిస్తే గంటలో పూర్తి చేస్తాం. మరోగంటలో మర్చిపోకుండా ఉండాలంటే రచన చేశాక ఒకసారి ఈ పుస్తకంలోని అభ్యాసాలతో సరి చూసుకోవాలి.

ఈ పుస్తకాన్ని సులభతరమైన పద్ధతిలో రాసిన నండూరి సుందరీ నాగమణి అభినందనీయురాలు. ఎంతవరకూ మనం రాసే తప్పుల గురించేకాక డెస్క్‌టాపు, లాప్టాప్ (కంప్యూటర్లలో) లలో అందుబాటులో ఉన్న తెలుగు సాఫ్ట్ వేర్ ద్వారా తప్పులు రాకుండా ఎలా టైప్ చేయాలో కూడా కొన్ని అధ్యాయాల్లో తెలియజేయడం బాగుంది. అంతేకాకుండా కొత్తగా కథారచన చేస్తున్న వారికోసం సూచనలూ ఉన్నాయి. రచనలు ఎలా చేయాలి? కథా రచనలో ఉన్న మూడు పురుష కోణాలు ఏమిటి? వాటినెలా వాడాలి? రచయితలు అనుసరించాల్సిన విషయాలు ఏమిటి? అనేవి స్థూలంగా చర్చించడం జరిగింది.

ఈ పుస్తకంలోని అంశాలను ఆకళింపు చేసుకుని, అనుసరిస్తే, మీ రచనలు చదివాక ఎవరూ మిమ్మల్ని 'మీకు తెలుగు రాయడం వచ్చా?' అని అడగరంటే నమ్మండి.

ఇప్పుడొస్తున్న రచనల్లో ఆంగ్ల పదాలు విపరీతంగా దొర్లిపోతున్నాయి. వాటి స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. కారణం, రచన చేయాలన్న తపన ఉన్నా, భాషపై పట్టు లేకపోవడం. సహజత్వానికి దగ్గరగా ఉండాలని మేము ఇలా ఆంగ్ల పదాలు రచనల్లో చొప్పించాల్సి వస్తోందని కొందరు వాదిస్తున్నారు. అచ్చమైన తెలుగు రాస్తుంటే అర్థం కావడంలేదని మరికొందరంటున్నారు. రచయితే తెలుగు భాషపట్ల చిన్నతనం ప్రదర్శిస్తే భాష మనుగడ ఏం కావాలి? దశాబ్దాలు గడిచాక చరిత్ర పుటల్లో తెలుగు పదాలు కనుమరుగై పోతాయని మర్చిపోతే ఎలా? భాషపై పట్టు పెంచుకుందాం, అక్షర దోషాలను పరిహరిస్తూ రచనలు చేద్దామని తన వంతు ప్రయత్నంగా ఈ పుస్తకాన్ని వెలువరించిన రచయిత్రి నండూరి సుందరీ నాగమణిని అభినందిద్దాం. ■


## సాహిత్యప్రస్థానం

**చందాదారులుగా చేరండి ..**
**వివరాలకు 94900 99057 ను**
**సంప్రదించండి.**

# ముల్లు



ఒంటి మీద ఒక జత బట్టలుంటే
ఇంకోటి ఉతుకుడు బండమీద...
నాన్న టైర్ల పని చేసి అప్పు చేసాడో
బతుకు తాకట్టు పెట్టుకున్నాడో
తిన్నా తినకపోయినా తలదాచుకునేందుకు
చిన్నపాటి నీడ ఉండాలనే స్పృహ ఉన్నోడు
పూరి గుడిసె కావొచ్చు
మాగన్ను నిద్రలో ముంచెత్తే మట్టి మహల్ మాది!

వరదలొచ్చి తడిసి రాలిపోయిన గోడల పెచ్చుల్లో
కన్నాలు పడ్డ అమ్మ చేతులు స్పష్టంగా కనిపించేవి
అట్టుడుగు బతుకు పాకుడు మీద నడిచీ నడిచీ
పాచిపోయిన పాదాలు బతుకు పాఠాలు చెప్పేవి

పండగొస్తే తాటి కుంచె తీసుకుని
గోడలకు సుద్ద వేసి పేదరికాన్ని దాచి పెట్టాలనే
ఆరింద ప్రయత్నం చేసేదాన్ని!

ఇంటికి ఎడం పక్కన పొడుగాటి వరండా ఉండేది
అదే తాతయ్య పడగ్గది
మామిడితోటల్లో తిరిగి తిరిగీ
నాటు సారా తాగి తాగీ కాన్సర్‌తో మంచంలో పడితే
తాతయ్యను చంటిబిడ్డలా సాకేది అమ్మ
తినే కంచంలో రక్తం కక్కుకున్నా
తను విసుక్కోవడం నేనెప్పుడూ చూడలేదు
మనిషిని మనిషిలా చూసే కాలం కదూ అది!

గుడిసెకు ముందు భాగంలో
మరో చిన్న వరండా ఉండేది
వాస్తు ప్రకారమే కట్టారులెండి! ఆగ్నేయ మూల!
దారిద్ర్యం గాడిద తన్నులు తంతున్నా
ఈ ఆచారాల మరకలు మాత్రం మనిషిని వదిలిపోవు
నూనె సీసా, చిన్న కాగితం ముక్కలో కాసిన్ని తాలింపులు
ఉప్పు కారం.. పసుపు డబ్బాలు ఇదే వంటగది సంపద

వానలో తడిచిన కట్టెలతో పొయ్యి ఎలిగించి
గుండెలు అవిసిపోయేలా ఊదేది అమ్మ
పొగచూరిన కళ్ళల్లో పేదరికం ముళ్ళు పొడుచుకుని
కన్నీళ్ళకు బదులు రక్తం చిమ్మేవి
ఇప్పటికీ ఆ కళ్ళు నా కంటిపాపల్లో
తుపాను రేపుతూనే ఉన్నాయి

పెరుగన్నమో, పచ్చి పులుసో పేగుల ఏడుపుని కాస్త
అదిమి పట్టేది
కొట్టుడు బోరు నీళ్ళు తెచ్చి పసిబిడ్డల్లా సాకిన
పెరట్లో కూరగాయల మొక్కలు కూడా
అప్పుడప్పుడూ మద్దతు పలికేవి
కాలేజీ నుంచి ఇంటికొచ్చే తోవంతా
అమ్మ చేసిన దొండకాయ కూరతోనే గుబాళించేది

గుడిసె మధ్యలో ఒంటరి నిట్టాడుకి
చిన్న అద్దం మేకుకి వేళ్ళాడుతూ ఉండేది
నాతో పాటు చూరులో గూళ్ళు పెట్టుకున్న పిచ్చుకలు
అద్దంలో చూసుకుని మురిసిపోయే
కాసింత సంతోష సమయమది!

శ్రీదేవి, కృష్ణ, చిరంజీవి ఫొటోలతో
మా ఇంటి గోడలు రిలీజైన సినిమాలన్నీ చూసేవి
కడుపు నిండకపోయినా, కాళ్ళకి చెప్పులు లేకపోయినా
రూపాయి నోటుతో సినిమా చూసిన
నేలటిక్కెట్టు బతుకులేగా మావి
ఆ ఈలలు, అరుపుల్లో కష్టాలు
కొంత సేపైనా కనుమరుగయ్యేవి!

ఇన్ని గాయాలు, మరిన్ని పస్తుల చదరంగంలో
ఓడినట్టా జీవితాన్ని గెలిచినట్టా?
కారణమేదైతేనేం కారకులెవరైతేనేం
వర్గాలుగా, వర్ణాలుగా విడిపోయిన మనుషుల మధ్య
పేదరికమో గంప కింద కోడిపిల్ల!

**- వైష్ణవి శ్రీ**
**80742 10263**



# ఆ ఇద్దరూ ఒక్కరే ..!

- కుడుపూడి శ్రీనివాస్

చల్లటి చలి చంపేస్తుంది.

'వరాల దిబ్బ' గజగజలాడిపోతుంది. ఆ దిబ్బ మీద గుడిసెల్ని మంచు మబ్బులా కమ్మేసింది. ఆ దిబ్బ చుట్టూ తివాచీలాగా పరుచుకున్న పచ్చ పచ్చని వరిచేలు. ఆ దిబ్బకి తూర్పు దిక్కునున్న నల్లరాతి కొండలపై నుండి చూస్తే పచ్చని చేల మధ్యలో లేచిన పుట్టగొడుగుల్లా మిణుకు మిణుకుమంటాయా గుడిసెలు. ఆ నల్ల రాతి కొండల్లో రాళ్లను తెచ్చి, చెక్కిన శిల్పాల్లా ఉంటారు ఆ గుడిసెల్లో మనుషులు.

తెలతెలవరకుండానే ఆ గుడిసెల్లోని మట్టి పొయ్యిలో ఎర్రటి నిప్పు కణికలు సెగలు కక్కుతున్నాయి. తాటాకు కొప్పుల మీద నుండి పైకి లేస్తున్న పొగ, పొగ మంచులో కలిసి వెలిసి పోతోంది. ఆ తాటాకు గుడిసెల మధ్యలో బీరపాదు అల్లుకున్న 'చుట్టెగుడెసె'లో నిప్పు రాజుకోకుండానే వెచ్చని సెగలు రగులు కుంటున్నాయి.

"అబ్బా వొదులు బావా.. తెల్లారిపోనాది. వంట చేసుకోవాలి. సుబ్బరాజు గారి చేలోకి పనికి పోవాలి.బేగొదులు!" అంటా ఇష్టం లేకుండానే పక్క మీద నుండి లేవబోయింది. సుశీల కాలు మీద కాలేసి గట్టిగా అదిమి పట్టి బుగ్గ కొరికాడు సత్తికొండ. 'ఉస్సు' మని నిట్టూరుస్తూ సత్తికొండ కాలుకి తన కాలుని మెలేసింది. కోడెనాగుల్లా మెలిపడి విడివడి కిందా మీదా పడుతున్నారిద్దరూ. కాలం కరిగిపోతుంది పొగమంచుతో బాటే! తాటాకు కొప్పుల మీద కరిగిన మంచు మెల్లగా తాటాకు చూరుల్లోంచి నేలకి జారిపోతుంది. కొప్పుల మీద మంచు మొత్తం కరిగి జారి ఆవిరై పోయాక వేరు పడ్డారు ఇద్దరూ.

ఆ గుడిసె తాటాకు తడిక కన్నంలోంచి ఓ రెండు జతలు కళ్ళు పడగ ఎత్తి పండగ చేసుకుంటున్నాయన్న సంగతే వాళ్ళకి తెలీదు.

సుశీల పక్క మీదనుండి లేచి చీర సరిచేసుకుంది. పాయలు పాయలుగా విడిపోయిన నల్లటి జుట్టుని మెలి తిప్పి ముడి వేసుకుంది. మట్టి పొయ్యిలో నిప్పు రాజేసింది. సత్తికొండ మాత్రం పక్క మీద నుండి పైకి లేవలేదు. మత్తుగా మెల్లగా మళ్ళీ నిద్రలోకి జారుకున్నాడు. వంట పూర్తయ్యాక ఉడుకునీళ్ళు నెత్తి మీదనుండి పోసుకుని తల స్నానం చేసి అప్పుడే వార్చు తీసిన వేడి వేడి అన్నంలో 'లచ్చిం చారు' పోసుకుని నిప్పులు మీద కాల్చిన ఉప్పు చేపని నంజుకుని గబగబా నాలుగు ముద్దలు తినేసింది. తడారిన జుట్టుకి కొబ్బరి నూనె పట్టించి నున్నగా దువ్వి జడల్లుకుని పిరుదుల మీదకి వదిలేసింది. కాళ్ళు చేతులకి క్కూడా కొబ్బరి నూనె పట్టించి, రూపాయి కాసంత బొట్టుని నుదుటున దిద్దుకుంది. ఓసారి సత్తికొండ వంక అపురూపంగా చూసుకుని టిఫిను క్యారియర్ తీసుకుని గుడెసెలో నుండి బయటకొచ్చింది సుశీల.

"బావో.. కూడు కిందే ఉంది. ఏ కుక్కో చూసిందంటే గుటుక్కున మింగెత్తాది. లేచి ఆ తడిక దగ్గిరికి కట్టుకో. ఆ రేషను షాపు డీలరు కిట్ట మూర్తి గారు నిన్న కన్పించి ఇయాల బియ్యం లోడు వొత్తదాని చెప్పేడు. ఊళ్లోకి పో ఓపాలి. వొచ్చిన డబ్బులన్నీ తాగేమాక, వొళ్ళుఇల్లు రెండూ గుల్లయిపోతాయి" గుడిసె ముందు నిలబడి గట్టిగా అరిచి చెప్పి డొంక దారిలోకి తిరిగింది సుశీల. సత్తి కొండ నిద్ర లేచి చూరు కింద కొచ్చి సుశీల వైపు ఆపేక్షగా చూశేడు. పాలీషు చేసిన నల్ల రాతి బొమ్మలా మెరిసిపోతూ కదిలెళ్ళిపోతుంది ఆ మనిషి.

"ఆ సుబ్బరాజు గారి కళ్ళు అసలే మంచివి కావు.. ఆయనికి కొంచెం ఎడంగా మసులుకోమని చెప్పాలి ఈపాలి!" స్వగతంగా అనుకుని తడిక దగ్గరకి లాక్కున్నాడు సత్తికొండ.

'వరాల దిబ్బ' కుడి పక్కన నల్లరాతి కొండలుంటే ఎడం పక్కకి ఉంటుంది ఏటిగట్టు. ఏటి గట్టెక్కి ఎడం చేతి వైపుకి ఓ కిలోమీటరు నడిస్తే ఆ ఏటిగట్టు దిగువులో ఉంటాది సత్తిరాజు గారి మకాం. ఏటిగట్టుని ఆనుకుని ఉన్న ఐదెకరాల కొబ్బరి తోట, ఆ తోట దిబ్బకి ఆనుకుని ఉన్న పాతిక ఎకరాల 'ఏక చెక్క' వరిచేలు సుబ్బరాజు గారివే. కొబ్బరి తోటలోపల చేలకి చేర్చి

కట్టిన రెండు గదుల పెకుంటి శాల. ఒకగది ధాన్యపు గాదె, ఇంకో గది రాజు గారు సేద తీరడానికి వాడుతుంటారు. పనుల రోజుల్లో ఆ పెంకుటిశాల అరుగుమీద, పడక కుర్చీలో దిలాశాగా కూర్చుని పనోళ్ల మీద అజమాయిషీ చేస్తుంటాడాయన. ఆ పెంకుటి శాలకి కాస్త ఎడంగా గొడ్ల సావిడి ఉంటుంది. ఆ గొడ్ల సావిడిలోనే పనోళ్ళు టిఫిను క్యారియర్లు తగిలించుకుంటారు.

కిందా మీద పడతా సుశీల వొచ్చేసరికి మిగతా పనోళ్ళు చేలల్లోకి దిగిపోయారు. సుశీలని గుడ్లురిమి చూసేడు సుబ్బరాజు. పిల్లి కళ్ళల్లో పడ్డ ఎలుక పిల్లలా నక్కి నక్కి దొడ్ల సావిడిలోకి వెళ్లి చూరుకి టిఫిను క్యారియర్ తగిలించింది సుశీల. చీర అంచుని మోకాళ్ళ పైకి లేపి వెనక్కి మడిచి కచ్చా పోసుకుంది. చీర చెంగుని భుజం మీదగా లాగి నడుం చుట్టూ తిప్పి నాభి కిందున్న చీర కుచ్చిళ్లలో దోపుకుని సావిట్లోనుంచి బయటకొచ్చింది. సుశీల మీద సుబ్బరాజు కళ్ళు పడ్డాయ్. నోరు చప్పరిస్తా చిన్నగా చిటికెలేశాడు.

■■■

సుశీల చేలల్లోనుండి ఇంటికొచ్చేసరికి పూటుగా తాగేసిన సత్తికొండ పాక బయటే మట్టిలో పొర్లుతున్నాడు. ఎవర్నో ఇష్టం వొచ్చినట్టు తిట్టుకుంటా మాటిమాటికి పిడికిలి బిగిస్తున్నాడు. సుశీలని చూడగానే కొంచెం నిమ్మళించాడు. వాకిట్లోనుండి పైకి లేచి బట్టలకి అంటుకున్న దుమ్ము దులుపుకున్నాడు. పైకి లేచి నిలబడ లేక తెరచాప ఊగినట్టు ఊగిపోయాడు.

"ఒసేయ్ సుశే.. ఇంకెప్పుడూ కిట్టమూర్తి గాడి పనికెళ్ళమని చెప్పమాకు. ఆడొట్టి దొంగ నా కొడుకు. టాట్రు లోడు దింపించి వొంద రూపాయలు చేతిలో పెట్టేడు దొంగ నా కొడుకు. ఇదేంటని అడిగితే 'నీ పెళ్ళాన్ని ఎక్కడైనా తాకట్టు ఎడితే ఇంకా ఎక్కువ డబ్బులొత్తాయి' అన్నాడు ముండా నాయాల. అప్పుడే గనక ఈ చుక్క యేసుంటే ఆడి పేగులు తీసి మెళ్ళో యేసుకుందును నా యాల్డి!" చుక్క ఎక్కువైపోయి నాలిక మెలిపడి నంగి నంగిగా మాట్లాడుతున్నాడు సత్తికొండ.

పోట్లగిత్తలా సత్తికొండ మీదకి ఉరికింది సుశీల.

"ఛీ.. నీ బతుకు పాడు గానూ! నీవు మారవేంట్రా? రేపొద్దున్న ఏ పిల్లో జెల్లో పుడితే ఆళ్ళని ఎట్టా సాకు దామనుకుంటున్నావ్. యెల్ల కాలం నా రెక్కల కష్టంతో పెంచి పోసిత్తాను అనుకుంటున్నావేమో. నాగ్గాని తిక్క లేచిందంటే ఏదో ఓ రోజు నిన్ను ఇడిచేసి పోతాను." సత్తికొండ చొక్కా పట్టుకుని తెగ ఊపేసింది సుశీల. సత్తికొండ తల వాలిపోయింది. నెత్తికెక్కిన కిక్కు దిగిపోయింది. గమ్మున పాకలోకెళ్ళి ఓ మూలాన కూర్చున్నాడు. సుశీల కాసేపు చిరుబుర్రులాడి పొయ్యిలో నిప్పు రాజేసింది. వాళ్ళిద్దరికీ అది నిత్యకృత్యం. అడెంత తాగినా సత్తికొండ మీద వీసమెత్తు ప్రేమ కూడా తగ్గదు సుశీలకి. సుశీల ఎన్నేసి మాటాలన్నా ఆవగింజంతైనా కోపం రాదు సత్తికొండకి.

■■■

తెల తెలవారుతుండగా సుశీల మీద చెయ్యేసేడు సత్తికొండ. సత్తికొండ వైపుకి తిరిగి దగ్గరకి లాక్కుంది సుశీల. సత్తికొండ బాధగా మూల్గాడు. "ఏమయ్యింది బావా.. " అతడి వళ్ళంతా తడిమి చూస్తూ అడిగింది సుశీల.

"ఏమోనే కాళ్ళు చేతులు గుంజుతున్నాయ్. కళ్ళు తిరిగి పోతున్నాయి. బుర్ర పగిలిపోతున్నట్టుందే సుశే" అంటా చిన్న పిల్లాడిలా గట్టిగా కరుచుకుపోయాడు సత్తికొండ. కాసేపు అతణ్ణి అలాగే పొదివి పట్టుకుని, మెల్లగా పక్క మీద నుండి పైకి లేచింది. కొబ్బరి నూనె తెచ్చి సత్తికొండ కాళ్ళకి చేతులకి తలకి మర్ధనా చేసింది. మెల్లగా నిద్రలోకి జారుకున్నాడు. వెలుగు రేఖలు విచ్చుకున్నాక ఏటిగట్టు అవతలున్న ఊళ్ళోకెళ్లి ఆరెంపీని పిలుచుకొచ్చింది. సత్తికొండ నాడి పట్టి చూశాడు డాక్టరు. బలానికి మందులు రాసిచ్చాడు. నాల్రోజులు వాడితే తగ్గిపొద్దన్నాడు.

మందు బిళ్ళలు కోసం ఊళ్లోకి పోయింది సుశీల. ఏటుగట్టెక్కి ఎడంపక్కకి నాలుగు అడుగులేచి చెక్కల వంతెన ఎక్కి దిగితే ఆవల పక్కనుంటుంది ఊరు. మందులు షాపు దగ్గర సుబ్బరాజు గారబ్బాయి కన్నబాబు కనిపించాడు. పాతికేళ్ల కుర్రాడు. సంగతేంటో తెలుసుకుని డబ్బులు తీసుకోకుండా మందు బిళ్ళలు ఇప్పించాడు. సుశీల ఒద్దంటున్నా ఖర్చులకి ఉంచమని ఓ వొంద కాగితం బలవంతగా ఆమె చేతిలో పెట్టాడు. కన్నబాబుకి చేతులెత్తి దణ్ణమెట్టింది సుశీల. కన్న బాబు మల్లెపువ్వు విరిచినట్టు మెత్తగా నవ్వేడు. 'తోడేలు కడుపున గంగి గోవు పుట్టింది'అనుకుంటా చెక్కల వంతెన దాటి వరాల దిబ్బ వైపు కదిలిపోయింది సుశీల.

సత్తికొండ రెండ్రోజులు మందులు వాడినా కాళ్ళు చేతులు గుంజడం తగ్గలేదు. తలపోటు సమ్మెట దెబ్బలా ప్రాణాలు తోడేస్తుంది. కంటి చూపుకూడా మందగించింది. ఇంతక ముందంత హుషారుగా లేచి నడవలేకపోతున్నాడు. మాట తడబడుతుంది. సుశీల పని మానేసి ఇంట్లోనే వుంటూ సత్తికొండకి కాపు కాస్తూ కూర్చుంది. రోజూ కొబ్బరి నూనె తో మర్దనా చేస్తూనే ఉంది. ఏవేవో ఆకు పసర్లు పూస్తూనే ఉంది. ఆరెంపీ వొచ్చి పోతూనే ఉన్నాడు. ఓ రోజు పొద్దున్నే కాలు మడుచుకోడానికి బయటకొచ్చిన సత్తికొండ ఉన్నట్టుండి కుప్ప కూలిపోయాడు. ఒళ్ళంతా కర్రలా బిగుసుకుపోయింది. మూతి వంకర పోయింది. పంచలో అంట్ల గిన్నెలు తోముతున్న సుశీల దబ్బున గావు కేక పెట్టుకుంటా సత్తికొండ మీద పడిపోయింది. పక్క గుడిసెల్లోని జనం కాకుల్లా వాలిపోయారు. ఆటో కట్టించి టౌన్ సర్కారు ఆసుపత్రికి తీసుకుపోయారు. అన్ని పరీక్షలు చేసి పక్షవాతం అని తేల్చేసారు డాక్టర్లు. ఎడం చెయ్యి కాలు సచ్చుబడిపోయాయి. మెదడులో ఓ చోట రక్తం గడ్డకట్టిందంట. చిన్నవయసే కాబట్టి మందులు వాడితే కొద్దోగొప్పో నయమవొచ్చన్నారు. మళ్ళీ మందు తాగితే కష్టమన్నారు. ఓ పదిరోజులు వైద్యం చేసి, కాళ్ళు చేతులూ ఆడిస్తూ ఉండమని చెప్పి కొన్ని మందు బిళ్ళలు ఇచ్చి ఇంటికి పంపించేశారు.

సత్తికొండని గుడిసెకి తీసుకొచ్చాక ఓ నెలరోజులు పాటు ఎక్కడికి కదల్లేదు సుశీల. అన్నీ తానై చిన్న పిల్లాడ్ని చూసుకున్నట్టు కంటికి రెప్పలా చూసుకుంది. పనికి వెళ్లక రోజు రోజుకీ, రోజు గడవడమే కష్టమైపోయింది. రోజులు గడుస్తున్నా సత్తికొండలో ఎలాంటి గుణం కనిపించలేదు. ఏదో పనుండి ఊళ్ళో కెళితే ఆరెంపీ కనిపించాడు. టౌన్‌లో స్పెషలిస్ట్ ఆసుపత్రి పేరు చెప్పి అక్కడికి పోతే నయమవొచ్చని చెప్పేడు. కాకపోతే పాతిక వేలు వరకూ అవ్వొచ్చన్నాడు. సుశీలకి గూండాగిపోయినంత పనైపోయింది. ఆ తాటాకుల గుడిసె అమ్మేస్తే అన్ని డబ్బులు రావు. అది కూడా అమ్మేస్తే ఈ అవిటి మనిషిని పెట్టుకుని ఏ చెట్టుకిందో పుట్టలోనో కపరమెట్టాల్సిందే అనుకుంది.

కాస్సేపు అలోచించి ఆ ఆరెంపీ డాక్టరు గారే సలహా ఇచ్చేరు.

"నీ గుడిసె పత్రాలు తాకట్టు పెడితే ఓ పదిహేను వేలు వరకూ రావొచ్చు. అలా అప్పిచ్చే నాధుడు మన ఊళ్ళో సుబ్బరాజు గారొక్కరే ఉన్నారు. కాకపోతే ఆయన అన్ని డబ్బులు ఇవ్వక పోవొచ్చు. బతిమాలితేనో బామాలితేనో  ఇవ్వొచ్చు. కానీ నెల నెలా నూటికి ఐదు రూపాయల వడ్డీ మాత్రం కచ్చితంగా జమ చేయాల్సిందే!" అన్నాడు.

సుశీల సుబ్బరాజు గారింటికి వెళ్ళింది. అతడు వరండాలో కూర్చుని పేపరు తిరగేస్తున్నాడు. సుశీలని చూడగానే తలెత్తి మాట్లాడకుండానే 'ఏంటీ?!' అని కళ్ళు ఎగరేశాడు. సుశీల విషయం చెప్పింది. సాయం అడిగింది. సుశీల వంక గీరగా చూశేడు.

ఇదే అదనని లోలోపల ఆనంద పడిపోయాడు. "ఏంటీ ఆ గుడిసెకి పదిహేను వేలు ఇవ్వాలా.. ఎలా కనిపిత్తన్నానే నీ కంటికి" అంటూ బెట్టు చేశాడు. సుశీల చేతులెత్తి దణ్ణమెట్టింది. నెల నెలా వడ్డీ కట్టేస్తూ అసలు మెల్లమెల్లగా తీర్చేస్తానంది.

"సర్లే.. అవన్నీ వదిలేయ్ గానీ, నీవడిగిన పదిహేను కాదు ఇరవై వేలు ఇస్తాను. వడ్డీ మామూలే. కాకపోతే నేను డబ్బిచ్చేది గుడెసెని చూసికాదు నిన్ను చూసి! నేను కబురు పెట్టినప్పుడు పొలానికి రావాల. నా కష్ట సుఖాలన్నీ కనిపెట్టుకుని ఉండాల" నర్మగర్భంగా మాట్లాడాడు. సుశీల అతడి ముఖంలోకి తీక్షణంగా చూసింది. ముసిముసి నవ్వులు నవ్వేడు. సుశీల కళ్ళలో కన్నీళు ్లు గిరుక్కున తిరిగాయి. యధాలాపంగా వీధి గుమ్మంలోకొచ్చిన కన్నబాబు వాళ్ళ నాన్న మాటలు విని ముఖం చిట్లించి దొడ్డి గుమ్మం వైపు వెళ్ళిపోయాడు. సుశీల గిరుక్కున వెనక్కి తిరిగేసింది.

సత్తికొండకి టౌన్ ఆసుపత్రి సంగతి చెప్పి, అసలు సంగతి చెబితే బాధ పడతాడని, సుబ్బరాజు గార్ని డబ్బులడిగితే కొన్నాళు ్ళ ఆగి సర్దుబాటు చేస్తానన్నారని అబద్ధం చెప్పింది.

■■■

సత్తికొండకి అవసరమైనవన్నీ దగ్గర పెట్టేసి, ఊత కర్ర ఒకటి పక్కనే పెట్టి రోజు విడవకుండా ఏదో ఓ పనికి పోతుంది సుశీల.ఆ రోజునుండి సుబ్బరాజు గారి పొలాల వైపు కన్నెత్తయినా చూడ్డం లేదు.

రోజులు గడుస్తూనే ఉన్నాయి. చలి తగ్గ ముఖం పట్టింది. మెల్లగా ఎండలు వేడెక్కుతున్నాయి. చేలల్లో వరికంకులు ఏపుగా పెరిగి బంగారు రంగు తిరిగి నిండు ముత్తైదువుల్లా కళకళ లాడుతున్నాయి. ఓ రోజు సుబ్బరాజు గారి పాలేరు మాతయ్య వొచ్చి గుడిసె ముందు తచ్చాడుతుంటే బయటకొచ్చింది సుశీల.

"ఏంటీ సంగతి మావ?!" అంటూ ఆరా తీసింది.

"సుబ్బరాజు గారి అబ్బాయి కన్నబాబు గారు ఓ పాలి వొచ్చి కలవమన్నాడే బుల్లి" అన్నాడు.

"ఎందుకే మావ" అనడిగింది సుశీల.

"సుబ్బరాజు గారికి సుస్తీ సేసి పొలం రాడం లేదు. కన్నబాబు గారే అన్నీ చూసుకుంటున్నారు. నీకు ఇట్టమైతే పొలం లోకొచ్చి పని చేసుకోమంటున్నారే. సత్తికొండ బతికించుకోమంటున్నాడే బుల్లి" అన్నాడు మాతయ్య. కన్నబాబుతో అయితే పెద్దగా ఇబ్బంది ఉండదు కాబట్టి 'వస్తానని' చెప్పమంది సుశీల.

వరి కోతలు మొదలయ్యాయి. సుశీల సుబ్బరాజు గారి పొలంలోకి పనికెళ్తుంది. సుబ్బరాజుగారిలా కాకుండా కన్నబాబు పనోళ్ళని నవ్వుతూ పలకరిస్తున్నాడు. కష్ట సుఖాలు అడిగి తెలుసుకుంటున్నాడు. సుశీలని కూడా అడిగేడు,

'సత్తికొండకి' ఎలా ఉందని! "అలాగే ఉంది "బాబుగారూ.. ఆరెంపీ డాట్రు గారు టౌన్‌లో ఏదో ఆసుపత్రి పేరు చెప్పేరు. అక్కడికెళ్తే నయమవ్వొచ్చు అంట. డబ్బులుండాలి కదా బాబూ. నేను కష్టం చేసి దాచినవి పదేలు వొరకూ ఉన్నాయి. ఇంకో పదిహేను దాకా సర్దుబాటు చేసుకోవాలి" అని భారంగా నిట్టూర్చింది సుశీల. కన్నబాబు కాస్సేపు తల పైకెత్తి ఆలోచనలో పడ్డాడు. "సర్లే...ఆ మిగిలిన డబ్బులేవో నేను సర్దుబాటు చేస్తాలే గానీ, ముందా సత్తికొండని ఆసుపత్రికి తీస్కెళ్ళి చూపియ్" అన్నాడు. సుశీల నమ్మలేకపోయింది. చేతులెత్తి దణ్ణమెట్టింది. 'నీవు దేవుడివి సామీ' అనుకుంది మనసులో. వరి కోతలై పోయాయి. అయినా కూడా పొలంలో ఏదో ఓ పని చెప్తానే ఉన్నాడు కన్నబాబు. ఒంట్లో కొంచెం కుదుటపడ్డాక అప్పుడప్పుడు పొలం వొస్తున్నారు సుబ్బరాజు గారు. ఆయన్ని చూసీ చూడనట్టు తన పని తాను చేసుకుపోతుందామె.

■■■

ఆ రోజు ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తుంది వర్షం. "పనికి ఎల్లొద్దే ఈయాల" అన్నాడు సత్తికొండ. "మాతయ్య మాయ ఏదో పనుండి టౌన్‌కి ఎల్తాడంట బావా. గొడ్ల కాద బాగుచెయ్యాలంట. నీళ్ళు పెట్టాలి. దాణా పెట్టి గడ్డేయ్యాలి. పెందలాడే వొచ్చేత్తాలే బావా" అంటా బయల్దేరింది సుశీల. వాన ఆగకుండా కురుస్తానే ఉంది. మెల్లగా సందె చీకట్లు కమ్ముకున్నాయి. సుశీల గుడిసెకి రాకపోయేసరికి సత్తికొండలో సన్నగా మొదలైంది భయం.

'వర్షం తగ్గాక వత్తుందిలే' అనుకున్నాడు. దీపం పెట్టే మనిషి లేక గుడిసె అంతా చీకటి కమ్ముకుంది. చీకటి చిక్కబడేకొద్దీ

సత్తికొండ గుండెల్లో గాబరాతో బాటే, కడుపులో పేగులు ఆకలితో మెలి తిరిగిపోతున్నాయి. గుడిసె చుట్టుపక్కల గుడిసెల్లో దీపాలన్నీ ఆరిపోయాక పడతా లేస్తా గుడిసె కొచ్చింది సుశీల. సత్తికొండ గుండె కాస్త కుదుట పడింది. గుడిసెలో దీపం వెలిగించిందామె. మనిషి తడిసి ముద్దైపోయింది. నుదుటున ఉన్న రూపాయి కాసంత తిలకం బొట్టు వాన నీళ్లల్లో కరిగి ముక్కుమీదగా జారిపోతుంది. కళ్ళు నీరసంతో మూతలు పడుతున్నాయి. తడిబట్టలు విప్పేసి పొడిబట్టలు కట్టుకుని నిస్సత్తువుగా అతుకుల బొంతమీద కూలబడిపోయింది.

"ఏమయ్యిందే" అనడిగాడు సత్తికొండ.

"కొంచెం నీరసంగా ఉంది బావా" అంది తప్ప ఇంకేం మాట్లాడలేదామె. కాస్సేపయ్యాక బలవంతంగా పైకి లేచి నాలుగు గింజలు వండి వార్చి 'లచ్చిం చారు' పోసి సత్తికొండకి భోజనం వడ్డించింది. తను మాత్రం తినలేదు. సత్తికొండ అడిగితే ఆకలిగా లేదు బావా అంటా పక్క మీదకి చేరిపోయింది. ఆ రాత్రంతా సుశీల ఒళ్ళు నిప్పుల కొలిమిలా కాలిపోతూనే ఉంది. నిద్రలో ఏదో పలవరిస్తూ ఉలికి ఉలికి పడింది. సత్తికొండకి ఏమీ చేయాలో పాలుబోలేదు. కంటిమీద కునుకు లేకుండా ఆమెని కాపు కాస్తూనే కూర్చున్నాడు. తెల్లగా తెల్లారక ఆమె ఒళ్ళు కాస్త చల్లబడింది. ఆ రోజు పనికి పోలేదు సుశీల. రెండో రోజు మాతయ్య గుడిసె దగ్గరకొచ్చాడు.

"ఏమైందే బుల్లీ.. నిన్న పనికి రాలేదు" అని ఆరా తీసేడు.

"ఒంట్లో నలతగా ఉంది మావ. ఇయాల కూడా రాలేను. రేపటి నుండి పనికొత్తానని చెప్పు బాబుగారికి!" అని చెప్పి మాతయ్యని పంపించేసింది. మూడో రోజు సుబ్బరాజు గారి పొలానికి వెళ్ళింది సుశీల. కన్నబాబు పదిహేను వేలు తీసుకొచ్చి ఆమె చేతిలో పెట్టాడు. వీలు కుదిరినప్పుడు అసలు కొద్ది కొద్దిగా జమ చేయమని చెప్పి, వడ్డీ అవసరం లేదులే అని చెప్పి మల్లి పువ్వు విరిచినట్టు మెత్తగా నవ్వేడు.

ఓ రెండ్రోజులాగి సత్తికొండని టౌన్ ఆసుపత్రికి తీసుకెళ్లింది సుశీల. డబ్బులు కట్టించుకుని ఆసుపత్రిలో ఓ పదిరోజుల పాటు వైద్యం చేశారు డాక్టర్లు. సత్తికొండ వంట్లో కాస్త మార్పు వొచ్చింది. కాలు చెయ్యి మెల్లగా తన ఆధీనంలోకి వస్తున్నట్టు అనిపించింది సత్తికొండకి. సుశీల మోహంలో వెలుగు రేఖలు విచ్చుకున్నాయి.

"సుబ్బరాజు గారు నిజంగా దేవుడే" అన్నాడు సత్తికొండ. నిరాసక్తంగా ఓ నవ్వు నవ్వి ఊరుకుంది సుశీల. నెలకి సరిపడా మందులు తీసుకుని ఆసుపత్రి నుండి ఇంటికొచ్చేసారు.

మందులు వాడే కొద్దీ సత్తికొండలో మునుపటి పటుత్వం మళ్ళీ చిక్కినట్టుగా అనిపిస్తుంది. సుశీలని ఆసరా చేసుకుని మెల్లగా లేచి నడవడం మొదలెట్టాడు. ఎడం చేతి పిడికిలి ఉరామరిగా బిగిచుకుంటుంది. సత్తికొండ మళ్ళీ మామూలు మనిషి అవుతాడన్న ధైర్యం సుశీలకి వొచ్చింది. తను యధావిధిగా రోజూ సుబ్బరాజు గారి పొలంలోకి పనికెళ్లి వొస్తుంది. కాకపోతే మనిషిలో మునుపటి ఉత్సాహం హుషారు మాత్రం మాయమైపోయాయి.

■■■

ఆ రోజు నిండు పున్నమి రోజు. తాటాకు చూరుల్లోంచి వెన్నెల వెలుగు గుడిసెలోకి జొరబడి గుడిసె అంతా అలుముకుంది. ఎగిసి ఎగిసి పడుతున్న లాంతరు వెలుగు వెన్నెల వెలుగుతో పోటీ పడుతూంది. ఆ సమ్మిళిత వెలుగులో సుశీల కొండపల్లి బొమ్మలా మెరిసిపోతుంది. సత్తికొండ మెల్లగా సుశీల పక్కలోకి జేరేడు. "దీపం తీసేత్తా బావా" అంది సుశీల.

"ఉండనివ్వే.. నిన్ను తనివితీరా సూసుకుని ఎన్నాళ్ళయిందో. ఇయ్యాల నా కళ్ళు పండగ చేసుకోవాలా" అంటా ఆమెని మరింత దగ్గరకి లాక్కున్నాడు సత్తికొండ. సుశీల కాదనలేదు. అలాగని ఇంతకముందులా అతడి మీదకి ఎగబడలేదు. సత్తికొండ విసురుగా ఆమె చీరని లాగి మూలకి విసిరేశాడు. గబుక్కున చేతుల్ని అడ్డం పెట్టుకుని గుండెల్ని దాచుకుంది. సత్తికొండ ఊరుకోలేదు. నవ్వతా ఆమె మీదకి చేరి చేతుల్ని మోకాళ్ళతో తొక్కి పెట్టాడు. కాళ్లల్లో బలం సరిపోవడం లేదు. అతి కష్టం మీద రవిక గుండీల్ని విప్పదీచి రొమ్ముల్ని ముద్దాడబోయాడు. సుశీల కళ్ళు మూసుకుంది, తన్మయత్వంతో కాదు, భయంతో! సత్తికొండ ముద్దాడ లేదు.

దిగ్గున ఆమె మీదనుండి పైకి లేచి కిందకి పడబోయి తమాయించుకున్నాడు. పడుతూ లేస్తూ వెళ్లి లాంతరు తెచ్చి ఆమె గుండెల దగ్గర ఆనించాడు. ఆ ఎర్రటి వెలుగులో ఎండ పొడ సోకని తేనే రంగు స్తన ద్వయం మీద నల్లటి గాట్లు చంద్రుడిలో నల్లటి మచ్చల్లా తళుక్కుమన్నాయి. సత్తికొండ గుండాగిపోయింది. కళ్ళు ఎర్ర చింత నిప్పులైనాయి. కోపం కట్టలు తెంచుకుంది. "ఏంటే ఇది! ఎవడి పక్కన తొంగున్నావే సన్నాసిదాన. ఈ అవిటోడు నీకు పనికిరాకుండా పోయేడెంటే?! ఇన్నాళ్లు నిన్ను నా దేవతనుకున్నాను కదే. ఏ పాపిష్టి సొమ్ము తీసుకొచ్చి నన్ను సాకుతున్నావే సిగ్గులేనిదానా. తినే కూడులో ఇషమెట్టి చంపియ్యే. నా పీడ ఇరగడైపోద్ది" అనేసి తల బాదుకున్నాడు. ఉండేలు దెబ్బ తిన్న కాకిలా విలవిల్లాడిపోయింది సుశీల.

దుఃఖం పొంగుకొచ్చింది. కళ్ళల్లో కన్నీళ్లు ధార కట్టాయి. గొంతు గాద్గధికమైంది.

"నీకు దణ్ణమెడతా బావా. నన్ను నమ్మే. నేనేం తప్పు చేయలేదే. నిన్ను సూసుకుంటా నా మానాన నేను బతుకుతుంటే ఓ పిచ్చికుక్క ఎప్పుడు కన్నేసిందో గానీ, నా మీదకి ఎగబడి నా మానాన్ని చిందర వందర చేసిందే. బతుకుని బుగ్గి పాలుచేసింది. నన్ను బతికున్న పీనుగుని చేసిందే" అంటూ ఒక్కసారిగా గొల్లుమంది.

"ఎవడే ఆ సుబ్బరాజు గాడేనా?! ఆడయ్యా.. నేనెప్పుడో అనుకున్నాను ఆడిలాంటి పని సేత్తాడని! ఆడి అంతు సుత్తానియాల" అంటా ఊతకర్ర ఆసరా చేసుకుని బలవంతంగా పైకి లేచి నిలబడ్డాడు సత్తికొండ.

"ఆడు కాదే.. ఆడి కొడుకు కన్నబాబు గాడు. మేక తోలు

కప్పుకున్న తోడేలు ఆడు. తోడేలు కడుపున గంగిగోవు పుట్టిద్దనుకోడం నా తప్పే బావా" అంటా పిచ్చి పట్టిన దానిలా తల బాదుకుంది. సత్తికొండ నిట్ట నిలువునా కుప్పకూలిపోయాడు.

గొంతు మూగబోయి నోట మాట పడిపోయింది.

"నీకు మొన్న నిజం చెప్పలేదు బావా. నీ వైజ్ఞానికి డబ్బిచ్చింది సుబ్బరాజు గారు కాదు.. కన్నబాబే. ఆ సచ్చినోడు నా మీద ఎప్పుడు కన్నేసేడో గానీ.. మంచోడిలా నటించేడు. ఆ వాన పడ్డ రేత్రి గొడ్ల సావిడ్లో గేదెలకి గడ్డేస్తుంటే వెనకండి వొచ్చి కొండ పాములా చుట్టేసుకున్నాడు నన్ను. ఆడి పశుబలం ముందు నా బలం సరిపోలేదే. ఆ గొడ్లసావిడిలోనే నన్ను తొక్కిపెట్టి ఊపిరాడనివ్వలేదు ఆడు. నా అవసరం ఆడికి ఆసరా అయ్యింది బావా. అదే అవసరం ఆ రేత్రి నన్ను బతికున్న పీనుగుని చేసిందే" వెక్కిళ్లు పెడతా తల నేలకేసి బాదుకుంది. సత్తికొండ తల నేలకి వాలిపోయింది. కోపం ఆవిరైపోయి కన్నీళ్లు కట్టలు తెంచుకుంది.

చిన్నపిల్లాడిలా ఏడ్చేశాడు. అతడ్ని అలా చూసి విలవిల్లాడి పోయింది సుశీల.

"నన్ను మన్నించు బావా" అంటూ లేడి పిల్లలా పైకి లేచింది. తలొంచుకునే ఉన్నాడు సత్తికొండ. కిరోసిన్ వాసన గుప్పుమంది. దిగ్గున తలెత్తాడు సత్తికొండ. ఒళ్ళంతా కిరోసిన్‌తో తడిసి ముద్దయిపోయుందామె.

విసురుగా లాంతరు వైపు కదులుతున్న సుశీల మీదకి సింహంలా ఉరికాడు సత్తికొండ. కోపంతో కుడి చేత్తో ఆమె గొంతు బిగించి పట్టుకున్నాడు.

ఊపిరాడక విలవిల్లాడిపోయిందామె. పట్టు సడలించాడు. ఆ మరుక్షణమే ఆమెని ఆపేక్షగా బాహువుల్లోకి తీసుకున్నాడు. "ఏం సేత్తున్నావే పిచ్చి ముండా.. సచ్చిపోతావా? నీవు పొతే, నేను మాత్రం బతికుంటాననుకున్నా? సచ్చి ఏం సాదిత్తమే. బతికుండి సాదించాలి ఏమైనా. నీవేం తప్పు చేసేవని చావలే? ఎవడో మదమెక్కి పిచ్చికుక్కలా నీ మీద పడితే, నీ తప్పేలా అవుతుందే. పిచ్చి మొహం దానా. నన్ను వదిలేచి ఎళ్ళిపోకే. నన్ను అనాధని చేయకే!" అంటా ఆమె గుండెల్లో తల దాచుకుంటా వెక్కివెక్కి ఏడ్చేశాడు. సుశీల కూడా సత్తికొండని తనలోకి మరింత పొదువుకుని గుండెల్లో గుది కట్టిన బాధంతా కరిగి కన్నీరై జారిపోయేవరకూ ఏడుస్తూనే ఉంది.

గుడిసె బయట తడిక కన్నంలోంచి అలవాటుగా ఆత్రంగా ఆబగా చూస్తున్న రెండు జతలు కళ్ళు మాత్రం నోరెళ్ళబెట్టి మొహ మొహాలు చూసుకున్నాయ్ ఆ క్షణం. ఏదో రహస్యాన్ని చేధించినట్టు ఆనందంతో మెరిసిపోయాయి.

అయినా కూడా ఆ కళ్ళు వాళ్ళిద్దర్నీ ఏమీ చేయలేవు.

అవ్వే కాదు కొన్ని వేల జతల కళ్ళు కలిసినా వాళ్ళనిప్పుడు ఏం చేయలేవు.

ఎందుకంటే వాళ్లిప్పుడు ఇద్దరు కాదు... ఒక్కరే! ■

## నీలకురింజి సముద్రం

నీ భుజం మీదకెక్కి
లోకాన్ని చూసిన దృశ్యం
నా గెవనంలో లేదు నాన్నా...
మా అమ్మో నాయనమ్మో
చెబితే తప్ప తెలియలేదు
ఊహ తెలిశాక లోకం చూశాక
నీకు నాకు మధ్య తెలీని దూరం
అయినా నిన్ను చూస్తూనే పెరిగాను కదూ!

నీ జేబుకు చిల్లుపడ్డాక కూడా
నీ వేలి ఉంగరం మరెవరికో
అక్కర తీర్చిందని తెలిశాక
మా నాన్నంటే యెంత గర్వమో!

రాజకీయమద పొట్టేళ్లు కొన్ని
నీ హోదాను ఢీకొని కొమ్ములు విరగ్గొట్టుకున్నాక
'నువ్వు శానా గట్టోనివప్పో...'
మాటలో విరుపు పొగడ్తనో తెగడ్తనో
చెప్పకనే చెబుతుంది.
ఆ మాటకు ముందో వెనుకో
వో జాతీయమో, మరో విశేషణమో
వెక్కిరించినట్టు వినపడుతూనే వుంటుంది.
వాళ్ళ వెటకారాలకేం గానీ
వాళ్ళెంత తలెత్తి చూసినా
ఆ చూపులకందుతావా నువ్వు?

నీ వ్యక్తిత్వం
అరుదైన నీలకురింజి నగం!
నీ హృదయం
లోతెంతో తెలియని నీలాల సాగరం!


"నీ బిడ్డంతా నీ తిన్ననేనప్పా,
మాటా మనిషీ..." అంటూ
నీ నేస్తుల మెచ్చుకోళ్లు విన్నప్పుడు
నీ ముఖంలో మెరుపు...

వాళ్ళ అమాయకత్వం గానీ
నేను నువ్వెలా అవుతాను?
నువ్వో నీలకురింజి సముద్రం
నేనో చిన్ని నీలలోహిత సుమాన్ని మటుకే!

**- ప్రగతి**

# కన్నడ సంస్కృతి దర్పణం మైసూరు

- డాక్టర్ నాగసూరి వేణుగోపాల్
94407 32392



శ్రీరంగపట్నం వద్ద కావేరి నదీతీరం

**పుస్తకాలు జ్ఞానాన్ని ఇస్తాయి, మానవ స్పందనలను ద్విగుణీకృతం చేస్తాయి! ఆలోచనలు, చర్చలు అంతర్గత కోణాలను బట్టబయలు చేసే అవకాశం ఉంది! అయితే పర్యటనలు, ప్రత్యక్ష అనుభవాలు కల్పించే వెసులుబాట్లు అదనంగా చాలా వుంటాయి. పుస్తకాలు వ్యక్తుల ఆలోచనలకు ఆనవాళ్ళు కనుక, సదరు రచయిత చూసిన లేదా వ్యక్తపరచిన విషయాలను, ఆలోచనలను పాఠకులు తమ అనుభవం, ఆసక్తి, ఊహ ఆధారంగా అందుకోవడం తప్పనిసరి. అందు వల్ల అర్థం కాని, బయటకు కనబడని పరిమితులు ఎన్నో ఏర్పడతాయి. ఇవి వ్యక్తికీ వ్యక్తికీ పూర్తిగా కూడా మారవచ్చు. కనుకనే జ్ఞానంతో కూడిన అనుభవం చాలా ఉత్తమమైనది!**

మిగతా వాళ్ళకు ఎటువంటి అనుభూతినిస్తుందో తెలియదు కానీ బెంగుళూరుకు వంద కిలోమీటర్ల ప్రాంతంలో వుండే హిందూపురం చుట్టుపక్కల తొలి పదిహేడు, పద్దెనిమిదేళ్ళు గడిపిన నాకు మైసూరు చాలా రకాలుగా కనపడుతూ వుండేది! మైసూరు పాకు, మైసూరు చారు, మైసూరు బోండా ఇలాంటివి తిండి పదార్థాలు కాగా- మైసూరు సిల్కు, మైసూరు సిల్క్ చీరలు, మైసూరు అగరుబత్తులు, మైసూరు శాండల్ సోపు మొదలైనవి మరికొన్ని సందర్భాల్లో వినబడుతుండేవి, కనబడుతూండేవి. వీటికి మించి కొలతకు (మా కొనతట్టుపల్లె ప్రాంతంలో) సుమారు లీటరు పరిమాణాన్ని సేరుగా పరిగణించేవారు. అయితే మైసూరు సేరని వేరే కొలత కూడా వుండేది. అంటే అది సవాసేరు లేదా సేరున్నర! అలాగే దంతాలు, రోజ్‌వుడ్, ప్యాలెస్, మహరాజు అంటూ కూడా మైసూరు ప్రస్తావన వస్తూండేది. లేపాక్షి నంది విషయం వచ్చినప్పుడు మైసూరు చాముండీ కొండల్లో వుండే నంది గురించి కూడా చర్చకు వచ్చేది!

నిజానికి మా వూరికి మైసూరు మహా దూరం ఏం కాదు. మా పల్లెకు బెంగుళూరు 120 అయితే, మైసూరు ఆ బెంగళూరుకు అంతకు కొంచెం ఎక్కువ- అంటే 140 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అయితే మైసూరు వెళ్ళే అవకాశం లేదు, గనుక అప్పటికి కోరికా లేదు. సరిగ్గా పదేళ్ళ క్రితం 2013 మార్చిలో ఓ నాలుగైదు రోజులపాటు మైసూరులో ఉన్నాం. ఆ సమయంలో నేను కడప ఆకాశవాణి కేంద్రంలో పనిచేస్తున్నాను. అప్పట్లో మైసూరు వెళ్ళడానికి కారణం కందాళ శ్రీనివాసాచార్య. వీరు నేను తిరుపతిలో ఎమ్మెస్సీ చదివే 1985-86 కాలంలో పరిచయమైన మిత్రులు. నేను తిరుపతిలో వుండగానే, యుపిఎస్సీ ప్రకటన ఆధారంగా తెలుగు సాహిత్యంలో డాక్టరేట్ వున్న శ్రీనివాసాచార్య సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సిఐఐఎల్, మైసూరు)లో ఉద్యోగంలో చేరారు. ఆయన మైసూరు వెళ్ళిన కొంతకాలానికి ఆకాశవాణి ఉద్యోగంతో నేను గోవా వెళ్ళిపోయాను.

దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత నేను హైదరాబాదులో పనిచేస్తున్నప్పుడు డా శ్రీనివాసాచార్య ఆచూకీ తెలిసింది. వారు మైసూరు వచ్చి వెళ్ళమని ఎన్నోసార్లు చెబుతూ వచ్చారు. ఫలితంగా తర్వాత 2013లో మైసూరు వెళ్ళి డా. శ్రీనివాస్ అతిథిగా సిఐఐఎల్ సంస్థ గెస్ట్ హౌస్‌లో ఆ నాలుగైదు రోజులు గడిపాం. ఇలా వెళ్ళినప్పుడు మా ఇద్దరికీ భక్తి కన్నా విజ్ఞానం, విహారం అనే పద్ధతిలో మా పర్యటనల్ని మార్చుకుంటూ వుంటాము. దీన్ని నా చదువు, ఉద్యోగం, రాత ఎంతో తీర్చిదిద్దాయి. పదేళ్ళ క్రితం మైసూర్ వెళ్ళినప్పుడు మైసూరు ప్యాలెస్, బృందావన్ గార్డెన్స్, శ్రీరంగ పట్టణం, టిప్పుసుల్తాను కోట ఇంకా మేల్కోటే పట్టణంలోని చెలువ నారాయణస్వామి ఆలయం, అకాడమీ ఆఫ్ శాన్స్ క్రిట్ రీసెర్చి ఇవి కాకుండా మైసూరు దగ్గర్లో వున్న చాముండీ హిల్స్, నంజనగూడు; వంద కిలోమీటర్లు మించి దూరం

వున్న వూటీ ఇలాంటివి చూశాం. ఈసారి వాటన్నిటినీ పరిహరించి మిగతా వాటిని చూడాలని అనుకున్నాం గానీ పటిష్ఠమైన ప్రణాళిక వేసుకోలేదు. మైసూరు అనగానే 1916 లో మొదలైన మైసూరు యూనివర్సిటీ, బియస్సీ ఇడి, బి.ఏ. ఇడి కోర్సులను కలిగి వుండే మానస గంగోత్రి కళాశాల, భారతీయ భాషల సంస్థ ఇలాంటివి.. ఇంకా ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ థెరపీ, సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీ రీసర్చి ఇనిస్టిట్యూట్ వంటి సంస్థలున్న నగరంగా మైసూరు అంటే అదనపు గౌరవం! నిజానికి మైసూరు 1399 నుంచి 1948 దాకా ఆ ప్రాంతానికి రాజధానిగా కొనసాగింది. కనుక మహారాజా కాలేజీ, మెడికల్ కాలేజీ, ఇంజనీరింగ్ కాలేజీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రారంభించిన సంస్థలు వంటివి చాలా ఉన్నాయి. రాజధాని బెంగుళూరుకు తరలిపోవడంతో ఈ నగరం అభివృద్ధి కొంచెం మందకొడి అయినా, గత డెబ్బయి ఏళ్ళలో కాలుష్యం తక్కువగా వున్న నగరంగా, రిటైర్ అయిన వారి నిలయం గా మారిపోయింది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే ప్లాస్టిక్ వాడకాన్ని దాదాపు నియంత్రించడం, జ్యూస్ తాగడానికి ఇచ్చే గొట్టాలు కూడా కాగితం తయారీకి కావడం విశేషం.

పదేళ్ళక్రితం చూసినప్పుడు నాకు స్ఫురించలేదు కానీ, ఈసారి గమనిస్తే మైసూరు, చండీగర్ నగరంలా నాకనిపించింది. చండీగర్ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక నిర్మించుకున్న నగరం. ఈ నగరం మధ్యలో పెద్ద పెద్ద చెట్లు వుండే తోటలు ఎన్నో కనబడ తాయి. ఈ మైసూర్ నగరం పూర్తి టొపోగ్రఫీ గురించి చెప్పలేను కానీ, ఇక్కడ కూడా చెట్లు, తోటలు చాలా కనబడతాయి. అదే సమయంలో బెంగుళూరు కన్నా ఓ రెండు డిగ్రీల ఉష్ణోగ్రత సగటున ఎక్కువ వుంటుంది కనుక నివాసానికి చాలా అనుకూలం గా వుంటుంది. ఇప్పుడు మైసూర్ కర్ణాటక రాష్ట్రంలో బెంగుళూరు, హుబ్లీ - ధార్వాడ నగరాల తర్వాత మూడో పెద్ద నగరంగా నిలుస్తోంది. సంస్కృతీ ప్రతీకగా ఉంటూ సాఫ్ట్‌వేర్ రంగంలో కర్ణాటకలో బెంగుళూరు తర్వాత స్థానం ఆక్రమించింది కానీ ట్రాఫిక్ సమస్య దాదాపు లేకుండా హాయినిస్తోంది. బెంగుళూరులో లాగా కాకుండా ఎయిర్ పోర్టు మైసూరులో కొంచెం దగ్గరగా వుంటుంది.

2023 సంక్రాంతికి మేము వెళ్ళాలనే ఆలోచన ఉమేష్, రాజేశ్వరి దంపతులది. కదిరి ప్రాంతానికి చెందిన తెలుగు కుటుంబం కోలారు, శ్రీనివాసపుర ప్రాంతానికి ఎప్పుడో తరలి వెళ్ళి, 9 దశాబ్దాల క్రితం ఉపాధి కారణంగా బెంగుళూరులో స్థిరపడింది. అటువంటి కుటుంబంలో జన్మించిన సూత్రం ఉమేష్ నాతో పాటు 1991లో యుపిఎస్‌సి ద్వారా ఆకాశవాణి/దూరదర్శన్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌గా ఎంపికైన రంగస్థల ఔత్సాహిక కళాకారుడు (అప్పటికి). నంద్యాల ఇంటి పేరుగా వుండే శ్రీమతి రాజేశ్వరి పూర్వీకులు కర్నూలు ప్రాంతం వారు. కనుక ఈ దంపతులు ఇరువురూ ఇంట్లో తెలుగు మాట్లాడే వ్యక్తులు! ఇప్పుడు మైసూరులో ఇల్లు కట్టుకుని స్థిరపడ్డారు.



ఆకాశవాణి/దూరదర్శన్‌లో నాలుగు దశాబ్దాల క్రితం కొందరు ఘనాపాటీలు రహస్యంగా చేసిన ఘనకార్యాలతో ఈ నలభై ఏళ్ళ కాలంలో నాలుగు విడతలుగా 1983-91 మధ్య కాలంలో ఎంపికైన ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్స్ సర్వీసులో చాలా రకాలుగా నష్టపోయారు. ఈ విషయాలు సమాచార హక్కు చట్టం వచ్చిన తర్వాత (అంటే 2006 తర్వాత) ఓ మాదిరిగా బోధపడటం మొదలైంది! ఫలితంగా కొంత ఆలోచన మొదలై ఈ విషయాలు చర్చించుకోవడానికి తరచు కలిసేవాళ్లం. అలా 2014-15 ప్రాంతంలో ఉమేష్ బెంగుళూరు నుంచి మదరాసు వచ్చి మా సహోద్యోగులను కలిశారు. తెలుగు మాతృభాష కారణంగా మా స్నేహం మొదలై ఇద్దరి స్వభావాలరీత్యా బలపడింది. అంతలో నేను తిరుపతికి మదరాసు నుంచి బదిలీ మీద వచ్చాను. తను సకుటుంబంగా బెంగుళూరు నుంచి తిరుపతి వచ్చి, తిరుపతి నుంచి మేం నలుగురం మదరాసు వెళ్ళాలని ప్రణాళికలు వేసుకున్నాం. అయితే అవి సాకారం కాకముందే ఉమేషుడికి అండమాన్ దీవుల్లోని పోర్టుబ్లయర్ ఆకాశవాణికి బదిలీ అయ్యింది. నన్ను బదిలీ మీద గానీ, పర్యటనగా గానీ పోర్టు బ్లయర్ ఉమేష్ రమ్మనేవారు. అయితే అవి రెండూ సాధ్యం కాకముందే నేను హైదరాబాదుకు బదిలీ మీద వచ్చేశాను. తరువాత కొంత కాలానికి తను మైసూరు ఆకాశవాణికి కేంద్ర నిర్దేశిత బాధ్యతల మీద వచ్చారు. ఒకవైపు కోవిడ్, ఇంకోవైపు తన బదిలీ, మరోవైపు నా పదవీ విరమణతో ఆ దంపతులను కలిసే వీలు 2023 జనవరిలోనే సాధ్యమైంది. ఇదీ, మా మైసూరు ప్రయాణం నేపథ్యం!

జనవరి 11న సాయంకాలం 7 గంటలకి కాచిగూడా-మైసూరు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వు చేసుకున్న

కంపార్ట్ మెంట్‌లో ప్రవేశించాం. ఈ రైలు మాకు చిరపరిచితమైన జడ్చర్ల, మెహబూబ్‌నగర్, కర్నూలు, డోన్ (ద్రోణాచలం), గుత్తి, అనంతపురం, ధర్మవరం పెనుకొండ, హిందూపురం గుండా ప్రయాణం చేసి పిమ్మట దొడ్డ బళాపురం, బెంగుళూరు, రామ్ నగరం, మాండ్య మీదుగా ఉదయం 9.30కు మైసూరు జంక్షన్ చేరింది. జనవరి నెల, బెంగుళూరు ప్రాంతం, వేగంగా కదిలే రైలు కనుక శృతిమించిన చల్లదనాన్ని భరించక తప్పలేదు! ముందు రోజు హాయిగా రైలుపెట్టెలోకి ఎక్కిన తర్వాత సిద్ధం చేసి తెచ్చుకున్న భోజనాన్ని కానించి హాయిగా పడుకుంటే బెంగుళూరు రాకముందే మనం లేచిపోక తప్పదు. ఇక బెంగు ళూరు నుంచి కెంగేరి, రామ్ నగరం, మాండ్య ఈ స్టేషన్లలో బాగా పేరుమోసిన మద్దూరి వడలు, తట్ట ఇడ్లీలు, దోసెలు ఇలా అన్నీ టేస్టు చేస్తూ టిఫిన్ అయిపోయిందనిపించాం. తెలిసిన మిత్రుడున్నాడు కనుక ఎలాంటి సమస్య కూడా లేకుండా గంట లోపే విజయనగర ఏరియాలో వుండే వారి నివాసానికి వెళ్ళాం.


శ్రీరంగపట్నం ఆలయం


అప్పటికి ఒక్క రెండురోజులు సంబంధించి కూర్గు వైపుకు ప్రయాణం అనుకుని మడికెర వైపుకు నిర్ణయించుకున్నాం. దానికి సంబంధించి వారం క్రితమే అక్కడి రిసార్టులో అకామొడేషన్ బుక్ చేసుకున్నాం. కనుక మొదటిరోజు మధ్యాహ్న భోజనం తరువాత శ్రీరంగపట్టణం, కావేరీ నదిని చూడాలని నేనూ, మా ఆవిడ హంస టాక్సీలో బయల్దేరాం. పది, పదిహేను కిలోమీటర్ల దూరంలో వుండే శ్రీరంగపట్టణం కోట, టిప్పు సమాధి ఇదివరకే చూశాం గనుక అప్పుడు మిస్సయిన రంగనాథస్వామిని, గుడిని ఇప్పుడు చూడాలని మొదట నైమిషాంబా దేవి గుడికి వెళ్ళాం. అది కావేరీ నది ఒడ్డునే వుంటుంది. కృష్ణానది, గోదావరీ నది, ప్రకాశం బ్యారేజ్, నాగార్జున సాగర్, శ్రీశైలం డ్యామ్ చూసిన నాకు కావేరీ నది ఏమాత్రం ఉత్సాహాన్ని కానీ, ఆనందాన్ని కానీ కలిగించలేదు. రంగనాథస్వామి ఆలయాన్ని చూసుకుని మా మిత్రుడి నివాసానికి వెళ్లేముందు 'రంగాయన' వెళ్ళాము.

మధ్యాహ్నం కావేరి నది వైపు వెళ్ళినప్పుడు తారసపడిన మైసూర్ ఆకాశవాణి భవనం లోపలికి వెళ్ళాం. లోపలికి వెళ్ళగానే మా మిత్రుడు ఉమేశ్ ఆఫీస్ రూం పక్కనే ఉన్న 'నాదాలయ' నన్ను ఆకర్షించింది. అది ఇటీవల కాలంలో వచ్చిన అదనపు సోయగం. నిజానికి అన్ని పెద్ద ఆకాశవాణి కేంద్రాల్లో సంగీత వాయిద్యాలు ఉంచడానికి ఓ గది కేటాయిస్తారు. ఈ కేంద్రంలో దాన్ని అందంగా అర్థవంతంగా సంగీతకారుల ఫోటోలు, సమాచారం తో పాటు గదిని సంగీత వాయిద్యాలుంచే రీతిలో మేళవించారు! అదీ మైసూర్ ఆకాశవాణి ప్రత్యేకత.

కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ నాటకరంగ శాఖ నిర్వహణలో నడిచే 'రంగాయన' పేరెన్నికగన్న జాతీయస్థాయి రంగభూమి. 'బహురూపి' పేరున ప్రతిఏటా సంక్రాంతికి పలు భారతీయ భాషల నాటక ప్రదర్శన సంక్రాంతికి వుంటుంది. అయితే 2023లో కర్ణాటక రాష్ట్ర విధాన సభ ఎన్నికల దృష్ట్యా ఈసారి 2022 డిసెంబర్ 8–15 తేదీల మధ్య ఈ 'బహురూపి' ఉత్సవం జరిగింది. మొన్న జరిగిన ఉత్సవంలో ఏడు రాష్ట్రాలకు చెందిన, ఏడు భాషల నాటకాలతోపాటు కన్నడ, తుళు భాషల్లోని పన్నెండింటితో కలిపి మొత్తం 20 నాటక ప్రదర్శనలు జరిగాయి. ఏకకాలంలో వేర్వేరు వేదికలపై ఈ జాతీయ నాటకాలతోపాటు మంచి చర్చలు, సినిమా ప్రదర్శనలు, జానపద కళా ప్రదర్శనలు, యక్షగానాలు, పుస్తక హస్తకళల ప్రదర్శనలు, భోజనాలయాలు ఎంతో ఆకర్షించాయి.

1989లో బి.వి.కారంత్ పూనికతో మొదలైన ఈ 'రంగాయన'లో సంవత్సరం పొడవునా రంగస్థలం సంబంధించిన కార్యక్రమాలు జరుగుతూంటాయి. పిల్లలకు, కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు, దసరా పండుగకు, ఇంకా సుబ్బయ్య నాయుడు, బెంగళూరు నాగరత్నమ్మ పేరున నాటక ప్రదర్శనలకి సంబంధించిన చర్చా కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈ 34 ఏళ్ళకాలంలో సుమారు 110 నాటక ప్రదర్శనలు జరిగాయని 'బహురూపి' కార్యక్రమం తాజా ఆహ్వాన పత్రిక చెబుతోంది. మామూలుగా అయితే ఈ కార్యక్రమం లేకపోతే రంగాయనకు తాళాలు వేస్తారు. ఆ రోజు ఒక ప్రైవేటు స్కూలు సంబంధించిన కార్యక్రమం జరుగుతోంది కనుక అక్కడ ఉన్న ఏర్పాట్లను కొద్దిగా పరిశీలించి తృప్తిపడ్డాను. అదే సమయంలో మున్ముందు సంక్రాంతి సమయంలో ఒక వారం పాటు వచ్చి ఈ బహుభాషల నాటకాలని చూడాలని నిర్ణయించుకున్నాను.

(ఇంకా ఉంది)



శ్రీశ్రీ జయభేరి పుస్తక ఆవిష్కరణ దృశ్యం; చిత్రంలో వరసగా అశోక్ కుమార్, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, తెలకపల్లి రవి, కె లక్ష్మయ్య, ఎస్ వెంకట్రావు

# శ్రీశ్రీ జయభేరి ఆరో ముద్రణ ఒక చరిత్ర : రాచపాళెం

సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి రచించిన శ్రీశ్రీ జయభేరి ఆరవ ముద్రణ ఆవిష్కరణ తెలుగు పుస్తకాల్లో ఒక చరిత్ర అన్నారు ప్రముఖ విమర్శకులు, రచయిత ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి. ఫిబ్రవరి పదవ తేదీన విజయవాడ బుక్ ఎగ్జిబిషన్‌లో శ్రీశ్రీ జయభేరిని ఆవిష్కరిస్తూ ఆయన పుస్తకం గురించీ, రచయిత అనుసరించిన రచనాశైలి గురించీ మాట్లాడారు. 2010లో మొదటిసారి విడుదలైన ఈ గ్రంథం శ్రీశ్రీ జీవితం, సాహిత్యం, రాజకీయాలను చారిత్రిక ఆధారాలతో సవివరంగా నిరూపించిందని వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయ పరిశోధనలో సాధ్యమయ్యే ఇలాటి రచన చేసినందుకు రచయితను అభినందించారు. రచనలోనూ, చర్చల్లోనూ సామాజిక సాహిత్య రాజకీయ సినిమా రంగాల ఉదాహరణలను సమయోచితంగా జోడించడం తెలకపల్లి రవి ప్రత్యేకత అనీ, ఆయన జ్ఞాపకశక్తి తనకు ఆశ్చర్యం కలిగిస్తుందనీ అన్నారు. రవి అందించిన శ్రీశ్రీ జయభేరి, గురజాడ యుగస్వరం గ్రంథాలను క్లాసిక్స్‌గా పరిగణించాల్సి వుంటుందని అభిప్రాయపడ్డారు. శ్రీశ్రీ మహాకవిగా మారిన తీరు, ప్రారంభంలోనే తన ప్రత్యేకత చాటిన శ్రీశ్రీపై నాటి పెద్దలు మొదలు తర్వాతి విమర్శకుల వరకూ వెలిబుచ్చిన అభిప్రాయాల సారాంశాన్ని ఈ పుస్తకంలో పొందుపర్చడం వల్ల సమగ్ర అవగాహనకు రాగలమని వివరించారు. కమ్యూనిస్టు వ్యతిరేకులు ఒక రకంగానూ, వివిధ రకాలైన అస్తిత్వవాదులు మరోరకంగానూ శ్రీశ్రీపై తరచూ వినిపించే విమర్శలకు రచయిత ... ఈ పుస్తకంలో ప్రజాస్వామిక స్ఫూర్తితో సోదాహరణంగా సమాధానాలిచ్చారని పేర్కొన్నారు. వర్గ సమాజంలో పీడన, దోపిడీ వున్నంతవరకూ శ్రీశ్రీ కవిత్వం మరో ప్రపంచ నిర్మాణం కోసం పోరాడేవారికి స్ఫూర్తినిస్తూనే వుంటుందని విశ్వాసం వెలిబుచ్చారు. శ్రీశ్రీ సాహిత్యనిధి వ్యవస్థాపకులు సింగంపల్లి అశోక్‌కుమార్‌కు పుస్తకం తొలి ప్రతి అందించారు.

సభకు అధ్యక్షత వహించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ... తెలకపల్లి రవి తొలి నుంచి శ్రీశ్రీ కవిత్వం, సాహిత్య రాజకీయాలను క్రమపద్ధతిలో అధ్యయనం చేస్తూ వస్తున్న తీరు తాను ప్రత్యక్షంగా గమనించానని చెప్పారు. శ్రీశ్రీ కవిత్వానికి కాలం చెల్లిందనే వారికి ఈ పుస్తకం సరైన సమాధానం చెబుతుందని స్పష్టం చేశారు. రెడ్‌బుక్స్ దేకు ఈ ఏడాది శ్రీశ్రీ మహాప్రస్థానం ఎంపిక చేయడానికి కూడా అదే కారణమన్నారు. శ్రీశ్రీ సాహిత్య స్ఫూర్తి నిలబెట్టేందుకు కృషి చేస్తున్న తమలాటి సంస్థలను కూడా సాహితీ స్రవంతి ఎప్పుడూ గౌరవించడం అభినందనీయమన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామిక సాహిత్యసంస్థల వల్లనే సాహిత్యోద్యమం కొనసాగు తున్నదని చెప్పారు.

తెలకపల్లి రవి తన ప్రసంగంలో ... శ్రీశ్రీ కాలం సృష్టించుకున్న మహాకవి అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంతోనే పెరిగారనీ, ప్రలోభాలకు లోనుగాకుండా ప్రజలతో నిలిచారని వివరించారు. ప్రగతిశీల శక్తుల పురోగమనానికి అవసరమైన భాషనూ, భావధారనూ పరిపుష్టం చేశారన్నారు. ఆరుసార్లు సాహిత్య విమర్శ గ్రంథం పునర్ముద్రణ పొందడం అరుదైన విషయమనీ, శ్రీశ్రీ పట్ల వున్న అభిమానమే ఇందుకు కారణమంటూ కృతజ్ఞతలు చెప్పారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజర్ కె.లక్ష్మయ్య స్వాగతం పలికి, సభను పరిచయం చేశారు. సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి, జనసాహితి దివికుమార్, ప్రజాశక్తి చీఫ్ మేనేజర్ అచ్యుతరావు, ప్రస్థానం వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ తదితరులు సభలో పాల్గొన్నారు. ■

# ఉత్తేజకరంగా రెడ్ బుక్ డే



ప్రసంగిస్తున్న ప్రగతి

**ఫిబ్రవరి 21 రెడ్ బుక్ డేను పురస్కరించుకొని రాష్ట్రంలో పలుచోట్ల మహాప్రస్థానం కవితా పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు, సదస్సులు మొదలైన కార్యక్రమాలు జరిగాయి. విశాఖపట్నం, కంచరపాలెం, శ్రీకాకుళం, ఏలూరు, కర్నూలు, విజయవాడ తదితర ప్రాంతాల్లో సాహితీ స్రవంతి, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కవితాపఠనం, సభలు నిర్వహించారు.**

అనంతపురంలో సాహితీ స్రవంతి, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో మహాప్రస్థానం కవితా పఠనం జరిగింది. కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ హేమమాలిని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక నాయకులు చంద్రశేఖర్ రెడ్ బుక్ డే ప్రాధాన్యత గురించి వివరించారు. ప్రముఖ కవి డాక్టర్ రాధేయ మాట్లాడుతూ శ్రీశ్రీ మహాప్రస్థానం తనకు ఏ విధంగా ప్రేరణనిచ్చిందో వివరించారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు ప్రగతి మాట్లాడుతూ.. శ్రీశ్రీ మహాప్రస్థానం నుంచి స్ఫూర్తి పొందని కవులు దాదాపుగా ఎవరూ ఉండరని తెలిపారు. ఈనాటి తరానికి మహాప్రస్థానాన్ని పరిచయం చేయాల్సిన అవసరాన్ని సాహితీ స్రవంతి,



మాట్లాడుతున్న డా.రాధేయ

ప్రజాశక్తి గుర్తించి విద్యార్థుల కోసం 'మహాప్రస్థానం చదువుదాం రండి!' అనే కార్యక్రమాన్ని నిర్వహించినట్లుగా తెలిపారు. తొలుత ఐదవ తరగతి చదువుతున్న చిన్నారి వాక్య విన్యాస "నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను." అంటూ మహాప్రస్థానంలోని జయభేరిని అద్భుతంగా వినిపించింది. ఆ వెంటనే మూడవ తరగతి చిన్నారి కవన విలాసి "భూతాన్ని, యజ్ఞోపవీతాన్ని, వైప్లవ్యగీతాన్ని నేను..." అంటూ 'ఐ' కవితను వినిపించాడు. డిగ్రీ విద్యార్థి ధనుష్ "యేదినిజం యేది నిజం" అంటూ 'చేదుపాట'ను ఉత్తేజపూరితంగా వినిపించగా, మరో విద్యార్థిని లావణ్య 'పొలాలనన్నీ హలాలదున్నీ' అంటూ 'ప్రతిజ్ఞ' చేసింది. స్పందన కవి చంద్రశేఖర శాస్త్రి మహాప్రస్థానంలోని అనేక కవితలను వ్యాఖ్యానిస్తూ అనర్గళంగా వినిపించారు. ఇంకా సాహితీస్రవంతి జిల్లా కమిటీ సభ్యురాలు యమునారాణి, జిల్లా నాయకులు ప్రజ్ఞాసురేష్; కళాశాల విద్యార్థులు లావణ్య, ధనుష్; సాహితీస్రవంతి జిల్లా అధ్యక్షురాలు ప్రగతి శ్రీశ్రీ కవితలు వినిపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అంకె శ్రీనివాస్, యమున, స్పందన కవి చంద్రశేఖర శాస్త్రి, కథకుడు ఉప్పరపాటి వెంకటేశులు, మానవత తరిమెల అమర్నాథరెడ్డి, అనంత సాహితీ ప్రస్థానం అధ్యక్షుడు అశ్వర్థరెడ్డి, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్, బాలరంగయ్య, రామిరెడ్డి కసాపురం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

**సదస్సులు :** అనంతపురం నగరంలోని అరవిందనగర్ బాలికల సాంఘిక సంక్షేమ వసతిగృహంలో సాహితీస్రవంతి, విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం, ఎస్.ఎఫ్.ఐ., డి.వై.ఎఫ్.ఐ. ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14 వ తేదీన మహాప్రస్థానం గురించి నిర్వహించిన సదస్సులో దాదాపు 400 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సాహితీస్రవంతి జిల్లా అధ్యక్షురాలు ప్రగతి, ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ అంకె శ్రీనివాస్, సాహితీస్రవంతి నాయకులు ప్రజ్ఞా సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడారు. విద్యార్థినులు మహాప్రస్థానంలోని కవితలు చదివించారు. అనంతపురం కెఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన సదస్సులో కళాశాల అధ్యాపకులు డాక్టర్ నగరూరు రసూల్ మాట్లాడుతూ ... 'ఈ యుగం నాద'ని చాటిన శ్రీశ్రీ తదనంతరపు అనేకమంది కవులకు స్ఫూర్తిగా నిలిచారన్నారు. దాదాపు మూడు వందల మంది విద్యార్థినులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, కెఎస్ఎన్ డిగ్రీ కళాశాల అధ్యాపక



బృందం తిమ్మారెడ్డి, రామాంజినేయులు, రామకృష్ణ, శర్మ, ఎస్ఎఫ్ఐ నాయకులు సూర్యప్రకాష్, విజయ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

**అలరించిన శ్రీశ్రీ సాహిత్య సాంస్కృతిక ఉత్సవం**

ఫిబ్రవరి 20 ఆదివారం సాయంత్రం ఆర్ట్స్ కళాశాల కామర్స్ బ్లాక్ వద్ద జరిగిన మహాకవి శ్రీశ్రీ సాహిత్య సాంస్కృతిక ఉత్సవం సాహితీ స్రవంతి నాయకులు ప్రజ్ఞాసురేష్ అధ్యక్షతన జరిగింది. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షురాలు ప్రగతి, రిటైర్డ్ తహసీల్దార్ జయరామప్ప, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.ఎ.నాగేంద్ర మాట్లాడారు. అనంతరం వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు శ్రీశ్రీ రచించిన అనేక సినీ గీతాలకు నృత్యాలు ప్రదర్శించారు. “ఉందిలే మంచికాలం ముందుముందునా…”, “పాడవోయి భారతీయుడా!” మొదలగు గీతాలకు నృత్యాలు చేసి ప్రేక్షకులను అలరించారు. మూడు గంటల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వం విజ్ఞాన కేంద్రం నాయకులు యం.యన్.టి.రాజు, కవి రియాజుద్దీన్, కుల వివక్ష వ్యతిరేక సంఘం నాయకులు నల్లప్ప, ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ నాయకులు పరమేష్, నర్సింహారెడ్డి, ఐద్వా నాయకులు సావిత్రి, బాలరంగయ్య, సురేష్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


– అంకె శ్రీనివాస్




విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో ప్రజాశక్తి బుక్‌హౌస్, సాహితీ స్రవంతి ఆధ్వర్యాన శ్రీశ్రీ కవితాపఠనం ఉత్తేజపూరితంగా జరిగింది. 32 మంది శ్రీశ్రీ కవితలను చదివారు. ప్రముఖ కవి ప్రసాదమూర్తి శ్రీశ్రీ మహాప్రస్థాన కవిత్వం గురించి మాట్లాడారు. ఆధునికకవులు అందరూ శ్రీశ్రీ మార్గంలో నడుస్తున్నవారేనని అన్నారు. ఆ వరవడిని కొనసాగించాల్సిన అవసరం ఇప్పుడు ఎంతైనా ఉందని బుక్‌హౌస్ సంపాదకులు ఎస్ వెంకట్రావు అన్నారు. కార్యక్రమానికి సమన్వయ కర్తగా సత్యాజీ వ్యవహరించారు. బుక్‌హౌస్ జిఎం కె లక్ష్మయ్య, వర్ధిని తదితరులు పాల్గొన్నారు. శ్రీశ్రీ సాహిత్య నిధి అశోక్‌కుమార్, గుమ్మా సాంబశివరావు, అనిల్ డ్యానీ, శాంతిశ్రీ, కలిమిశ్రీ, డా. వెన్నా వల్లభరావు, మాధవరావు, గోళ్ల నారాయణరావు, హరప్రసాద్, మందరపు హైమావతి, వైష్ణవిశ్రీ తదితరులు శ్రీశ్రీ కవితలను చదివారు.



**శ్రీకాకుళంలో జరిగిన శ్రీశ్రీ కవితాపఠనం కార్యక్రమంలో ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, ప్రముఖ కవి నల్లి ధర్మారావు మాట్లాడారు. సాహితీ స్రవంతి బాధ్యులు శ్రీనివాస్ సమన్వయం చేశారు.**



**విశాఖలోని బిఎన్ఆర్ భవన్‌లో జరిగిన శ్రీశ్రీ కవితాపఠనంలో ప్రముఖ కవులు పొలమరశెట్టి ఫ్రాన్సిస్, బొడ్డు కూర్మారావు, సాహితీ స్రవంతి కన్వీనర్ పెంటకోట రామారావు, కె స్వతంత్రకుమార్, బొట్టా ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.**

కదిరిలోని ఓపెల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో వేమన పద్యాలు పోటీ నిర్వహించారు. ఆ పాఠశాల విద్యార్థులు చాలా ఉత్సాహంగా వేమన పద్యాలను పాడి తాత్పర్యంతో సహా చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వ్యవసాయవేత్త సాంబమూర్తి అధ్యక్షత వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులందరికీ బహుమతులు అందచేశారు. పాఠశాల కరెస్పాండెంట్ షఇనఓజ్, ప్రిన్సిపాల్ షీనా, ఉపాధ్యాయులు కుమారి,శిరీష్, లిఖిత పాల్గొన్నారు.





### గురజాడకథలు - సంస్కరణ దృక్పథం

**(వ్యాసాల సంకలనం)**

**రచన :ప్రొ. వెలమల సిమ్మన్న**
**వెల : రూ.100 పేజీలు : 114**

**ప్రతులకు : 94906 79570**

**గు**రజాడ కథలపై కొన్ని విమర్శ వ్యాసలు వెలువడినా ఆయన కథల్లో ప్రదర్శించిన సంస్కరణ దృక్పథంపై ప్రత్యేకంగా ఒక పుస్తకం రాలేదు. సిమ్మన్న 6 అధ్యాయాల్లో విషయాన్ని వర్గీకరించారు. తన ప్రతిపాదనలకు మలం చేకూర్చేలా పలువురి అభిప్రాయాల్ని ఉదహరించారు. ఆయా కథల వస్తువును కథకుడు వ్యక్తం చేసిన భావాలను, రచనా శిల్పాన్ని, శైలిని విశ్లేషించారు. అనంతర కథకులపై గురజాడ ప్రభావాన్నీ వివరించారు.

**- డా. దామెర సూర్యారావు**



### వామపక్షం - భారత స్వాతంత్ర్యం

(వ్యాసాల సంపుటి)

**వెల : 150 పేజీలు : 152**
**ప్రతులకు : 94900 99378**

**భా**రత కమ్యూనిస్టు ఉద్యమ దిగ్గజాలు రాసిన ఈ వ్యాసాల సంకలనం స్వాతం త్రోద్యమంలోను, స్వతంత్ర భారతం లోను కమ్యూనిస్టుల పాత్రను వివ రిస్తుంది. కమ్యూనిస్టులు చేసిన, చేస్తున్న సేవలను ఈనాటి తరం తెలుసు కునేందుకు ఈ పుస్తకం ఎంతో ఉపకరిస్తుంది. కార్పొరేట్ శక్తులు, మతోన్మాద శక్తులు మిలాఖత్ అవుతూ కమ్యూ నిస్టులపై, దేశభక్తులపై చేస్తున్న దుష్ప్రచారాన్ని, తిప్పికొట్టడానికి కూడా ఈ డాక్యుమెంట్ ఉపయోగపడుతుంది.



### సంపన్నులు పైపైకి - సామాన్యులు అధోగతికి (వ్యాసాలు)

**వెల : 100 పేజీలు: 104**
**ప్రతులకు : 9490099378**

**దే**శంలో నయా ఉదారవాద విధానాల పర్యవసానం గురించిన సమగ్ర వివరణ ఈ పుస్తకం. ఈ విధానాల ఫలితంగా కోటీశ్వరులు సహస్ర కోటీశ్వరులుగా పైపైకి ఎలా ఎదిగారు, సామాన్యులు మరింత అధోగతికి ఎలా దిగజారు తున్నారో మనం చూస్తూనే ఉన్నాం. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడం, దేశ, విదేశీ ప్రైవేటు సంస్థలకు ఎర్ర తివాచీ పరవడం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ తరుణంలో ఈ విధానాల దుష్పరిణామాలకు గురైన, వీటికి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం ఇది.




### ఆమె మార్పు ఎజండా

**(కవిత్వం)**

**రచన : మహమ్మద్ ఖాజామైనద్దీన్**
**వెల : 50 పేజీలు : 110**
**ప్రతులకు : 93966 26276**

**అ**జ్ఞానం పెత్తనం చెలాయిస్తే
అవినీతిదే రాజ్యం/ ప్రగతికి
మరణమేనని ఆవేదనతో ఆవేశంతో
చెబుతారు ఈ కవి. అబద్ధం
ఆవరించిన అంధకార అడవిలో
నిజం పెనుగులాట దృశ్యాన్ని ఈ కవిత్వంలో
వివరించారు. 18వ శతాబ్దపు చీకటిని బద్దలుకొట్టి,
మహోన్నత ఉద్యమం నడిపిన మహాత్మ జ్యోతిరావుపూలే
గుండెలోని గుండె అయిన సావిత్రిని, అమరవీరులు
భగత్‌సింగ్, చేగువెరాలను స్మరించారు.

**- జనజ్వాల**



### మార్కెట్లో (వ్యాసాలు)

**రచయిత : కేశవ్**

**వెల : 200 పేజీలు : 152**
**ప్రతులకు : 89616 26848**

**ప్ర**స్తుత ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య, కళారంగాల్లోని విభిన్న అంశాలను తడిమాయి కేశవ్ వ్యాసాలు. సోవియట్ పతనానంతరం ప్రపంచవ్యాపితంగా గోబలైజేషన్ పేరుతో అమలవుతున్న సరళీకరణ విధానాల దుష్ప్రభావాన్ని, ధనిక స్వామ్యం చేస్తున్న జిమ్మిక్కులను రచయిత ఎండగట్టారు. మార్కెట్ ఎకానమీ మీద, వాటి ప్రభావాన్ని సూటిగా చర్చించారు. పలు ఆర్థిక అంశాలను, గణాంకాలను చిక్కులెక్కలను అందరికీ అర్థమయ్యేలా సరళంగా రాశారు.

**– ఎన్.వేణుగోపాల్**



### చల్లారని నిప్పురవ్వలు (కవిత్వం)

**మహమ్మద్ ఖాజామైనద్దీన్**

**వెల : 50 పేజీలు : 104**
**ప్రతులకు : 9396626276**

**ప్ర**గతిశీలమైన ఈ కవిత్వలో అభ్యుదయ భావ స్రవంతి అంత: సూత్రంగా కనిపిస్తుం ది. సమసమాజం కోసం కవి పడే తపనే ఈ 'చల్లారని నిప్పురవ్వలు'. పేద జనం తరపున నిత్యం పయనించి అండగా నిలిచే, ఆకలి చావుల వేళ శ్రమజీవులకు అంబలి కేంద్రాలు నడిపి స్నేహహస్తం అందించే వామపక్ష భావాలు ఈ కవితా ప్రవాహంలో కనిపిస్తాయి. మనుషులను కులం, మతం పేరుతో విభజించే మనుధర్మ దుష్టత్వంపై ఈ కవితలు కళ్లెర్ర చేస్తాయి.

**- పరిమళ్**



## బాల రంజని (బాలల కథలు)

**రచన : ఎల్. రాజా గణేష్**
**వెల : రూ.120 పేజీలు : 96**
**ప్రతులకు : 92474 83700**

**బా**లలనే కాదు, ఆబాల గోపాలాన్ని అల రించి, విజ్ఞానం పంచే కథా సంపుటి ఇది. సృజనాత్మక ఆలోచనలకు పదును పెడుతుంది. 'దేవుడు ఎక్కడో లేడు. నీ ఆత్మవిశ్వాసంలోనే ఉన్నాడు', 'అంగవైకల్యం అసలు లోపమే కాదు', 'కలిసి ఉంటే కలదు సుఖం' అంటూ... పిల్లల్లో చైతన్యంతో పాటు ఆనందాన్నీ నింపుతాయి ఈ కథలు. పిల్లలను అలరించే కథలివి.

**- ఎం.వి.వి సత్యనారాయణ**



## భిన్నత్వంలో ఏకత్వం మా'నవ'వాదం

**రచన : దేవరాజు మహారాజు**
**వెల : 175 పేజీలు: 175**
**ప్రతులకు :040-27673787**

నిండైన మానవతకు నిర్వచనం ఏమిటి? నిజమైన దేశభక్తి ఎక్కడుంది? ప్రశ్నకు ప్రాణంతీసి, దేశాన్ని మధ్యయుగాల్లోకి నడిపించే తిరోగమన నాయకులను ఏం చేయాలి? కులం, మతం పేరుతో మనసులను ముక్కలు చేస్తున్న దురాగతాలకు అంతం ఎక్కడ?.... వీటికి సమాధానం ఈ పుస్తకంలో లభిస్తుంది. "నరేంద్రమోడీ.... దయచేసి దిగిపోండి. ఈ దేశానికి మీరు చేయగల అత్యుత్తమ సేవ అదొక్కటే" ఇదీ ఈ పుస్తకానికి **అరుంధతీరాయ్** రాసిన 'ముందుమాట'.



## సాహిత్య విలోచన (విమర్శ వ్యాసాలు)

**రచన : వి. చెంచయ్య**
**వెల : 40 పేజీలు: 55**
**ప్రతులకు : 94406 38035**

**'**కవిత్వానికి సృష్టికర్త కవే అనడం శాస్త్రీయ దృక్పథం కాదు. కవికీ, కవిత్వానికీ రెండింటికీ మూలం సమాజమే' అంటారు సాహితీ విమర్శకులు వి చెంచయ్య. ఇవి సాహితీ విమర్శనాత్మక వ్యాసాలు. 2001 - 16 మధ్య కాలంలో రాసినవి. సాహిత్య విమర్శ స్వరూప స్వభావాలు ప్రధానంగా చర్చింపబడ్డాయి. విమర్శలో రచయితలకున్న, ఉండవలసిన స్వేచ్ఛా, బాధ్యతల్ని రచయిత ప్రస్తావించారు. 'పోస్టు మోడర్నిజానికి ప్రీమోడర్నిజంగా ఉండే అర్హత కూడా లేదు' అని పేర్కొన్నారు..



## ఉదయ వీచికలు (వ్యాసాలు)

**రచన : రాజాబాబు కంచర్ల**
**వెల : 150 పేజీలు: 136**
**ప్రతులకు : 0866-2577533**

**మ**నిషి చూడవలసిన నిజమైన అందం శ్రమైకజీవన సౌందర్యంలో ఉందంటారు రచయిత. సామాజిక అంతరాలు కొన సాగడం అంటే మానవత్వం మృగ్యమై పోవడమేనంటారు. నేటి వ్యాపార సంస్కృతి కారణంగా కుటుంబ విలువలు దిగజారి పోతున్న వైనాన్ని ఈ వ్యాసాల్లో సూటిగా ఎత్తిచూపారు. భిన్నత్వంలో ఏకత్వం ఎంత గొప్పదో తెలియజెప్పారు. ప్రజాశక్తి దినపత్రికలో కె.ఎక్స్.రాజు రాసిన ఆదివారపు సంపాదకీయాల సమ్మేళనమే ఈ ఉదయ వీచికలు. **- ఎం.వి.ఎస్.శర్మ**



## రెండు ఆకాశాల మధ్య (నవల)

**రచన : సలీం**
**వెల : 200 పేజీలు : 252**
**ప్రతులకు : 90004 13413**

**ఎ**ప్పుడు నెత్తిమీద బాంబులు పడ్తాయో తెలీదు. రాత్రి పడుకున్నాక ఉదయం వరకూ బతికుంటామో లేదో తెలీదు. ఇలా అనుక్షణం భయంతో చచ్చే బదులు చావే నయం కదూ' అనుకునే సరిహద్దుని ఆనుకొని ఉన్న గ్రామాల్లోని ప్రజల దీనావస్థని, దేశ విభజన సమయంలో పఠాన్‌చేతికి చిక్కిన పదమూడేళ్ల షామ్లీ జీవితంలోని విషాద ఘటనల్ని అద్భుతంగా కరుణ రసాత్మకంగా చిత్రించిన నవల ఇది. 1947 ఆగస్టు 15న మత ప్రాతిపదికన విడిపోయిన పాకిస్తాన్, హిందూస్తాన్ అనే రెండు దేశాల ప్రజల మధ్య ఆత్మీయుల ఎడబాటుతో పెగిలిన గుండె ఘోష ఈ నవల. హుందర్మో, బ్రోల్మో అనే రెండు గ్రామాల కథ.



## ఆరెస్సెస్ లోగుట్టు

**రచన : రావు సాహెబ్ కాస్బి**
**వెల : 150 పేజీలు : 160**
**ప్రతులకు : 040 27660013, 27673787**

**మ**తోన్మాద శక్తులు కేంద్రంలో అధికారాన్ని కైవసం చేసుకొని బరితెగించి వ్యవహరిస్తున్న నేటి తరుణంలో ఈ పుస్తకాన్ని చదవాలి. హిందుత్వ లక్ష్యాల లోగుట్టును ప్రతిభావంతంగా విప్పి చెప్పారు రచయిత. నాటి జనతా ప్రభుత్వ హయాంలో తన ప్రాబల్యాన్ని విస్తరించుకోవడానికి ఆరెస్సెస్ ప్రయత్నిస్తున్న సమయంలో వెలువడిన ఈ పుస్తకం నాడు గొప్ప ప్రకంపనలు సృష్టించింది. దానికి తెలుగు అనువాదమే 'ఆర్ఎస్ఎస్ లోగుట్టు. రచయిత కాస్బి ఒక రాజనీతి శాస్త్రవేత్త.



# కవయిత్రి ఇందిర కన్నుమూత

**గ**జల్ రచయిత్రి, కవయిత్రి భైరి ఇందిర (60) గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ... 19.2.2023వ తేదీన హైదరాబాదులో కన్నుమూశారు. కడదాకా నిండైన ఆత్మస్థైర్యంతో జీవించి, అందరికీ స్ఫూర్తిని పంచి, 'నేను పోయినప్పుడు' అనే తన వీలునామా కవితను రాసుకున్న అక్షరజీవి ఇందిర. ఖమ్మం జిల్లా ఇల్లెందులో భైరి రామ్మూర్తి – వెంకటరమణ దంపతులకు 19 డిసెంబర్ 1962న ఆమె జన్మించారు. ఇల్లందు ,హైదరాబాదు, వరంగల్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి ఉపాధ్యాయ శిక్షణ కూడా చేశారు.

తండ్రి ప్రోత్సాహంతో సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. వివాహానంతరం దీక్షతో చదివి 1997లో ప్రభుత్వ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లాలోని మాణిక్యారం ఉన్నత పాఠశాలలో తన ఉద్యోగ జీవితానికి శ్రీకారం చుట్టారు. యుటిఎఫ్, సాహితీ స్రవంతి లలో పనిచేశారు. అక్షరాస్యత ఉద్యమంలోనూ, సైన్సు ప్రచార ఉ ద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నారు. ఎన్నో ప్రచార గీతాలు రాశారు. తనదైన అంకితభావంతో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు.

9వ తరగతిలోనే ఇందిర 'ఉక్కు పిడికిళ్ళు' పేరిట ఓ కవిత రాశారు. 1996 నుంచి తన సాహితీ సృజనను విస్తృతం చేశారు. తరచూ కవిత్వం రాస్తూ స్థానిక సంస్థల కవి సమ్మేళనాల్లో పాల్గొనేవారు. తనలోని అభ్యుదయ భావాలకు కవిత, మినీ కవిత, గేయం, కథ, వంటి ప్రక్రియలను వేదికలుగా చేసుకున్నారు. చివర్లో మిత్రుల సూచనల మేరకు గజల్ రచన చేపట్టి అందరినీ అబ్బుర పరుస్తూ అనేక శక్తివంతమైన గజల్స్ రాసి తెలంగాణా 'తొలి గజల్ రచయిత్రి'గా పేరొందారు. అలవోకలు (2005), అభిమతం(2007) హైకు/మినీ కవితా సంపుటాలు, తెలంగాణ గజల్ కావ్యం (2016), మన కవులు గజల్ (2018) ఘనచరితలు గేయ కవిత్వం (2019) వంటివి వెలువ రించారు. తన సాహితీ కృషికి పలు పురస్కారాలు పొందారు. ఆమె మృతికి సాహితీ స్రవంతి, తెలంగాణా సాహితి, టియుటిఎఫ్, ప్రజా నాట్యమండలి సంతాపం ప్రకటించాయి. ఒక మంచి రచయిత్రిని, సామాజిక కార్యకర్తనూ కోల్పోయామని విచారం వ్యక్తం చేశాయి.


## FORM IV

(Rule 8)

UNDER PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867
STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS
ABOUT MONTHLY -SHAHITYA PRASTHANAM


1. Place of Publication : Hyderabad
2. Periodicity of its Publication : Monthly
3. Printer's Name : V. Krishnaiah
   1 (a) Whether a citizen of India : YES
   (b) If a foreigner, the country of origin : -
   Address : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020
4. Publisher's Name : V. Krishnaiah
   1 (a) Whether a citizen of India : YES
   (b) If a foreigner, the country of origin : -
   Address : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020
5. Editor's Name : T. RAVI
   Nationality : INDIAN
   1(a) Whether a citizen of India : YES
   (b) If a foreigner, the country of origin : -
   Address : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020
6. Name and addresses of owner : V. Krishnaiah
   1(a) Whether a citizen of India : YES
   (b) If a foreigner, the country of origin : -
   Address : H.No. 1-1-298/4, Street No. 1, Ashoknagar, Hyderabad - 500 020

**I, V. KRISHNAIAH, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

Sd/
V. KRISHNAIAH
Publisher


Date: 01.03.2023


**ఆర్సీ కృష్ణస్వామి రాజు రచించిన 'కార్వేటి నగరం' బాలల బొమ్మల పుస్తక ఆవిష్కరణ 25.2.2023న చిత్తూరు జిల్లా కార్వేటినగరం డైట్ కళాశాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీ రామ్ పురుషోత్తం, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మధురాంతకం నరేంద్ర, బాల సాహితీవేత్త డాక్టర్ ఎమ్.హరికిషన్, ఆకాశవాణి విశ్రాంత అధికారి ఎ.మల్లేశ్వర రావు, సాహితీ ప్రియులు ఆర్.ప్రభాకర్, గాజుల నాగేశ్వర రావు, నాగరాజు నాయక్, బి.చెంగల్రాజు తదితరులు హాజరయ్యారు.**



# మునిమాణిక్యం నరసింహారావు

జననం : 15.03.1891  మరణం : 03.02.1973



అప్పులు చేయడం-తీర్చడం, దాంపత్యోపనిషత్,
గృహప్రవేశం, హాస్య కుసుమావళి, కాంతం కథలు
వంటి రచనలు ప్రాచుర్యం పొందాయి. తెలుగునాట
మధ్య తరగతి జీవితాలను తన రచనలలో చిత్రించారు.
భార్యాభర్తల అనుబంధాలను ఆహ్లాదంగా, హాస్యభరితంగా రాశారు.

SAHITYA PRASTHANAM ▪ SAMPUTI - 4 ▪ SANCHIKA - 6 ▪ KRISHNA ▪ March 2023
RNI NO.APTEL/2004/18396 ▪ Postal Regd. No.VJ/187/2023-25 PAGES : 68
Date of Posting : 2nd of Every Month ▪ Date of Publication : 27.02.2023

